
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 230
శుక్రవారం
5-5-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



రెజ్లర్ల దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత
పురుష పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ కన్నీరు పెట్టుకున్న మహిళా రెజ్లర్లు
6లో

కేసు ముగిస్తున్నాం: సుప్రీం
రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ఈ నిర్ణయం
12లో



మణిపూర్‌లో భీకర హింస
మణిపూర్‌లో ఎస్టీ హోదా కల్పించాలన్న మైతీ వర్గం డిమాండ్‌పై గిరిజనులు భగ్గుమన్నారు. పలుచోట్ల ఇళ్లు, వాహనాలకు నిప్పుపెట్టారు.
వివరాలు 6లో ▸



'సరిహద్దు' పరిష్కారానికి పెద్దపీట
సంబంధాల బలోపేతానికి సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడం ముఖ్యమని చైనాకు విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు.
వివరాలు 6లో ▸



జెలెన్‌స్కీ అంతం తప్పదు
ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అంతం చేయడం మినహా తమకు మరో మార్గం లేదని రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ అన్నారు.
వివరాలు 6లో ▸



కర్ణాటక 'సెంట్రల్' ఎవరివైపు!
32 నియోజకవర్గాలున్న సెంట్రల్ కర్ణాటకలో అధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.
వివరాలు 6లో ▸

ఏది నిజం?
గంతలు కట్టేందుకే కట్టుకథలు
- ఇటు.. భోగాపురం ఎయిర్‌పోర్ట్, అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- అటు.. చంద్రబాబు సర్కారు అవినీతిపై సిట్ దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి
- వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే వివేకా హత్యపై ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం
- 10 రోజుల క్రితమే సీబీఐ అఫిడవిట్.. కౌంటర్ కూడా దాఖలు చేసిన ఎంపీ అవినాశ్‌రెడ్డి
- పాత చింతకాయ పచ్చడినే తాజాగా వడ్డించేందుకు చంద్రబాబు ఆపసోపాలు
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికలపైనా వక్రీకరణ

4లో

అకాల కష్టం
అండగా ఉందాం
అన్నదాతలను పూర్తి స్థాయిలో ఆదుకోవాలి: సీఎం వైఎస్ జగన్
పంట నష్టపోయిన రైతన్నకు పరిహారం అందలేదనే మాటే రాకూడదు

- పంటలు కొనుగోలు చేయడం లేదన్న మాటే వినిపించకూడదు
- రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరం చేయాలి
- ఆర్బీకేల స్థాయిలో నిశితంగా పర్యవేక్షణ జరగాలి
- ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలి
- అన్నదాతల ముఖంలో చిరునవ్వు కనిపించేలా అధికారుల చర్యలుండాలి



సాక్షి, అమరావతి: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన అన్నదాతలకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. పంట నష్టపోయిన రైతుల్లో ఏ ఒక్కరికీ పరిహారం అందలేదన్న మాటే రాకూడదని, పంటలు కొనుగోలు చేయడం లేదన్న మాట ఎక్కడా వినిపించకూడదని స్పష్టం చేశారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్దేశించారు. ఆర్బీకేల స్థాయిలో నిశితంగా పర్యవేక్షణ జరగాలని స్పష్టం చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఉదయం క్యాంపు కార్యాలయంలో సమీక్షించిన సీఎం జగన్ అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

సచివాలయాల్లో రైతుల జాబితాలు

వర్షాల వల్ల పంటలు సహా ఇతర నష్టాలకు సంబంధించి గ్రామ సచివాలయాల స్థాయిలోనే ఎప్పటికప్పుడు వివరాలను సేకరించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

సైబర్ వేధింపులపై ఉక్కుపాదం
- పోలీసుశాఖకు సీఎం జగన్ ఆదేశం
- మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- ఆగడాలపై కఠిన చర్యలు.. అందుకోసం ప్రత్యేక విభాగం
- ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేసేలా భరోసా
- దిశ వ్యవస్థ మరింత బలోపేతం.. ఇంటింటి ప్రచారం.. మహిళా పోలీసులకు ప్రొటోకాల్
- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో దిశ పోలీస్ స్టేషన్
- గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు నిరంతర పర్యవేక్షణ

2లో

ఫ్యాక్ట్ చెక్
హవ్వ..! ఇదేం తీరు రామోజీ?
- నాడు వైఎస్ జగన్ వ్యతిరేకించింది బలవంతపు భూసేకరణనే కదా?
- విమానాశ్రయానికి 12,000 ఎకరాలు అవసరం లేదని చెప్పలేదా?
- ఇపుడు పునరావాస కాలనీలు పూర్తయి; స్వచ్ఛందంగా తరలింపు
- పైగా నిర్మిస్తున్నది 2,200 ఎకరాల్లోనే.. ఈ నిజం చెప్పని 'ఈనాడు'
- అనుమతులేవీ లేకున్నా ఎన్నికల ముందు చంద్రబాబు ఫేక్ శంకుస్థాపన
- అయినా ప్రశ్నించకుండా ఆకాశానికెత్తేసిన రామోజీరావు
- ఇపుడు అనుమతులన్నీ తెచ్చి, భూసేకరణ పూర్తిచేశాకే భూమిపూజ
- అయినా సరే... సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తూ రాతలు

10లో

కొత్త కొలువు.. డ్రోన్ పైలెట్!
- గ్రామీణ యువతకు బృహత్తర బాధ్యతలు.. ప్రణాళిక రూపొందించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- డ్రోన్ పైలెట్లుగా వ్యవసాయ, ఇతర రంగాల్లో భాగస్వామ్యం
- ఏపీ ఎన్జీ రంగా వర్సిటీ ద్వారా 12 రోజుల సర్టిఫికెట్ కోర్సు.. శిక్షణ పొందిన వారికి వివిధ రంగాల్లో ఉపాధి
- రైతులకు దన్నుగా నిలుస్తున్న డ్రోన్లు
- ఆర్బీకేల పరిధిలో డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం

2లో

మచిలీపట్నం వైద్య కళాశాలకు గ్రీన్‌సిగ్నల్
- ఇప్పటికే విజయనగరం, నంద్యాల, ఏలూరుకు అనుమతులు
- దీంతో నాలుగు వైద్య కళాశాలలకు 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు
- రాజమండ్రి వైద్య కళాశాలకు రావల్సి ఉన్న అనుమతులు
- 22న బందరు పోర్టుకు సీఎం జగన్ శంకుస్థాపన

14లో

ఏఎంసీ.. లాభాలతో మెరిసి
ఆదాయం అదుర్స్



ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డు

ఆర్థిక పరిపుష్టి దిశగా మార్కెట్ యార్డులు
- ఏడు చోట్ల లక్ష్యానికి మించి వసూళ్లు
- ప్రథమ స్థానంలో నూజివీడు ఏఎంసీ
- ఉమ్మడి జిల్లాలో 19 మార్కెట్ కమిటీలు

ఆకివీడు: వ్యవసాయ మార్కెట్ కమిటీలు (ఏఎంసీ) ఆర్థిక పరిపుష్టి దిశగా ముందుకు సాగుతున్నాయి. రైతులు పండించిన వివిధ రకాల పంటలు మార్కెట్ యార్డుల్లో విక్రయాల ద్వారా క్వింటాల్‌కు 25 పైసల నుంచి రూ.2 వరకు మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నాయి. ఇలా సమకూరిన ఆదాయంతో రైతులకు ఉపయోగకరంగా పుంత రోడ్ల అభివృద్ధి, రైతు బంధు పథకం వంటివి అమలు చేస్తున్నారు. 2022–23లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మార్కెట్ కమిటీలు రికార్డు స్థాయిలో ఆదాయాన్ని గడించాయి. మొత్తం 19 ఏఎంసీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో మూడు, ఏలూరు జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధించాయి. కొన్ని కమిటీలు 124 వరకు లక్ష్యాన్ని సాధించాయి. మొత్తంగా రూ.104.52 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యం కాగా రూ.94.09 కోట్లు వసూలు చేశారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది (2023–24)లో ఏలూరు జిల్లా పరిధిలోని మార్కెట్ కమిటీల ద్వారా సుమారు రూ.48.45 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని మార్కెట్ కమిటీల ద్వారా సుమారు రూ.65.40 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. బడ్జెట్ ఆమోదం తర్వాత ఆయా మార్కెట్ కమిటీలకు లక్ష్యాలను మార్కెటింగ్ శాఖ ప్రకటించనుంది.

రికార్డుల దిశగా మార్కెట్ కమిటీలు

ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీల పరిధిలోని చెక్‌పోస్టుల ద్వారా పన్ను వసూళ్లు చేస్తున్నారు. జిల్లా సరిహద్దులు, మార్కెట్ కమిటీల సరిహద్దులో చెక్‌పోస్టులు ఉన్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లాలోని పలు ఏఎంసీలు లక్ష్యానికి మించి పన్ను వసూళ్లు చేశాయి.
- పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి మార్కెట్ కమిటీ పరిధిలో రూ.9.20 కోట్లు లక్ష్యం కాగా రూ.11.42 కోట్లు వసూలు చేసి 124.13 శాతం లక్ష్యాన్ని అధిగమించారు.
- ఆకివీడు మార్కెట్ కమిటీ రూ.5 కోట్లకు గాను రూ.5.06 కోట్లు వసూలు చేసింది.
- పాలకొల్లు మార్కెట్ కమిటీ రూ.5.25 కోట్లకు గాను రూ.5.40 కోట్లు వసూలు చేసింది.
- ఏలూరు జిల్లా పరిధిలో నూజివీడు మార్కెట్ కమిటీ రూ.2.35 కోట్లకు గాను రూ.3.03 కోట్లు వసూలు చేసి ఉమ్మడి జిల్లాలోనే 128.88 శాతం వసూళ్లతో మొదటి స్థానంలో నిలిచింది.
- ఏలూరు మార్కెట్ కమిటీ రూ.2.45 కోట్లకు గాను రూ.2 కోట్ల 45 లక్షల 11 వేలు వసూలు చేసింది.
- పోలవరం మార్కెట్ కమిటీ రూ.4.60 కోట్లకు గాను రూ.4.64 కోట్లు వసూలు చేసింది.
- ఉంగుటూరు మార్కెట్ కమిటీ రూ.4.70 కోట్లకు గానూ రూ.4.74 కోట్లు వసూలు చేసింది.

ఆదాయాన్ని సమకూర్చే పంటలివే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 19 మార్కెట్ యార్డుల ద్వారా చేపలు, రొయ్యలు, వరి, నిమ్మ, మొక్కజొన్న, కాటన్, కొబ్బరికాయలు తదితర పంటల విక్రయం ద్వారా మార్కెట్ సెస్ వసూలు చేస్తున్నారు. ధాన్యానికి క్వింటాళ్లకు రూ.2, ఇతర పంటలకు క్వింటాళ్లకు ఒక రూపాయి, చేపలకు 50 పైసలు, ఎగుమతి చేసే రొయ్యలకు 25 పైసలు, స్థానిక మార్కెట్‌లలో విక్రయించే రొయ్యలకు 50 పైసలు చొప్పున వసూలున్నారు.

పొగాకు రైతుకు అండ

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట అయిన పొగాకు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. రబీ సీజన్‌లో తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఊరటనిచ్చేలా అదనంగా పండించిన పొగాకుపై పెనాల్టీలు రద్దు చేయాలని సీఎం జగన్ కేంద్ర వాణిజ్యశాఖ మంత్రికి లేఖ రాశారు. మంత్రితో స్వయంగా మాట్లాడారు. ఆ పెనాల్టీలు రద్దయితే రైతులు నష్టాల నుంచి బయటపడతారు. సీఎం చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఒంగోలు



పొగాకు రైతుకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోంది. కష్టకాలం వచ్చినప్పుడల్లా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెన్నంటి ఉంటున్నారు. ధరలు పడిపోయినప్పుడు గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా పొగాకు బహిరంగ వేలంలోకి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతుకు భరోసా ఇచ్చారు. రూ.220 కోట్ల నిధులు కేటాయించి 2020–21 ఏడాదిలో పండించిన పొగాకు పంటను కొనుగోలు చేయించి నేరుగా రైతులను ఆదుకున్నారు. లో గ్రేడ్ పొగాకును కూడా ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వేలంలో పొగాకు వ్యాపారులు పోటీపడి కొంటున్నారు. దీంతో రైతుకు మంచి ధర వస్తోంది. అయితే 2022–23 పంట కాలంలో మాండూస్ తుఫాన్ పొగాకు రైతును నష్టపరిచింది. అందువల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు మరో అడుగు ముందుకేశారు. మాండూస్ తుఫాన్‌కు దాదాపు రాష్ట్రంలోని ఏడెనిమిది జిల్లాల్లో పొగాకు పంట నష్టపోయిన తీరును గుర్తించిన సీఎం వైఎస్ జగన్ రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని భావించారు. దీంతో పొగాకు బోర్డు విధించే పెనాల్టీలను రద్దు చేయాలంటూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. బోర్డు నిర్దేశించిన లక్ష్యానికి మించి పండించిన అదనపు పొగాకుపై విధించే పెనాల్టీలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

ఒక్కో రైతుపై రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెనాల్టీలు:

పొగాకు అదనపు పంటపై పొగాకు బోర్డు ఒక్కో రైతుకు ప్రతి సీజన్‌లో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెనాల్టీలు విధిస్తూ వస్తోంది. రైతు పండించిన అదనపు పొగాకు అమ్మకాలపై ప్రతి రూ.100 లకు రూ.5 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు (ఎస్‌బీఎస్), దక్షిణ ప్రాంత తేలకపాటి నేలల్లో (ఎస్ఎల్ఎస్) కలుపుకొని మొత్తం 24,353 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. వాటి పరిధిలో 30,240 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం 58,300 హెక్టార్లలో పొగాకు సాగు చేయాల్సి ఉండగా, 63,482 హెక్టార్లలో సాగు చేశారు. 5182 హెక్టార్లలో పొగాకును అదనంగా సాగు చేశారు.

రైతులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ
- అదనపు పొగాకుకు పెనాల్టీలు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ
- పెనాల్టీలు రద్దు చేస్తే ఒక్కో రైతుకు రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు ప్రయోజనం
- మార్క్‌ఫెడ్ ద్వారా గతంలో పొగాకు రైతులను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్
- మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొన్నప్పటి నుంచి వ్యాపారుల్లో పెరిగిన పోటీ

మాండూస్ తుఫాన్ వల్ల రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు ఖర్చు:

రబీ సీజన్‌లో వచ్చిన మాండూస్ తుఫాన్ వల్ల పొగాకు రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. రైతులు ముందు వేసిన పొగాకు పంట తీవ్రంగా దెబ్బతింది. వర్షాలకు ఉరకెత్తటంతో పొగాకు పంటను పూర్తిగా పీకేయాల్సి వచ్చింది. పంటను రెండో సారి వేశారు. దీంతో ఒక్కో రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు భారం రైతులపై పడింది. రెండుసార్లు వేయటం వల్ల నిర్దేశించిన పంట లక్ష్యం కంటే అదనంగా 5,182 హెక్టార్లలో పంట సాగు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దిగుబడి కూడా అధికంగా వచ్చింది. పొగాకు బోర్డు 87.61 మిలియన్ కేజీల పంట దిగుబడి లక్ష్యంగా ఇవ్వగా 107 మిలియన్ కిలోల పొగాకు పంట దిగుబడి వచ్చింది. అంటే 19.39 మిలియన్ కిలోల పొగాకు అదనంగా పండింది. అందుకోసం అదనపు పొగాకు పంటపై పెనాల్టీలు లేకుండా చేయాలని సీఎం వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రైతులు మాండూస్ తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని కనీసం కొంతైనా పూడ్చుకున్నట్లు అవుతుందని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో పొగాకు వేలం కేంద్రాలు:	11
మొత్తం పొగాకు బ్యారన్లు:	24,353
పొగాకు రైతులు:	30,240 మంది
బోర్డు పంట లక్ష్యం:	87.61 మిలియన్ కేజీలు
ఉత్పత్తి అయింది:	107 మిలియన్ కేజీలు
అదనంగా పండింది:	19.39 మిలియన్ కిలోలు

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్



రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్. రైతుకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించే నైజం ఆయనది. మాండూస్ తుఫాన్‌కు పొగాకు రైతులు నష్టపోయిన తీరును చెప్పగానే వెంటనే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. లేఖ రాయటంతో పాటు ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడి మమ్మల్ని పర్యవేక్షించమని ఢిల్లీకి పంపారు. దాంతో ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ కార్యాలయంలో పెనాల్టీలు రద్దు చేసేలా కేంద్ర మంత్రితో పాటు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం.

– ఎంవీఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్

వాణిజ్య శాఖాధికారులతో సంప్రదిస్తున్నారు



సీఎం వైఎస్ జగన్ పొగాకు రైతులను ఆదుకునేందుకు పెనాల్టీలు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాశారు. పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు కూడా కేంద్ర వాణిజ్య శాఖ కార్యాలయ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. గతంలో రైతులకు పొగాకుకు సరైన ధర లేనప్పుడు మార్క్‌ఫెడ్‌ను బహిరంగ వేలంలోకి దించి ఆదుకున్నారు. దాంతో వ్యాపారుల్లో పొగాకు కొనుగోలు విషయంలో పోటీ పెరిగింది. దీంతో ప్రస్తుత వేలంలో మంచి ధరలు వస్తున్నాయి.

– మారెడ్డి సుబ్బారెడ్డి, పొగాకు బోర్డు సభ్యులు

పెనాల్టీలు రద్దు చేస్తే రైతులు ఒడ్డున పడతారు



మాండూస్ తుఫాన్ వల్ల పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొగాకు అదనపు పంటపై బోర్డు పెనాల్టీలు రద్దు చేస్తే రైతులు ఒడ్డున పడతారు. తుఫాన్ వల్ల వేసిన పంటను పీకేసి మళ్లీ వేయాల్సి రావడంతో ఒక్కో రైతు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోయాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకోవాలనే రైతు భరోసా కేంద్రాలు గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు.

– బందారు రామాంజనేయులు, పొగాకు రైతు, చదలవాడ

క్లుప్తంగా

8న ఈవో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 8న పరిశీలించనున్నట్టు ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ఇప్పటికే కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు వివరించింది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి మెమో, చెక్ లిస్ట్, అటెస్టేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని వాటితోపాటు సంబంధిత సర్టిఫికెట్లు, ఇతర పత్రాలతో విజయవాడలోని కమిషన్ కార్యాలయానికి ఈ నెల 8న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించింది.

ఎస్పీఎఫ్ పోలీసులకు వైద్య శిబిరం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది, అధికారులకు గురువారం ఎస్పీఎఫ్ ఆఫీస్ ఆవరణలో విజయవాడ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీఎఫ్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించామని చీఫ్ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. పలువురు ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందికి గుండె, షుగర్, బీపీ, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

భూసేకరణ చట్టంతో నిర్వాసితులకు న్యాయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్



చింతూరు: కేంద్రం 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం చింతూరులో ప్రచారభేరి ముగింపు సభలో ఆమె మాట్లాడారు. వామపక్ష ఐక్య పోరాటాలతోనే దేశంలో మార్పు సాధ్యమన్నారు. కేం ం దేశ సంపదను పెట్టుబడుదారులకు కట్టబెడుతుందని దుయ్యబట్టారు. శ్రామిక వర్గాలు దోపిడీకి గురవుతున్నాయని విమర్శించారు. మోదీ మన్ కీ బాత్ కాకుండా జన్ కీ బాత్ కోసం మాట్లాడాలన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోకపోవడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు.

కొత్త కొలువు.. డ్రోన్ పైలెట్!

గ్రామీణ యువతకు బృహత్తర బాధ్యతలు

- ప్రణాళిక రూపొందించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- డ్రోన్ పైలెట్లుగా వ్యవసాయ, ఇతర రంగాల్లో భాగస్వామ్యం
- ఏపీ ఎన్జీ రంగా వర్సిటీ ద్వారా 12 రోజుల సర్టిఫికెట్ కోర్సు
- శిక్షణ పొందిన వారికి వివిధ రంగాల్లో ఉపాధి
- వ్యవసాయ రంగంలో రైతులకు దన్నుగా నిలుస్తున్న డ్రోన్లు
- ఆర్బీకేల పరిధిలో డ్రోన్లను అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే 8 బ్యాచ్‌లలో 135 మంది రైతులకు పైలెట్ శిక్షణ
- జూలై నుంచి చదువుకున్న యువతకు కూడా శిక్షణ
- వ్యవసాయ డిప్లొమా, ఇంజినీరింగ్ పట్టభద్రులకు అవకాశం
- గుంటూరు లాం, తిరుపతి, కడప, మార్టేరు, విజయనగరంలో ట్రైనింగ్



ఫీల్డ్‌లో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న, శిక్షణలో ఉన్న రైతు

సాక్షి, అమరావతి: గ్రామీణ యువతకు వైఎస్ జగన్ ప్రభుత్వం బృహత్తర బాధ్యతలు అప్పజెబుతోంది. వ్యవసాయ, ఇతర రంగాల్లో డ్రోన్ల వినియోగంలో వారిని భాగస్వాములను చేస్తోంది. ఇందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ నాలుగేళ్లలో లక్షలాది యువతకు ఉద్యోగాలు కల్పించారు. ఉన్నత విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చి, యువతకు చదువుతోపాటే వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. చదువు పూర్తయిన వెంటనే ఉపాధి లభించేలా తీర్చి దిద్దుతున్నారు. ఇప్పుడు గ్రామాల్లోని చదువుకున్న యువతకు డ్రోన్ పైలెట్ శిక్షణ ఇచ్చి, గ్రామీణ ప్రాంత కార్యకలాపాల్లో పాలుపంచుకొనేలా చేస్తున్నారు. తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది.

80 వేల మంది అవసరం

ఒక్క వ్యవసాయ అవసరాలకే 20 వేల మంది డ్రోన్ పైలెట్లు అవసరమవుతారని అంచనా. ఇతర అవసరాల కోసం కూడా పరిగణనలోకి తీసుకుంటే 80 వేల మందికి పైగా డ్రోన్ పైలెట్లు అవసరమవుతారు. ఈ నేపథ్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణనిచ్చి ప్రొఫెషనల్స్‌గా తయారు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా 12 రోజుల సర్టిఫికెట్ కోర్సును రూపొందించింది.

12 రోజుల పాటు ఉచిత శిక్షణ

వ్యవసాయ కూలీల కొరతకు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో 10 వేల ఆర్బీకేల్లో కిసాన్ డ్రోన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. తొలి దశలో జూలైలోగా 500 ఆర్బీకేల పరిధిలో, డిసెంబర్ కల్లా మరో 1500 ఆర్బీకేల్లో వీటిని ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం సీహెచ్‌సీ గ్రూపుల్లో చదువుకున్న రైతులకు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గుంటూరు లాంలోని వ్యవసాయ డ్రోన్ పరిశోధన కేంద్రం సెంటర్ ఫర్ అప్సరా ద్వారా సంప్రదాయ వ్యవసాయ డ్రోన్ల రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కోర్సు (ఆర్పీటీసీ)లో 12 రోజులు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పాఠ్య ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 8 బ్యాచ్‌లలో 135 మంది రైతులకు శిక్షణనిచ్చారు. మిగిలిన వారికి జూలైకల్లా శిక్షణ ఇస్తారు. ఇప్పుడు యువతకూ ఈ శిక్షణ ఇస్తారు.

3 ఏళ్లపాటు ఆర్బీకేల్లో పనిచేయాలి

వ్యవసాయ డిప్లొమా, లేదా ఏదైనా ఇంజినీరింగ్ పట్టభద్రులైన యువతకు ఈ శిక్షణ ఇస్తారు. కనీసం 3 ఏళ్ల పాటు ఆర్బీకేల్లో పని చేసేందుకు ముందుకొచ్చే వారికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఉచితంగా ఇస్తారు.

డ్రోన్లదే కీలక పాత్ర

వ్యవసాయ రంగంలో ఇప్పుడు డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎరువులు, పురుగు మందుల పిచికారీ, ఇతర అవసరాలకు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఈ రంగంలో 22 రకాల పనులు చేసేందుకు వీలుగా డ్రోన్లను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా ఆర్బీకేల పరిధిలో కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తెస్తోంది. వీటి వినియోగానికి ఇప్పటికే రైతులకు డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇస్తోంది. ఆర్బీకేలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కిసాన్ డ్రోన్స్ నిర్వహణ కోసం ఏపీ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం సహకారంతో చదువుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఈ శిక్షణ ఇస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేసి భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా గ్రామీణ నిరుద్యోగ యువతకు కూడా డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది.

ఇతర రంగాల్లో డ్రోన్స్‌పై శిక్షణ పొందాలంటే ఫీజులు చెల్లించాలి. జూలై నుంచి దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం సీఎం జగన్ ఆదేశాల మేరకు కొత్తగా అప్సరా కేంద్రంతో పాటు తిరుపతి, కడప, మార్టేరు, విజయనగరంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో శిక్షణ ఇచ్చేందుకు 20 మంది మాస్టర్ ట్రైనీలను నియమించనున్నారు. ఇప్పటికే 10 మంది శాస్త్రవేత్తలతో పాటు వర్సిటీలో వ్యవసాయ డిప్లొమా చదువుతున్న 125 మందికీ అప్సరా ప్రత్యేక శిక్షణనిచ్చింది.

శిక్షణలో ఎన్నో నేర్చుకున్నాం



ఎన్జీ రంగా వర్సిటీ ఇచ్చిన శిక్షణలో ఎంతో నేర్చుకున్నాం. డ్రోన్స్ ఫ్లై చేయగలమన్న నమ్మకం ఏర్పడింది. పొలంలో సూక్ష్మ ఎరువులు, పురుగుల మందులు నేరుగా పిచికారీ చేయగలిగే సామర్థ్యం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల్లో కిసాన్ డ్రోన్స్ ఏర్పాటు చేస్తోంది. వ్యవసాయ అవసరాలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

–కొప్పుల బ్రహ్మానందరెడ్డి, నంద్యాల

చిన్న చిన్న రిపేర్లు కూడా చేసుకోగలం



3 రోజుల థియరీ క్లాసెస్, డ్రోన్ అసెంబ్లింగ్, డిస్ అసెంబ్లింగ్.. ఒక రోజు సెమిలరీ ప్రాక్టీస్, ఫీల్డ్ లెవల్‌లో శిక్షణ ఇచ్చారు. ఇక్కడ నుంచి దృఢమైన నమ్మకంతో వెళ్తున్నాం. డ్రోన్ ఫ్లై చేయగలను. చిన్న చిన్న రిపేర్లు వచ్చినా సరిచేయగలను.

– యు.కామేశ్వరరావు, సీతారాంపురం, ప్రకాశం జిల్లా

నిరుద్యోగ యువతకు శిక్షణ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా వ్యవసాయ, సంప్రదాయ డ్రోన్లపై నిరుద్యోగ యువతను డ్రోన్ పైలెట్లుగా తీర్చిదిద్దాలని సంకల్పించాం. ఇందుకోసం వ్యవసాయ శాఖతో కలిసి కార్యాచరణ సిద్ధం చేశాం. గుంటూరు లాంతో పాటు మరో నాలుగు చోట్ల శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశాం.

– ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి, వీసీ, ఏపీ ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ



శిక్షణ పొందిన రైతులతో శాస్త్రవేత్తల బృందం

అకాల కష్టం.. అండగా ఉందాం

▶ మొదటి పేజీ తరువాయి

నష్టపోయిన రైతుల జాబితాలను సామాజిక తనిఖీల కోసం సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. తద్వారా ఎవరైనా మిగిలిపోతే వెంటనే అధికారుల దృష్టికి తెచ్చేందుకు వీలుంటుందన్నారు.

వేగంగా రబీ ధాన్యం కొనుగోలు

రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. పంటను కొనుగోలు చేయడం లేదన్న మాట ఎక్కడా వినిపించకూడదని స్పష్టం చేశారు. రైతుల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు చేపట్టాలన్నారు. రైతన్నల ముఖంలో చిరునవ్వు కనిపించేలా అధికారుల చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. రానున్న రోజులకు సంబంధించి వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు వివరాలు తెప్పించుకుంటూ వర్ష ప్రభావిత ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రతి జిల్లాకు వ్యవసాయ శాస్త్రవేత్త

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి సమీక్షలో అధికారులు వివరించారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా సాగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 5.22 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. పంట కోతలు పూర్తి కాని ప్రాంతాల్లో ఏం చేయాలన్న అంశంపై రైతులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. పంటలు కోసిన చోట పనలు తడిస్తే ఉప్పు ద్రావణం చల్లడం లాంటి విధానాలను పాటించడంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాకు ఒక వ్యవసాయ శాస్త్రవేత్తను అందుబాటులో ఉంచి స్థానిక అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ధాన్యం భద్రంగా గోడౌన్లకు తరలింపు

వివిధ కొనుగోలు కేంద్రాలు, ఆర్బీకేలు, రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను భద్రంగా ప్రభుత్వ భవనాలు, గోడౌన్లలోకి తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు ఊపందుకున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్స్ తెరిచామని, యంత్రాంగం అంతా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

సైబర్ వేధింపులపై ఉక్కుపాదం

- పోలీసుశాఖకు సీఎం జగన్ ఆదేశం
- మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం



హోంశాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'మహిళలు, చిన్నారులపై సైబర్ వేధింపులను పూర్తిగా నిరోధించాలి. సోషల్ మీడియా ద్వారా వారిపై జరుగుతున్న వేధింపులను కఠినంగా అణచివేయాలి. అందుకోసం ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలి' అని పోలీస్ శాఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. సైబర్, సోషల్ మీడియా వేధింపులపై బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేసే వ్యవస్థను తెచ్చి ఆధునిక పరిజ్ఞానంతో సాయంతో దోషులకు సత్వరం శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దిశ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించేందుకు ఇంటింటి ప్రచారాన్ని చేపట్టాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో హోంశాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ మహిళలు, చిన్నారుల భద్రతపై దిశా నిర్దేశం చేశారు.

మూలాల్లోనే తుంచేయాలి..

మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దు. దిశ వ్యవస్థ ద్వారా ఇప్పటికే దేశానికి ఆదర్శంగా నిలిచాం. సైబర్ వేధింపుల నివారణలోనూ అదే స్ఫూర్తితో పని చేయాలి. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలను పరిశీలించాలి. సోషల్ మీడియా వేధింపులు పోలీసులకు సవాల్ లాంటివి. రానున్న రోజుల్లో అవి మరింత పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నేరాలకు మూలాలు సోషల్ మీడియాలోనే కనిపిస్తున్నాయి. అక్కడ గుర్తించి తుంచగలిగితే చాలామందికి భద్రత కల్పించగలం. కొందరు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో వారిపై వేధింపులను గుర్తించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. డ్రగ్స్ పంపిణీ కూడా సోషల్ మీడియా మాధ్యమాల ద్వారానే జరుగుతోంది. పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. అందుకోసం ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలి. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) తరహాలో ఈ విభాగాన్ని కూడా సమర్థంగా నిర్వహించాలి. ఆ విభాగానికి అదనపు డీజీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించాలి.

ధైర్యంగా ఫిర్యాదు... శాఖల్లో సమన్వయం

నేరాలు, వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడే పరిస్థితి ఉండకూడదు. పౌరులు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకొచ్చేలా ప్రోత్సహించాలి. ఫిర్యాదులు చేయడం వల్ల కేసులు పెరుగుతాయనే ఆందోళన వద్దు. ఫిర్యాదులే చేయకుంటే నేరాలను నియంత్రించలేం. మహిళలు, బాలికలపై వేధింపులు, ఇతరత్రా నేరాల నివారణకు విద్యాశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖతో పోలీసు శాఖ సమన్వయంతో వ్యవహరించాలి.

మహిళా పోలీసులకు ప్రొటోకాల్

గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసులకు కచ్చితమైన ప్రొటోకాల్ ఉండాలి. వారు పకడ్బందీగా పని చేస్తే పోలీసు శాఖకు మంచిపేరు వస్తుంది. మహిళా పోలీసులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలను సమగ్రంగా సమీక్షించాలి. మార్పులు చేర్పులపై చర్చించాలి. దీనివల్ల గ్రామ, వార్డు స్థాయిలో మహిళా పోలీసులపై గౌరవం పెరుగుతుంది. యాప్‌లను రూపొందించి మహిళా పోలీసులకు అవగాహన కల్పించాలి.

'దిశ'పై ఇంటింటి ప్రచారం

దిశ యాప్ పట్ల పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు మరోసారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. ప్రతి ఇంట్లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారో లేదో పరిశీలించాలి. మనం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను ప్రతి పోలీసు అధికారి ఓన్ చేసుకోవాలి. దిశ యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసేలా ప్రతి జిల్లాలో మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. దిశ యాప్ ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ కరపత్రాలు పంపిణీ చేయాలి. దిశ వ్యవస్థ పనితీరు, ఎంతమంది సహాయం పొందారు? ఎంతమందిపై కేసులు పెట్టారు? ఎంతమందికి శిక్షలు పడ్డాయనే వివరాలను ఆ కరపత్రంలో పేర్కొనాలి. రాష్ట్రంలో 1.50 కోట్ల ఇళ్లకు ఈ కరపత్రం చేరాలి. గ్రామాలు, వార్డుల్లో మహిళా పోలీసుల సేవల గురించి వివరించాలి.

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో దిశ పోలీస్ స్టేషన్

రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక దిశ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు 18 దిశ పోలీస్ స్టేషన్లున్నాయి. మిగిలిన చోట్ల కూడా త్వరగా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. మహిళల రక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు. ఒక అత్యాధునిక ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి.

'మత్తు'ను చిత్తు చేయాలి

గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. గంజాయి సాగుకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం గిరిజనులకు తోడ్పాటు అందించాలి. మాదక ద్రవ్యాలను పూర్తిగా నివారించాలి. రవాణా, పంపిణీ, వినియోగంపై ఉక్కుపాదం మోపాలి. కాలేజీల స్థాయి నుంచే ఇంటెలిజెన్స్‌కు సమాచారం రావాలి. డ్రగ్స్ నిర్మూలనకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌తో హోర్డింగ్‌లను అన్ని యూనివర్సిటీలు, కాలేజీల్లో నెలకొల్పాలి. విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించడం ముఖ్యం. లేదంటే ఉపయోగం ఉండదు. డ్రగ్ పెడలర్స్ పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. శిక్షలు పెంచేలా చర్యలు చేపట్టాలి. గంజాయి సాగు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల పంపిణీ, వినియోగాలను అడ్డుకోవడం ఎస్‌ఈబీ ప్రధాన విధి. అక్రమ మద్యం తయారీలో నిమగ్నమైన కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే చర్యలను వేగవంతం చేయాలి. క్రమం తప్పకుండా ఆయా ప్రాంతాలను పోలీసులు పరిశీలించాలి.

గంజాయికి అడ్డుకట్ట

- గంజాయి నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్ సమర్థంగా కొనసాగుతోంది. 2019- 20లో 17 గ్రామాల పరిధిలో 512.5 ఎకరాల్లో, 2021-22లో 313 గ్రామాల్లో 7,552 ఎకరాల్లో, 2022-23లో 54 గ్రామాల పరిధిలో 1,029 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేశారు.
- గిరిజనులకు ప్రత్యామ్నాయంగా ఇప్పటి వరకు 7,328 ఎకరాల్లో కాఫీ, నిమ్మ, జీడి, బత్తాయి, కొబ్బరి, రాజ్‌మా, చింత, కంది లాంటి పంటల సాగుకు సహకారం అందించారు.

నాణ్యతగా 'స్పందన'

స్పందన అర్జీలను సక్రమంగా పరిష్కరించడం, నాణ్యత అత్యంత ముఖ్యం. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం కిందకు దీన్ని తీసుకొస్తున్నాం. మే 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సిద్ధం కావాలి.

సమర్థంగా జీవో నంబర్ 1

రోడ్లపై సమావేశాలతో మనుషులు చనిపోయే పరిస్థితి ఉండకూడదు. సమావేశాలకు హాజరయ్యే కొద్దిమందిని ఎక్కువగా చూపించేందుకు కొందరు రోడ్లపై సమావేశాలు నిర్వహించి కిక్కిరిసేలా చేస్తున్నారు. ఇటీవల రెండు సమావేశాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అటువంటివి పునరావృతం కాకుండా నివారించేందుకు జీవో నంబర్ 1ను సమర్థంగా అమలు చేయాలి.

'దిశ'తో మహిళలకు పటిష్ట భద్రత

రాష్ట్రంలో పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను పోలీసు ఉన్నతాధికారులు సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. మహిళా పోలీసు వ్యవస్థతో నేరాలు తగ్గుముఖం పట్టాయని, హత్యలు 6 శాతం, అల్లర్లు 36 శాతం తగ్గినట్లు వెల్లడించారు. సమీక్షలో హోంమంత్రి తానేటి వనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు పలువురు పోలీసు, మహిళా–శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- దిశ యాప్‌తో ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో 1,36,73,452 మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 29 వేల ఘటనల్లో పోలీసులు తక్షణం స్పందించారు. 2,300 మంది మహిళలు, బాలికలకు భద్రత కల్పించారు. ఫిర్యాదు అందగానే పోలీసులు స్పందించే సమయం గణనీయంగా తగ్గింది.
- దిశ యాప్ ద్వారా కాల్ రాగానే పట్టణ ప్రాంతాల్లో 5 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 14 నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు.
- దిశ వ్యవస్థ ద్వారా కేసుల దర్యాప్తు సమయం తగ్గింది. 2020లో 99 రోజులు, 2021లో 56 రోజులు, 2022లో 47 రోజులు, 2023లో ఇప్పటివరకు 44 రోజుల్లో కేసుల దర్యాప్తు పూర్తైంది.
- పోక్సో కేసుల్లో 60 రోజుల్లో 94 శాతం కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేశారు. న్యాయస్థానాల ద్వారా 80 మంది నిందితులకు కఠిన శిక్షలు విధించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మూడు కేసుల్లో మరణశిక్షలు, 30 కేసుల్లో జీవిత ఖైదు శిక్షలు పడ్డాయి. 18 కేసుల్లో 20 ఏళ్లకు పైబడి, 22 కేసుల్లో పదేళ్లకుపైబడి, 7 కేసుల్లో ఏడేళ్లకు పైబడి శిక్షలు విధించారు.
- జీరో ఎఫ్ఐఆర్ విధానం ద్వారా 1,415 కేసులు నమోదు చేశారు.

నేడు 'కళ్యాణమస్తు, షాదీ తోఫా' నగదు జమ

- జనవరి–మార్చి త్రైమాసికంలో పెళ్లి చేసుకున్న అర్హులకు ప్రభుత్వం ఆర్థిక సాయం
- మొత్తం 12,132 మందికి రూ.87.32 కోట్ల లబ్ధి
- నేడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్
- ఇప్పుడు అందిస్తున్న సాయంతో కలిపి ఆరు నెలల్లోనే రూ.125.50 కోట్లు జమ



సాక్షి, అమరావతి: పేద కుటుంబాల్లో చెల్లెమ్మల వివాహాలకు అండగా నిలిచే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద శుక్రవారం అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ నగదు జమ చేయనున్నారు. ఈ మేరకు జనవరి–మార్చి త్రైమాసికంలో పెళ్లి చేసుకున్న 12,132 మంది లబ్ధిదారులకు రూ.87.32 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. తన క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి వారి ఖాతాల్లో సీఎం జగన్ నగదు జమ చేస్తారు. ఇప్పుడు అందిస్తున్న సాయంతో కలిపి గత ఆరు నెలల్లోనే ఈ పథకాల కింద 16,668 మంది లబ్ధిదారులకు మేలు జరిగినట్టవుతుంది. వీరి ఖాతాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.125.50 కోట్లు జమ చేసింది.

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా..

'పిల్లల చదువు ఇంటికి వెలుగు– ఇల్లాలి చదువు వంశానికే వెలుగు' అనే మాటను స్ఫూర్తిగా తీసుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఓవైపు పేద కుటుంబాల్లోని చెల్లెమ్మల పెళ్లిళ్లకు అండగా నిలుస్తోంది. మరోవైపు ప్రతి చెల్లెమ్మను, ప్రతి తమ్ముడిని విద్యావంతులుగా తీర్చిదిద్దడం, బాల్యవివాహాలను నివారించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడం వంటి సమున్నత లక్ష్యాలతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని చెల్లెమ్మలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, ముస్లిం మైనార్టీ చెల్లెమ్మలకు వైఎస్సార్ షాదీ తోఫాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది.

పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి..

కేవలం వందకు వంద శాతం అక్షరాస్యతే లక్ష్యంగా కాకుండా వందకు వంద శాతం గ్రాడ్యుయేట్‌లుగా పిల్లలను తీర్చిదిద్దాలన్న సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం కళ్యాణమస్తు, షాదీ తోఫాల కింద సాయం పొందడానికి పదో తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. వధువుకు కనీస వయసు 18 ఏళ్లు, వరుడికి 21 ఏళ్లు ఉండాలని నిర్దేశించింది. ఇంటర్ వరకు జగనన్న అమ్మఒడి కింద రూ.15 వేలు, జగనన్న విద్యా దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్స్, జగనన్న వసతి దీవెన కింద ఏటా రూ.20 వేల సాయం అందిస్తుండటంతో ఉన్నత చదువులు కూడా సాకారమవుతున్నాయి.

నాడు.. గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా కొన్ని వర్గాలకే ఆర్థిక సాయం అందేది. అది కూడా సకాలంలో అందరికీ అందేది కాదు. సాయం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేది. అర్హులైన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ నెలల తరబడి జాప్యం చేసి 2018 అక్టోబర్ నుంచి ఈ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం ఎత్తేసింది. 2018–19లో 17,709 మంది లబ్ధిదారులకు రూ.68.68 కోట్ల వివాహ ప్రోత్సాహకాలను చెల్లించకుండా ఎగ్గొట్టింది.

నేడు.. నేడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో లంచాలకు, వివక్షకు తావు లేకుండా, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక. పేదల ఇంట్లో పెళ్లి కూడా ఆనందానుభూతులను మిగిల్చేలా, గత ప్రభుత్వంలో అందిస్తామని ఎగ్గొట్టిన సాయానికి దాదాపు రెట్టింపు ఆర్థిక సాయం.

దరఖాస్తు ఇలా..

వధూవరులు వివాహమైన 30 రోజుల్లోపు తమ దగ్గరలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలను ధ్రువీకరించుకుంటారు. ఏటా ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్‌ల్లో ఆయా త్రైమాసికాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తారు. మధ్యలో దళారుల ప్రమేయం లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులైనవారికి నిర్ధారించిన మేరకు ఆర్థిక సాయం చేస్తారు. ఇందులో భాగంగా కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాల్లో, అదే కులంలో వివాహాలు చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

క్లుప్తంగా...

ఆర్టీసీలో మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయం

- బ్రేక్ జర్నీకి అవకాశం
- తొలి దశలో 137 కేంద్రాల నుంచి అమలు

సాక్షి, అమరావతి: విమాన ప్రయాణాల తరహాలో మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. ఒక పట్టణం లేదా నగరం నుంచి మరో పట్టణం, నగరానికి నేరుగా బస్సు సౌకర్యంలేనప్పుడు బ్రేక్ జర్నీ విధానంలో ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. తిరుపతి నుంచి భద్రాచలం వెళ్లేందుకు నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తిరుపతి నుంచి విజయవాడకు, అక్కడి నుంచి భద్రచలానికి ఒకేసారి రిజర్వేషన్ చేసుకోవచ్చు. అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి చెన్నై, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు కూడా బస్ రిజర్వేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించారు. బ్రేక్ జర్నీ సమయం కనీసం రెండు గంటల నుంచి గరిష్టంగా 22 గంటల వరకు ఉండవచ్చు. మొదటి దశలో రాష్ట్రంలో 137 పట్టణాలు, నగరాల నుంచి ఈ మల్టీ టికెటింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. ఆ తర్వాత దశల్లో మరిన్ని పట్టణాలకు ఈ సౌలభ్యాన్ని విస్తరించనుంది.

టెలీమానస్ 14416కు విస్తృత ప్రచారం కల్పించాలి

మీడియాకు ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ మానస విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం ఉంటుందన్న విషయం గుర్తిస్తే బలవన్మరణాలను నిరోధించవచ్చని నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) ఏలూరు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ మానస అన్నారు. ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14416 టోల్‌ఫ్రీ నంబర్ టెలీమానస్‌కు మీడియా మరింత ప్రాధాన్యమిచ్చి.. ప్రచారం చేయాలని కోరారు. ఫలితంగా బలవన్మరణాలు నిరోధించవచ్చన్నారు. 'ఆత్మహత్యలపై వార్తా కథనాలు–ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు, ఆత్మహత్యలు నిరోధించడంలో మీడియా పాత్ర' అనే అంశాలపై గురువారం జూమ్‌లో సమావేశం నిర్వహించారు. డాక్టర్ మానస మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించవచ్చన్నారు. వైద్య నిపుణులు పరిష్కార మార్గాన్ని సూచిస్తారని పేర్కొన్నారు. బెంగళూరు 'నిమ్‌హాన్స్' యూనివర్సిటీ ప్రొఫెసర్లు అనీష్ చెరియన్, ఆర్య తిరుమేని మాట్లాడుతూ ఆత్మహత్యల వార్తలను ప్రముఖంగా ప్రచురించవద్దని మీడియాను కోరారు. లేకపోతే అప్పటికే మానసికంగా ఒత్తిడికి గురైనవారు ఆత్మహత్యలకు ప్రయత్నించే అవకాశముందన్నారు.

వీడని వానలు

పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీగా కురిసిన వర్షాలు

సాక్షి నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గురువారం కూడా వర్షాలు కురిశాయి. జిల్లాలోని కాకుమాను మండలంలో 75, ప్రత్తిపాడులో 50.4, దుగ్గిరాలలో 41.2, వట్టిచెరుకూరులో 24.6, తెనాలిలో 23.8, మంగళగిరిలో 15, పెదకాకానిలో 13, చేబ్రోలులో 12.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాను వానలు వీడలేదు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 60 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 46.6, ఇరగవరంలో 32.2, ఆచంటలో 20, పోడూరులో 19, పెంటపాడులో 17, తణుకులో 15 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. రాయలసీమలోనూ పలుచోట్ల వర్షాలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 15 మండలాల్లో వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు అనంతపురం జిల్లాలోని 10 మండలాల పరిధిలో 4 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలోని 5 మండలాల పరిధిలో వర్షం కురిసింది.

వెలిగొండ సొరంగ పనులకు అంతరాయం



వెలిగొండ సొరంగాల్లోకి వెళ్తున్న వరదనీరు

పెద్దదోర్నాల: వర్షాల కారణంగా ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న వెలిగొండ ప్రాజెక్ట్ సొరంగ నిర్మాణ పనులకు అంతరాయం కలిగింది. నల్లమల అభయారణ్య ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల తీవ్రతకు వెలిగొండ హెడ్ రెగ్యులేటర్ పనులు జరుగుతున్న శ్రీశైలం ఎగువ ప్రాంతంలోని కొల్లంవాగు వద్ద వరద పోటెత్తుతోంది. హెడ్‌రెగ్యులేటర్ ద్వారా మొదటి సొరంగంలోకి ప్రవేశించి కొత్తూరు వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ ప్రాంతంలోకి భారీగా వరద నీరు చేరింది. వరద రెండో సొరంగంలోకి మళ్లటంతో సొరంగ నిర్మాణ ప్రాంతంలో 15 మీటర్ల మేర నిండిపోయింది. ప్రాజెక్టు సిబ్బంది బస చేసే రేకుల షెడ్డు, కూలెంట్ వాటర్ కోసం ఏర్పాటు చేసిన ట్యాంకుతోపాటు, కొన్ని పరికరాలు నీట మునిగాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన వరద నీటిని బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

తడిసినా తీసుకుంటాం

ధాన్యం రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం.. తడిసిన ధాన్యం ఆఫ్‌లైన్‌లో సేకరించేలా ఏర్పాట్లు

- డ్రయర్ ప్లాట్‌ఫారమ్, డ్రయర్లు ఉన్న మిల్లులకు తరలింపు
- ఆరబోత తర్వాత నిబంధనలు పరిశీలించి కొనుగోలు
- రబీలో ప్రాథమికంగా 30 లక్షల టన్నుల ధాన్యం సేకరణ అంచనా
- ఇప్పటికే 5.22 లక్షల టన్నులు కొనుగోలు.. రైతులకు రూ.803 కోట్లు చెల్లింపు
- ఖరీఫ్‌కి ముందే ఈ నెలలోనే పంట నష్ట పరిహారం చెల్లించేలా కసరత్తు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది



మాట్లాడుతున్న గోపాలకృష్ణ ద్వివేది. పక్కన అరుణ్‌కుమార్, వీరపాండియన్, హరికిరణ్

సాక్షి, అమరావతి: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద తిరస్కరించకుండా రైతులకు అండగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకుండా తొలుత తడిసిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొనసాగుతున్న వర్ష సూచనలతో రైతులు బయట ధాన్యాన్ని ఆరబెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. అటువంటి ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించి డ్రయర్ సౌకర్యం, డ్రయర్ ప్లాట్‌ఫారమ్ ఉన్న మిల్లులకు తరలిస్తున్నాం. అక్కడ ఆరబోత తర్వాత ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తాం' అని తెలిపారు. రబీలో 30 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. దీనికి అదనంగా ఆర్బీకేల వద్దకు ధాన్యం తెచ్చే ప్రతి రైతుకూ మద్దతు ధర అందిస్తామన్నారు. ఇప్పటివరకు 5.22 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 55 వేల మంది రైతులకు 21 రోజుల్లోపే రూ.803 కోట్లు చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. ధాన్యాన్ని వేగంగా కల్లాల నుంచి మిల్లులకు తరలించేందుకు రవాణా కోసం ఐదు గోదావరి జిల్లాలకు కలెక్టర్ కార్పస్ ఫండ్ కింద రూ.కోటి చొప్పున కేటాయించామన్నారు. కోటా పూర్తవగానే తిరిగి నిధులు అందిస్తామన్నారు. గత ఖరీఫ్‌లో 6.40 లక్షల మంది రైతుల నుంచి 35.41 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. దాదాపు రూ.7,208 కోట్లు (99 శాతం) చెల్లింపులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ధాన్యం సేకరణలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని కోరారు.

తొలిసారిగా జయ రకానికి మద్దతు ధర

తొలిసారిగా రాష్ట్రంలో 5 లక్షల టన్నుల బొండాలు (జయ రకం) ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఫలితంగా బయట మార్కెట్‌లో జయ రకం ధాన్యానికి మంచి ధర పలుకుతోందన్నారు. వేసవి ప్రారంభంలో పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా కొన్ని నియోజకవర్గాల్లో ధాన్యంలో నూక శాతం పెరిగినట్లు తెలిపారు. వీటిని బాయిల్డ్ రైస్ కింద కొనుగోలు చేస్తామన్నారు.

గోనె సంచులకు కొరత లేదు

వర్షాల నేపథ్యంలో నిత్యం ప్రతి జిల్లాలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ వేగంగా ధాన్యాన్ని తరలిస్తున్నట్లు పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ వీరపాండియన్ చెప్పారు. ఎక్కడా గోనె సంచులకు కొరత లేదన్నారు. ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బందులకు గురి చేసిన 31 మిల్లులపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌కు ముందే పరిహారం

రెండు నెలల క్రితం మార్చిలో కురిసిన అకాల వర్షాలతో 23,473 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బ తిన్నట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. దాదాపు రూ.34.22 కోట్ల పంట నష్ట పరిహారాన్ని రైతులకు ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే జమ చేస్తామన్నారు. వాటితో పాటే ప్రస్తుతం వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ఆ పరిహారాన్ని కూడా రైతులకు ఈ నెలాఖరులోగా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగియక ముందే రైతులకు పరిహారాన్ని చెల్లిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు రూ.1,911 కోట్ల మేర పంట నష్టం పరిహారాన్ని అందించినట్లు వెల్లడించారు.

8 వరకు వర్షాలు.. తగ్గగానే పంట నష్టం అంచనా

వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులను వేగంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది చెప్పారు. ఈ నెల 8వ తేదీ వరకు వర్ష సూచన ఉందన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పంట నష్టం అంచనాలు, ఆర్బీకేల్లో సోషల్ ఆడిట్ పూర్తి చేసి రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. ఎక్కువగా జొన్న, మొక్కజొన్న, వరి పంటలు ముంపునకు గురైనట్టు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వర్షాల నుంచి పంటలను రక్షించుకునేందుకు శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులుంటే వ్యవసాయశాఖ టోల్ ఫ్రీ నంబర్ 155251కు ఫిర్యాదు చేయాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకే కొంటాం


మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



గణపవరం: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ మేరకు సీఎం జగన్ ఆదేశాలిచ్చారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. ఆయన గురువారం ఏలూరు జిల్లా గణపవరంలో రైతులతో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల ఎంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల వద్ద ప్రతి గింజను ప్రభుత్వమే తీసుకుంటుందని, రైతులెవరూ ఆందోళన చెందవలసిన పని లేదన్నారు.

ఆ వెంచర్లను తొలగించండి

అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: నెల్లూరు మండలం అల్లీపురం రెవెన్యూ పరిధిలో ప్రధాన పంట కాలువలు, కాలువ పోరంబోకు స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని వెంచర్లు వేస్తున్నారంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. కాలువలు, నీటి వనరులను ఆక్రమించుకుని వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లను తొలగించాలని రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులను ఆదేశించింది. మొదట ఆక్రమణదారులకు నోటీసులిచ్చి సర్వే నిర్వహించాలని.. ఆక్రమణలపై వారి నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలంది. ఆ తరువాత సర్వే నివేదిక ప్రకారం ఆక్రమణలను తొలగించాలని, ఈ ప్రక్రియను కూడా మరో రెండు నెలల్లో పూర్తి చేయాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పు వెలువరించారు. ఆయకట్టు రైతులకు అత్యంతముఖ్యమైన కోడూరు, లేబూరు మేజర్ కాలువలతో పాటు ఇతర పంట బోదెలను ఆక్రమించి, అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ నెల్లూరు మండలం గుడిపల్లిపాడుకు చెందిన మేకల అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆక్రమణలను తొలగించి కాలువలన్నింటినీ పూర్వస్థితికి తీసుకొచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.శివారెడ్డి వాదనలు వినిపించారు.

ఉత్తరాంధ్రపై మీకెందుకు కడుపుమంట?

- అప్పుడు.. ఇప్పుడు సీఎం జగన్‌ది ఒకే స్వరం
- భోగాపురం విమానాశ్రయానికి 12 వేల ఎకరాల సేకరణకు చంద్రబాబు కుట్ర
- దాన్ని వ్యతిరేకించిన రైతులకు జగన్ మద్దతు
- అధికారంలోకి వచ్చాక హామీ ఇచ్చినట్లుగా 2,300 ఎకరాల భూసేకరణ చేశాం
- రైతులను ఒప్పించి, మెప్పించి.. పరిహారం ఇచ్చాం
- ఈనాడు అబద్ధపు రాతలపై చర్చించే దమ్ముందా రామోజీ?
- చంద్రబాబు, రామోజీరావులపై మంత్రి బొత్స ఆగ్రహం



సాక్షి, అమరావతి: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలకు చేరువలో భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయడంతో ప్రజలంతా ఆనందంగా ఉంటే మీకెందుకంత కడుపుమంట?... అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, 'ఈనాడు' రామోజీరావులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌ది అప్పుడు, ఇప్పుడూ ఒకే స్వరమని.. ప్రజల గొంతుకై నినదిస్తారని స్పష్టంచేశారు. చంద్రబాబుదే కంపునోరు.. రామోజీరావువే కంపు రాతలంటూ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, రామోజీరావులపై నిప్పులు చెరిగారు. ఆయన ఏమన్నారంటే..

టీడీపీ సర్కార్ హయాంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో భూములను దోచుకోవడానికి వీలుగా 12వేల ఎకరాలను సేకరించేందుకు చంద్రబాబు సర్వే జరిపించారు. ఆయన భూదోపిడీకి వ్యతిరేకంగా రైతులు పోరాటం చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ వారికి మద్దతుగా నిలిచారు. ఎయిర్‌పోర్టుకు 12 వేల ఎకరాలు అవసరంలేదని వైఎస్ జగన్ అప్పట్లో చెప్పారు. టీడీపీ సర్కార్ దౌర్జన్యంగా భూసేకరణ చేస్తే.. మేం అధికారంలోకి రాగానే వాటిని తిరిగిస్తామని వైఎస్ జగన్ చెప్పడం కూడా వాస్తవమే. దాని ఫలితంగానే.. ఈరోజు భూసేకరణను 2,300 ఎకరాలకు పరిమితం చేశాం. ఇవన్నీ నిజాలు కాదా.. ఇవి మీకు తెలియవా రామోజీ? రైతులను ఒప్పించి, మెప్పించి 2,300 ఎకరాలను సేకరించి, పరిహారం చెల్లించి, నిర్వాసితులకు పునరావాసం కల్పించాకనే భోగాపురం విమానాశ్రయం పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు.

అప్పట్లో ఆ కేంద్రమంత్రి ఎందుకు రాలేదు రామోజీ?

ఇక భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎప్పుడో శంకుస్థాపన చేశారని పెద్ద పెద్దగా అరుస్తున్నారు కదా? మరి అప్పట్లో ఆ కార్యక్రమానికి నాటి కేంద్ర విమానయాన శాఖ మంత్రి, ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎందుకు హాజరు కాలేదు? ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందనే భయంతోనే వారు మొహం చాటేసిన మాట వాస్తవం కాదా..? భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ నుంచి ఏ అంశంపైన అయినా చర్చకు సిద్ధమా రామోజీ?

ప్రజల ప్రయోజనాలు, అభివృద్ధే లక్ష్యం..

ప్రతిపక్ష నేత చంద్రబాబు ఏ పని చేసినా రాజకీయ లబ్ధినే ఆశిస్తారు కానీ.. ప్రజల ప్రయోజనాలు కానే కాదు. నిజానికి.. 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు భూసేకరణ చేయకుండానే భోగాపురం విమానాశ్రయానికి అప్పట్లో శంకుస్థాపన చేశారు. అదే సీఎం జగన్ భూసేకరణ, టెండర్ల ప్రక్రియ పూర్తయి.. అన్ని వివాదాలను పరిష్కరించాకే విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. ప్రజల ప్రయోజనాలు.. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగా మారుతున్న తరుణంలో.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం, 30 నెలల్లోనే పూర్తిచేయాలని కోరడం.. 2024, డిసెంబర్ నాటికే మొదటి విమానాన్ని ఇక్కడ్నుంచి ప్రారంభించేందుకు కృషిచేస్తామని విమానాశ్రయ నిర్మాణ సంస్థ యాజమాన్యం కూడా బహిరంగంగా ప్రకటించడం చాలా సంతోషకరం. ఉత్తరాంధ్ర వాసిగా, రాష్ట్రంలో బాధ్యత కలిగిన మంత్రిగా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా.

ప్రభుత్వోద్యోగుల సంక్షేమానికి సీఎం పెద్దపీట



సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్న వెంకట్రామిరెడ్డి, సర్వే ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



సీఎం జగన్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సాక్షర భారత్ కోఆర్డినేటర్ల సంఘ నాయకులు

- చంద్రబాబు పాలనలో తగ్గిన ఉద్యోగాలు
- అదే సీఎం జగన్ హయాంలో పెరుగుదల
- కొన్ని సంఘాల ఆందోళనను పట్టించుకోవాల్సిన అవసరంలేదు
- అవి చేస్తున్న పోరాటం వారి కోసం తప్ప.. ఉద్యోగుల కోసం కాదు
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమం, వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి ప్రశంసించారు. ప్రభుత్వ రంగంలోనే గత సర్కార్ హయాంలో 60 వేల ఉద్యోగాలు తగ్గితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో లక్ష ఉద్యోగాలు పెరిగాయని గుర్తుచేశారు. టీడీపీ సర్కార్ హయాంలో ఎంఎస్ఎంఈ రంగంలో 3.41 లక్షల ఉద్యోగులు తగ్గితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున పెరిగాయని గుర్తుచేశారు. అలాగే, సాక్షర భారత్ మండల కో–ఆర్డినేటర్లు, గ్రామ కో–ఆర్డినేటర్లు 19,502 మందిని గత సర్కార్ తొలగిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఐదు లక్షల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ, సర్వేయర్ల సంఘం, సాక్షర భారత్ ఉద్యోగుల సంఘం, రెవెన్యూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులతో కలిసి గురువారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. సాక్షర భారత్ మండల కో–ఆర్డినేటర్లు 502 మందిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మండల కో–ఆర్డినేటర్లుగా నియమించినందుకు, గ్రామ కో–ఆర్డినేటర్లు సుమారు ఐదు వేల మందిని వలంటీర్లుగా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. సర్వేయర్లు గ్రేడ్–3 నుంచి గ్రేడ్–2కు అప్‌గ్రేడ్ చేసినందుకు, వీఆర్ఏలకు నెలకు రూ.300లు చొప్పున డీఏ ఇచ్చేందుకు అంగీకరించినందుకు కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకూ రెవెన్యూ శాఖలో పదోన్నతులు కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యమంత్రి సానుకూలం..

సీఎం క్యాంపు కార్యాలయం వద్ద వెంకట్రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వీఆర్ఏలకు గతంలో నుంచి ఇస్తున్న రూ.300 డీఏ రికవరీ చేయాలన్న ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని సీఎంను కోరామని చెప్పారు. వీఆర్వోల పదోన్నతుల్లో ఎక్కువమందికి లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని విన్నవించామని.. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. వీఆర్ఏల డీఏలను తొలగించకుండా పునరుద్ధరించాలని అధికారులను సీఎం ఆదేశించారని తెలిపారు. కొన్ని సంఘాలు చేస్తున్న ఆందోళనను పట్టించుకోవాల్సిన అవసరంలేదని.. ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటం వారి కోసం చేస్తున్నది తప్ప ఉద్యోగుల కోసం కాదని చెప్పారు. రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవి, సాక్షర భారత్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

అరెస్టు భయంతో.. చెన్నైకి బీటెక్ రవి పరార్!

- ఎంపీ సీఎం రమేష్ సహకారంతో హైదరాబాద్ నుంచి చెన్నైకి..
- ఎం.రవీందర్ పేరుతో ప్రత్యేక విమానంలో జంప్
- నమ్ముకున్న అనుచరులు జైలుపాలు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రైవేట్ వ్యక్తుల రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ధ్వంసం చేసి అనంతరం కనిపించకుండా పోయిన టీడీపీ నేత మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పోలీసుల కళ్లుగప్పి చెన్నై చేరుకున్నట్లు సమాచారం. మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అలియాస్ బీటెక్ రవి మార్చి 30 ఆదివారం వైఎస్సార్ జిల్లా చక్రాయపేటలో ఈ దౌర్జన్యానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ ఘటన అనంతరం ఆయన హైదరాబాద్ చేరుకుని తన పొలిటికల్ గాడ్‌ఫాదర్‌ను ఆశ్రయించి గట్టెక్కే మార్గం సూచించాలని కోరారు. దీంతో హైదరాబాద్ నుంచి ఆ గాడ్‌ఫాదర్ స్పెషల్ ఫ్లైట్‌లో మంగళవారం చెన్నైకి చేర్చారు.

అందుకే బీటెక్ రవి దౌర్జన్యం..

పులివెందుల నియోజకవర్గంలో దౌర్జన్యం చేయగలిగామని చెప్పుకునేందుకు బీటెక్ రవికి ఇప్పుడు రాజకీయ అవసరం ఎంతో ఉంది. అందుకు.. తిరగబడే స్వభావం తక్కువగా ఉన్న చక్రాయపేట ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ప్రైవేటు వ్యక్తుల వెంచర్‌ను ధ్వంసం చేయడానికి అసలు కారణం అదేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక గత ఆదివారం దౌర్జన్యానికి పాల్పడ్డ బీటెక్ రవి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఆయన హైదరాబాద్‌లో తన పొలిటికల్ గాడ్‌ఫాదర్‌ను ఆశ్రయించారు. దీంతో బీజేపీలో కొనసాగుతున్న పూర్వపు టీడీపీ నేత సీఎం రమేష్ తెరపైకి వచ్చారు. అనంతరం.. సీఎం రమేష్, ఎం.రవీందర్, పి.శ్రీనివాసరావు అనే వ్యక్తులు ప్రత్యేక విమానంలో వెళ్తున్నట్లు అనుమతులు పొంది చెన్నై చేరుకున్నారు. అయితే, పోలీసులు గుర్తించకుండా ఉండేందుకే బీటెక్ రవి తన పేరును ఎం.రవీందర్‌గా మార్చుకున్నట్లు సమాచారం.

ఇప్పటికే 8 మంది అరెస్టు

మరోవైపు.. చక్రాయపేట ఘటనలో 32మందిని గుర్తించి వారిలో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టుచేశారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారు. అయితే, వీరందరినీ ముందుండి నడిపించిన బీటెక్ రవి ఘటన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లడం, మరో పేరుతో ఇతర ప్రాంతాలకు పారిపోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'నీతి, నిజాయితీ, దమ్మూ, ధైర్యం ఉంటే సదరు రియల్ ఎస్టేట్ వెంచర్ ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకురా.. నీ నిజాయితీ నిరూపించుకో..' అంటూ నిజమైన వెంచర్ యజమానులు ఆ పోస్టులో సవాల్ విసురుతున్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ సహా ఐదుగురికి జైలుశిక్ష

కోర్టు ధిక్కార వ్యాజ్యంలో హైకోర్టు తీర్పు

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రస్తుత వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు హైకోర్టు నెల రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించింది. వీరితో పాటు తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ టి.చంగల్‌రెడ్డి, ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ యూఎస్ శ్రీనివాస్, నెల్లూరు ఆర్టీసీ ఈఈ కె.కోటేశ్వరరావుకు సైతం జైలు శిక్ష, జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో వారం రోజుల జైలు శిక్ష అనుభవించాలని హైకోర్టు స్పష్టం చేసింది. వీరందరినీ ఈ నెల 16లోపు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అనంతరం వారిని జైలుకు పంపాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు ఉద్దేశపూర్వకంగానే తమ ఆదేశాలను ఉల్లంఘించారని, అందుకే వారికి కోర్టు ధిక్కారం కింద శిక్ష విధిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు ఈ నెల 2న తీర్పు వెలువరించారు. తమ సర్వీసుల్ని క్రమబద్ధీకరించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ ఆర్టీసీలో ఫీల్డ్‌మెన్‌గా పనిచేస్తున్న బి.సురేంద్ర, మరో ముగ్గురు 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు ఇతరులతో సమానంగా పిటిషనర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆర్టీసీ అధికారులను 2022లో ఆదేశించింది. ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదంటూ సురేంద్ర తదితరులు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఎంటీ కృష్ణబాబు, ద్వారకా తిరుమలరావు తదితరులకు నెల రోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. కోర్టు ఆదేశాలను అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత సీనియర్ అధికారులపై ఉందని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ఒకవేళ కోర్టు ఆదేశాలను న్యాయస్థానం నిర్దేశించిన గడువులోపు అమలు చేసే పరిస్థితి లేకపోతే, గడువు పెంపు కోసం పిటిషన్ దాఖలు చేసి తగిన ఉత్తర్వులు పొందవచ్చని పేర్కొన్నారు. అయితే, ఆ పని చేయకుండా అప్పీల్ పెండింగ్‌లో ఉందన్న కారణంతో కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమే అవుతుందని తేల్చి చెప్పారు.

తెలంగాణ

యాజమాన్యం వాటా నుంచే.. ఈపీఎస్‌కు అదనపు చెల్లింపు

- అధిక పెన్షన్ చందాదారులకు ఊరటనిచ్చిన ఈపీఎఫ్‌ఓ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం
- ప్రత్యేకంగా నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) అధిక పెన్షన్ చందాదారులకు ఊరటనిచ్చింది. వేతన పరిమితి దాటిన ఉద్యోగులకు సంబంధించి అదనంగా చెల్లించాల్సిన ఈపీఎస్ మొత్తాన్ని యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీ చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు..

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ నిబంధనలను ఈపీఎఫ్‌ఓ 2014 సెప్టెంబర్‌లో సవరించింది. చందాదారులకు వేతన పరిమితిని రూ.15 వేలుగా నిర్ధారించింది. ఈ పథకం కింద చందాదారుల వేతనం నుంచి మినహాయించే 12శాతం సొమ్మును పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాలో జమచేస్తారు. యాజమాన్యం చెల్లించే 12శాతం సొమ్ములో 3.67శాతాన్ని పీఎఫ్ ఖాతాలో.. మిగతా 8.33 శాతాన్ని ఎంప్లాయీస్ పెన్షన్ పథకం (ఈపీఎస్) ఖాతాలో జమ చేస్తారు. అయితే అధిక పెన్షన్‌కు సంబంధించి వేతన పరిమితి రూ.15 వేలు దాటిన చందాదారులు.. ఈపీఎస్ కోసం అదనంగా 1.16 శాతం సొమ్ము చెల్లించాలనే నిబంధన విధించింది. దీనిపై అసంతృప్తి చెందిన చందాదారులు కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్పందించిన న్యాయస్థానం.. ఉద్యోగి నుంచి అధిక మొత్తాన్ని స్వీకరించడం సామాజిక భద్రతకు విరుద్ధమని, ఆ మేరకు సొమ్మును సమకూర్చుకునే ఇతర మార్గాలను అన్వేషించాలని ఆదేశించింది. దీనిపై ఇప్పటిదాకా జాప్యం చేస్తూ వచ్చిన ఈపీఎఫ్‌ఓ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అధిక పెన్షన్ పొందాలనుకునే చందాదారులకు సంబంధించిన 1.16 శాతం అదనపు సొమ్మును యాజమాన్యాలు చెల్లించే వాటా నుంచే తీసుకోనున్నట్టు ప్రకటించింది. దీని ప్రకారం.. యాజమాన్యాల వాటాలో ఈపీఎస్‌కు వెళ్లే సొమ్ము 9.49శాతానికి పెరగనుంది.

> వాస్తవంగా, మేమే మానవుణ్ణి సృష్టించాము. అతని మనస్సులో మెదిలే ఊహలను కూడా మేము ఎరుగుతాము. మేము అతనికి అతని కంఠ రక్తనాళం కంటే కూడా అతి దగ్గరగా ఉన్నాము.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 మే 2023

నిజమెంత? నిజాయతీ ఎంత?

'నిజజీవిత ఘటనల నుంచి ప్రేరణ పొంది తీశామ'ని అంటున్న సినిమాలో నిజాలు ఉంటాయనే ఆశిస్తాం. నిజాయతీగా ఉంటుందనే భావిస్తాం. కానీ అవే లోపిస్తే? శుక్రవారం విడుదలవుతున్న హిందీ చిత్రం 'ది కేరళ స్టోరీ' సరిగ్గా అవే ఆరోపణల్ని ఎదుర్కొంటోంది. విషయం మద్రాస్, కేరళ హైకోర్టుల మొదలు సర్వోన్నత న్యాయస్థానం దాకా వెళ్ళాల్సి వచ్చింది. దాదాపు 10 కట్స్‌తో సెన్సార్ బోర్డ్ పచ్చజెండా ఊపిన ఈ వివాదాస్పద చిత్ర ప్రదర్శనను ఆపడానికి కానీ, కనీసం 'కల్పిత పాత్రలతో అల్లుకున్న కథ' అని టైటిల్స్‌లో వేయడానికి కానీ గడచిన మూడు రోజుల్లో 3 సార్లు సుప్రీమ్ ససేమిరా అనడంతో, బంతి ఇప్పుడు థియేటర్లలోని ప్రజాకోర్టులో పడింది. 'సంఘ్ పరివార్ వారి అసత్యాల కర్మాగారంలో తాజా ఉత్పత్తి' అంటూ కేరళ సీఎం ఈ చిత్రాన్ని గర్హించారు. కేరళలో జెండా పాతాలని ప్రయత్నిస్తున్న బీజేపీ మినహా ప్రతిపక్షాలూ ఆ మాటే అంటున్నాయి. బహిష్కరణ పిలుపుతో సహా కేరళ సర్కార్ వివిధ మార్గాలు అన్వేషిస్తున్న నేపథ్యంలో కల్పనను నిజమని నమ్మించే ప్రమాదభరిత సృజనాత్మక స్వేచ్ఛ విపరిణామాలపై కచ్చితంగా చర్చ అవసరం.

ఏప్రిల్ ద్వితీయార్ధంలో ట్రైలర్ వచ్చినప్పటి నుంచి 'కేరళ స్టోరీ' వివాదాలకు కేంద్రబిందువైంది. తీవ్రవాద ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ప్రభావం పతాకస్థాయిలో ఉన్నవేళ కేరళ నుంచి 'దాదాపు 32 వేల మంది స్త్రీలు' కనిపించకుండాపోయారనీ, వారి తెర వెనుక కథల్ని 'బహిర్గతం' చేసే యత్నమే మత మార్పిడి అంశం ఇతివృత్తమైన ఈ చిత్రమనీ దర్శక, నిర్మాతల మాట. 'లవ్ జిహాద్'లో భాగంగా 32 వేల మందినీ ముస్లిమ్‌లుగా మార్చి, అత్యధికులను ఐఎస్ పాలనలోని సిరియాకు తీసుకువెళ్ళారనేది ఈ చిత్ర వాదన. సాక్ష్యాధారాలు లేని ఈ కాకుల లెక్కతో కేరళను తీవ్రవాదానికి పట్టుగొమ్మ అన్నట్టు చిత్రించడంపై సహజంగానే అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఇది ముస్లిమ్‌లపట్ల ద్వేషం పెంచే దుర్మార్గ ప్రయత్నమనే వాదన బలపడింది. 'లవ్ జిహాద్' లేదని నాటి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రే పార్లమెంట్‌లో చెప్పినప్పుడు కేరళపై బురద చల్లేలా ఇలాంటి సినిమా ఎలా తీస్తారన్నది ప్రశ్న.

కేరళలో హిందువుల జనాభా దాదాపు 55 శాతమైతే, ఆ తర్వాత అత్యధికంగా ముస్లిమ్‌లు 26 శాతం పైగా, క్రైస్తవులు 18 శాతం ఉన్నట్టు లెక్క. దశాబ్దాల క్రితమే సంపూర్ణ అక్షరాస్యత సాధించి, నిత్యం చైతన్యం నిండిన ఆలోచనాపరుల సమాజంగా దేశంలో మలయాళ సీమది ప్రత్యేక స్థానం. సాహిత్యం, సంస్కృతి, కళలు, సినిమాలు సహా అనేక రంగాల్లో దిక్సూచిగా నిలిచిన ఘనత దానిది. మానవాభివృద్ధి సూచిలో ముందుంది. అలాంటి రాష్ట్రాన్ని పచ్చి తీవ్రవాదానికి పట్టుగొమ్మ అన్నట్టు చిత్రించడం కించపరచడమే. విమర్శలు పెరిగి, వివాదం ముదిరేసరికి సినీరూపకర్తలు సైతం సర్దుకోవాల్సి వచ్చింది. కేరళలోని '32 వేల మంది మహిళల కథల ఆధారంగా తీశా'మంటూ మొదట ట్రైలర్‌లో తొడకొట్టినవాళ్ళు చివరకు మే మొదట్లో దాన్ని ముగ్గురంటే 'ముగ్గురు యువతులు'గా మార్చేశారు. కడుపులో ఏదో పెట్టుకొని కథ రాసుకున్నప్పటికీ కోట్లు పెట్టి సినిమా తీసినవారికి మూడుకూ, 32 వేలకూ తేడా తెలీదా? ఒకటీ అరా ఘటనలు జరిగాయేమో తెలీదు కానీ దాన్ని పట్టుకొని కేరళలోని ప్రబలమైన ధోరణి అన్నట్టు చిత్రించాలనుకోవడం ఏ రకంగా సమర్థనీయం? మొత్తం కేరళ కథ అన్నట్టు సినిమాకు పేరు పెట్టి, బురద జల్లడం ఎవరిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ?

భావప్రకటన స్వేచ్ఛను కాపాడాల్సిందే. సృజనాత్మక స్వాతంత్య్రం కావాల్సిందే! కానీ ట్రైలర్‌ను బట్టి చూస్తే... వాస్తవాలను చూపుతున్నామనే పేరుతో, నిజాలను వక్రీకరించి సంచలనాత్మకం చేయడం 'కేరళ స్టోరీ'లోని అతి పెద్ద ఇబ్బంది. ఇలా లెక్కలతో సహా అన్నిటినీ అతి చేస్తున్నప్పుడు ఈ చిత్ర రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాలపై, సాధించదలచిన లక్ష్యాలపై తప్పక అనుమానాలు తలెత్తుతాయి. పైగా, కేరళలో ముస్లిమ్, ముస్లిమేతరులుగా ప్రజలను రెండు ప్రత్యర్థి వర్గాలుగా ఏకీకృతం చేసే ప్రయత్నాలు పెరుగుతున్న సమయంలో సినిమా రావడం సందేహాల్ని పెంచుతోంది. ఆ మధ్య 'పద్మావత్' నుంచి ఇటీవలి 'పఠాన్' దాకా సినిమాలపై నిషేధపు డిమాండ్లు, కోర్టు కేసులు చూశాం. అప్పుడైనా ఇప్పుడైనా నిషేధాలు పరిష్కారం కావు. కానీ సెంటిమెంట్లను దెబ్బతీసి, ఉద్రిక్తత సృష్టించి, విద్వేషాన్ని పెంచే ప్రయత్నాలను తప్పక అడ్డుకోవాల్సిందే. శాంతిభద్రతలకు భంగం వాటిల్లినప్పుడు భావప్రకటన స్వేచ్ఛపై నిర్బంధాలు తప్పవని ఆర్టికల్ 19 (2) అనుమతిస్తోంది. శాంతిభద్రతలేమో కానీ, మనోఫలకంపై నిలిచి ఆలోచనల్లోకి ఇంకిపోయే భావోద్వేగాల ప్రభావమే అర్ధసత్య చిత్రాలతో అతి ప్రమాదం. బ్రిటిష్ వారి వద్దే మన్యం వీరుడు అల్లూరి పోలీసుగా పని చేశాడని భావితరాలు నమ్మేలా సినిమా తీసి, ఆస్కార్ల దాకా వెళ్ళిన మన కథలే అందుకు సాక్ష్యం. 'కేరళ స్టోరీ'కీ కనీసం కల్పితపాత్రల కథనమని పేర్కొనమంటూ పిటిషనర్లు కోరిందీ అందుకే.

సెకనుకు 24 ఫ్రేమ్‌ల చొప్పున తెరపై చూపే సత్యం సినిమా అనే సూక్తికి 'కేరళ స్టోరీ' లాంటివి నిలబడతాయా అన్నది సందేహమే! సామాన్య ప్రజలు తాము తెరపై చూసేదంతా సత్యమని భ్రమపడితే, సమాజంలో పెచ్చరిల్లే విద్వేషాగ్నికి బాధ్యులెవరు? 'కశ్మీర్ ఫైల్స్'తో దేశం ఆ చివరన మొదలైన అర్ధసత్య, అసత్య ప్రచార చిత్రాలు ఇప్పుడు 'కేరళ స్టోరీ'తో ఈ చివరన కన్యాకుమారికి విస్తరించడం దేనికి సంకేతం? భావప్రకటన స్వేచ్ఛ ఓకే కానీ, నిజాన్ని వక్రీకరించి చూపడంపై గళమెత్తాల్సిందే! ఈ రొచ్చుకు అడ్డుకట్ట ఏమిటో కనిపెట్టాల్సిందే! రాజకీయ ప్రయోజనాల కోసం సినిమాను వాడుకొనేందుకు పెరుగుతున్న ప్రాపగాండా ప్రయత్నాలను గమనించాలి. గత తొమ్మిదేళ్ళలో ఎన్నికల ముందే ఇలాంటి చిత్రాలు ఎందుకు, ఎవరి ప్రాపుతో వస్తున్నాయో ఆలోచించాలి.

ఇన్‌బాక్స్

చిరస్మరణీయ కృషి



రవ్వా శ్రీహరి

ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, నిఘంటు కర్త, వ్యాకరణ వేత్త ఆచార్య డాక్టర్ రవ్వా శ్రీహరి (79) ఇటీవల తుదిశ్వాస విడిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో సామాన్య చేనేత కుటుంబంలో 1943 సెప్టెంబర్ 12న ఆయన జన్మించారు. తెలుగు, సంస్కృత భాషల వికాసానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

యాదగిరి లక్ష్మీ నరసింహ సంస్కృత విద్యాపీఠంలోనూ, హైదరాబాదులోని సంస్కృత కళాశాలలోనూ వ్యాకరణం చదివారు. వ్యాకరణంలో ఉత్తీర్ణుడైన శ్రీహరి... వివేకవర్ధిని కళాశాలలో తెలుగు పండితుడిగా చేరి, ఎంఏ తెలుగు, ఎంఏ సంస్కృతం చదివి 1967లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా చేరి సంస్కృతం, తెలుగు రెండింటినీ బోధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు సలహాతో 'భాస్కర రామాయణం' మీద పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాల యంలో 17 సంవత్సరాలు బోధనా, పరిశోధనలు నిర్వహించిన శ్రీహరి 2002లో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమితులయ్యారు. 2011లో తిరు మల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

రవ్వా శ్రీహరి 50 వరకు తెలుగు గ్రంథాలను, సంస్కృతంలో 25 పుస్తకాలను రచించారు. పరిశోధన, సృజన, విమర్శ, అనువాదం, నిఘంటు నిర్మాణం రంగాలపై తనదైన ముద్రవేశారు. 'శ్రీహరి నిఘంటువు', 'అన్నమయ్య పద కోశం', 'సంకేత పదకోశం', 'వ్యాకరణ పద కోశం' ప్రముఖంగా చెప్పుకోదగ్గవి. విమర్శనాత్మక గ్రంథాలలో 'ఉభయ భారతి', 'అన్నమయ్య సూక్తివైభవం', 'అన్నమయ్య భాష వైభవం', 'తెలుగు అలబ్ధ వాఙ్మయం', 'సాహితీ నీరాజనం', 'తెలుగు కవులసంస్కృత అనుకరణలు', 'వాడుకలో తెలుగు అప్రయోగాలు' ఉన్నాయి. ఆయన మృతి ఇటు తెలుగు, అటు సంస్కృత సారస్వతాలకు తీరని లోటు.

– డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్య, అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాత, అన్నమాచార్య ప్రాజెక్టు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్వేచ్ఛ ఉందనా?



పత్రికా స్వేచ్ఛలో బంగ్లాదేశ్ (163) కన్నా అఫ్గానిస్తాన్ (152) మెరుగ్గా ఉందన్న వాస్తవం చాలు, ఈ 'ర్యాంకింగులు' ఎంత తప్పులతడకో చెప్పడానికి. దీనిపై కాబూల్ వెళ్లి ఏ జర్న లిస్టునైనా అడగండి, ఎవరైనా దొరికితే. మహిళా జర్నలిస్టును అడిగితే ఇంకా మంచిది, ఇంకా ఎవరైనా ఉండివుంటే!

– షా అలీ ఫర్హాద్, బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అడ్వకేట్

అదా సంస్కారం?



చార్‌ధామ్ కావచ్చు, గుడి లేదా ఆఖరికి ఇంట్లో పూజ కావచ్చు– తొంభై శాతం మంది యువతీ యువకులు ఒక ధార్మిక ప్రదేశానికి ఫొటోల కోసమో, రీల్స్ చేయడానికో వెళ్తున్నారు. గౌరవం లేదు, విలువలు లేవు, సంస్కారం లేదు. దేవుడి విగ్రహం వైపు వీపుతిప్పి వాళ్లు సెల్ఫీలు తీసుకుంటుంటారు!

– అమితాభ్ చౌధరి, ఇంజనీర్

గంతలు కట్టేందుకే కట్టుకథలు



- పాత చింతకాయ పచ్చడినే తాజాగా వడ్డించేందుకు చంద్రబాబు ఆపసోపాలు
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికలపై వక్రీకరణ
- వివేకాను అవినాశ్ ఓడిస్తే...మరి బీటెక్ రవి ఆయనపై ఎందుకు ఆరోపణలు చేస్తారు?
- కుట్రతో వివేకాను ఓడించిన బీటెక్ రవి.. సునీత దంపతులకు ఎలా సన్నిహితుడయ్యారు?
- 2019 కడప ఎంపీ టికెట్‌పై పచ్చ మీడియా అవాస్తవ కథనాలు
- చివరివరకూ అవినాశ్ గెలుపుకోసం ప్రచారం చేసిన వివేకా
- గూగుల్ టేక్ అవుట్ పేరిట ఫేక్ సమాచారం
- ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలకు అది పూర్తి విరుద్ధం
- వివేకా హత్య కేసులో సీబీఐ విస్మరిస్తున్న కీలక అంశాలెన్నో

సాక్షి, అమరావతి: ప్రతి ఊర్లో ఒకడుంటాడు. ఊరికి ఏదైనా మంచి జరిగితే భరించలేడు. వాస్తవాలను పక్కదారి పట్టించేందుకు ఏదో ఒక దుష్ప్రచారాన్ని తెరపైకి తెస్తాడు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఒకరున్నారు! అధికారంలో ఉండగా రాష్ట్రానికి ఆయన చేసిందేమీ లేదు. ప్రతిపక్షంలో ఉన్నా బుద్ధి వంకరే. తనకు అలవాటైన రీతిలో కుట్రలకు పదును పెడతారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు తన భజన మీడియా ద్వారా కట్టు కథలను ప్రచారంలోకి తెస్తారు. ఒకపక్క భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం.. విశాఖలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగడం.. మరోపక్క అమరావతిలో భూ దందాలపై సిట్ దర్యాప్తు కొనసాగించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించడంతో బెంబేలెత్తి టీడీపీ కరపత్రిక ఈనాడు, ఇతర ఎల్లో మీడియాను రంగంలోకి దించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ అఫిడవిట్ పేరిట ఎంపీ అవినాశ్‌రెడ్డిపై నిరాధార అభియోగాలతో బురద చల్లేందుకు బరి తెగించారు. అయితే సీబీఐ అభియోగాలు అవాస్తవమని స్పష్టం చేస్తూ ఎంపీ అవినాశ్‌రెడ్డి పూర్తి ఆధారాలతో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ వెలుగులోకి రావడంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్ర బెడిసికొట్టింది. దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు, ఆయన బృందం ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నించడం విస్మయపరుస్తోంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి విచారణకు సహకరించడం లేదంటూ అభియోగం మోపడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే ఏప్రిల్ 19 నుంచి 25వరకు అవినాశ్‌రెడ్డి సీబీఐ విచారణకు హాజరై ఏకంగా 210 ప్రశ్నలకు సవివరంగా సమాధానాలు చెప్పారు. ఆ ప్రశ్నలన్నీ గతంలో విచారణలో అడిగినవే అయినా సరే ఓపిగ్గా సమాధానాలిచ్చారు. న్యాయస్థానం ఆదేశాలతో అదంతా ఆడియో, వీడియో రికార్డింగ్ కూడా చేశారు. అయినా సరే ఎంపీ అవినాశ్ దర్యాప్తునకు సహకరించడం లేదనడం వెనుక దురుద్దేశాలున్నట్లు స్పష్టమవుతోంది. కౌంటర్ అఫిడవిట్‌లో ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్న ఇతర అంశాలు సంక్షిప్తంగా ఇవీ...

ఎమ్మెల్సీ ఎన్నికలపై అదే దుష్ప్రచారం

ఎన్నిసార్లు వాస్తవాలను వెల్లడించినా పదే పదే ఒక అబద్ధాన్ని ప్రచారంలోకి తేవడం ఎల్లో మీడియా కుట్రలకు నిదర్శనంగా నిలుస్తోంది. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై వక్రీకరణే అందుకు తార్కాణం. 2017లో కడప జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఉన్న వైఎస్ వివేకాను చంద్రబాబు కుట్రపూరితంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్నప్పటికీ టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవిని బరిలో నిలిపారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి ద్వారా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి అడ్డదారిలో బీటెక్ రవిని గెలిపించారు. అయితే వైఎస్ వివేకాకు వ్యతిరేకంగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి పని చేసి బీటెక్ రవిని గెలిపించారంటూ సీబీఐ అవాస్తవాలను తన అఫిడవిట్‌లో పదే పదే ప్రస్తావిస్తోంది. వైఎస్ వివేకానందరెడ్డి అందుకే ఎంపీ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి నివాసానికి వెళ్లి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారంటూ నిరాధార అభియోగాలు మోపుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 800 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ఎవరినైనా సీబీఐ విచారించిందా ? జిల్లాలో అన్ని ఓట్లను కలిపి ఎన్నికల కమిషన్ లెక్కిస్తుంది. మరి పులివెందులలో ఓట్లు క్రాస్ అయ్యాయని సీబీఐ ఎలా చెబుతుంది? ఇక డి.శివశంకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించాలని అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి భావించారని సీబీఐ ఎలా నిర్ధారణకు వచ్చింది? వాటిలో ఒక్కదానికైనా సీబీఐ సమాధానం చెబుతుందా అంటే అదీ లేదు. కేవలం దురుద్దేశాలతో అభియోగాలు మోపడం మినహా నిరూపించే ఉద్దేశమే సీబీఐకి లేదన్నది స్పష్టమవుతోంది.

బీటెక్ రవితో జట్టుకట్టిన సునీత దంపతులు



ఈనాడు సహా ఇతర ఎల్లో సిండికేట్ కట్టు కథలకు తాజా పరిణామాలే నిదర్శనం. వైఎస్ వివేకాను కుట్రపూరితంగా ఓడించిన బీటెక్ రవి ఇప్పుడు ఆయన కుమార్తె సునీత, అల్లుడు– చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితుడు. ఆ విషయాన్ని బీటెక్ రవి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో స్వయంగా వెల్లడించాడు. అవినాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా ఆ ఇంటర్వ్యూలో ఆయన ఆరోపణలు కూడా చేశారు.

ఏది నిజం?

అంటే 2017ఎన్నికల్లో వివేకాకు వ్యతిరేకంగా అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పని చేయలేదని స్పష్టమవుతోంది. సీబీఐ అభియోగాలు నిజమైతే బీటెక్ రవి, అవినాశ్‌రెడ్డి మధ్య ఫోన్ సంభాషణలు ఉండాలి కదా? బీటెక్ రవితో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి రోజూ ఎందుకు ఫోన్లో మాట్లాడుతున్నారనేది సందేహాస్పదంగా మారుతోంది.

అవినాశ్‌కు ఖరారైన ఎంపీ టిక్కెట్‌పై సీబీఐ వక్రీకరణ

కడప ఎంపీ టికెట్‌పై లేని సందిగ్ధతను ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తోంది. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు కుట్ర పన్నుతోంది. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్‌ను సిట్టింగ్ ఎంపీగా ఉన్న వైఎస్ అవినాశ్‌రెడ్డికే పార్టీ ఖరారు చేసింది. ఆయన్ని గెలిపించే బాధ్యతను వైఎస్ వివేకానందరెడ్డికి అప్పగిస్తూ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించింది. అప్పటికే అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. ఆయన గెలుపు కోసం వివేకా కూడా విస్తృతంగా పర్యటించారు. హత్యకు గురికావడానికి కొన్ని గంటల ముందు కూడా అంటే 2019 మార్చి 14న అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా వివేకానందరెడ్డి మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు 300 ఇళ్లకు వెళ్లి ఇంటింటి ప్రచారం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ విషయాన్ని రఘురామిరెడ్డిని అడిగినా, వివేకా ఎన్నికల ప్రచారం నిర్వహించిన 300 ఇళ్లలోని వారిని అడిగినా వాస్తవం తెలుస్తుంది. సీబీఐ ఆ ప్రయత్నమే చేయకపోవడం విడ్డూరంగా ఉంది. అంతేకాదు అవినాశ్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ శ్రమించారని వివేకా కుమార్తె సునీత స్వయంగా 2019 మార్చి 27న మీడియాతో చెప్పారు. ఎంపీ టికెట్ కోసం వివేకానందరెడ్డిని హత్య చేశారన్న సీబీఐ అభియోగాలు పూర్తి నిరాధారం.

అభ్యర్థులు ముందే ఖరారు..

వివేకా హత్య తరువాతే అవినాశ్‌రెడ్డికి టికెట్‌ను ఖరారు చేస్తూ పార్టీ ప్రకటించిందన్న సీబీఐ అభియోగం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను 2019 మార్చి 17న పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఏ పార్టీ కూడా ఒక్క రోజులో 200 మంది అభ్యర్థులను ఖరారు చేయదు. ముందే ఖరారు చేసిన అభ్యర్థుల పేర్లను నామినేషన్ల ముందు ప్రకటించడం అన్నది కేవలం ఒక తంతే. అదే విధంగా 200 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అప్పటికే ఖరారు చేశారు. వారంతా అప్పటికే ప్రచారంలో సైతం నిమగ్నమయ్యారు.

ప్రత్యక్ష సాక్షుల కథనానికి భిన్నంగా సీబీఐ అఫిడవిట్

సీబీఐ ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను విస్మరించి నిరాధార అభియోగాలను మోపుతున్నట్లు మరోసారి నిరూపితమైంది. 2019 మార్చి 15 తెల్లవారుజామున ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతున్నట్టు ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పింది తప్పని సీబీఐ తన కౌంటర్‌లో పేర్కొనడం విస్మయపరుస్తోంది. ఆ రోజు అవినాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగు వెళుతుండగా వివేకా చనిపోయిన విషయాన్ని ఆయన పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి ఫోన్ చేసి చెప్పారు. దీంతో అవినాశ్‌రెడ్డి వెనక్కి మళ్లి వివేకా నివాసానికి చేరుకున్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు చల్లా మల్లి, బండి కేశవ్, బండి రాఘవరెడ్డి, వెంకట రమణారెడ్డి, ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి ఇదే విషయాన్ని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాలలో స్పష్టంగా చెప్పారు. వారి సాక్ష్యాన్ని సీబీఐ రికార్డు కూడా చేసింది. కానీ ఇప్పుడు ప్లేటు ఫిరాయించి అసలు ఆ రోజు ఉదయం అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు వెళ్లడం లేదని సీబీఐ కౌంటర్‌లో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకోకుండా సీబీఐ కట్టు కథలు అల్లుతున్నట్లు స్పష్టమవుతోంది.

ప్రత్యక్ష సాక్షులా... గూగుల్ టేక్ అవుటా?

వాస్తవాలను వక్రీకరించడంలో పచ్చ ముఠా మరో అడుగు ముందుకేసింది. సాంకేతికంగా కచ్చితంగానీ, న్యాయపరంగా ఏమాత్రం చెల్లుబాటుగాని గూగుల్ టేక్ అవుట్ పేరిట దుష్ప్రచారం చేస్తోంది. 2019 మార్చి 15 తెల్లవారుజామున వైఎస్ అవినాశ్‌రెడ్డి ఇంట్లోనే గడిపి మూడో వ్యక్తి ఫోన్ కోసం ఎదురు చూశారని అఫిడవిట్‌లో పేర్కొనడం విస్మయపరుస్తోంది. వివేకా హత్య విషయాన్ని ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి ఎంపీ అవినాశ్‌కు తెలిపారు. శివప్రకాశ్‌రెడ్డి మూడో వ్యక్తి అవుతారా? మరి ఆయన్ని ఆ కోణంలో సీబీఐ ఎందుకు విచారించడం లేదు? గూగుల్ టేక్ అవుట్ పేరిట సీబీఐ చెబుతున్న అంశాలు, ప్రత్యక్ష సాక్షులు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. సీబీఐ దర్యాప్తు తీరు అహేతుకంగా ఉండనేందుకు ఇదో నిదర్శనం. సీబీఐ ఏమాత్రం శాస్త్రీయం గానీ గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణలోకి తీసుకుంటుందా? ఐదుగురు సాక్షులు చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకుంటుందా? ఒకవేళ గూగుల్ టేక్ అవుట్‌నే పరిగణలోకి తీసుకుంటే ఐదుగురు సాక్షులే కాదు.. మొత్తం 248 మంది సాక్షులు చెప్పింది తప్పని అంగీకరిస్తుందా?

చిత్ర పటాలంటూ.. విచిత్ర వాదన

ఫోన్ కాల్స్ మ్యాప్ అంటూ మరో ఊహాజనితమైన కథను తెరపైకి తెచ్చారు. వివేకా హత్యకు ముందు రోజు అంటే 2019 మార్చి 14 సాయంత్రం 6 గంటల నుంచి మార్చి 15 ఉదయం 8 గంటల వరకు ఫోన్ సంభాషణల క్రమాన్ని వివరించే మ్యాప్ అంటూ అఫిడవిట్‌లో పేర్కొంది. ఒక ఊహాజనిత కుట్ర చిత్రాన్ని గీశారు. సీబీఐ ఉద్దేశపూర్వకంగా విస్మరించిన అంశం ఏమిటంటే ఎర్ర గంగిరెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి ఒకే పార్టీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో ఒకరితో ఒకరు ఫోన్లో మాట్లాడుకోవడం కుట్రలో భాగంగా చూపించడం హాస్యాస్పదంగా ఉంది. ఇక తండ్రీ కుమారులైన వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి పరస్పరం మాట్లాడుకోవడం కూడా కుట్రలో భాగంగా చూపించడం అంటే సీబీఐ ఈ కేసు దర్యాప్తులో ఎంతగా దారి తప్పిందో స్పష్టమవుతోంది. నిందితుడిగా సీబీఐ పేర్కొన్న ఉదయ్‌కుమార్‌రెడ్డికి రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేదు. యూసీఐఎల్ ఉద్యోగి అయిన ఆయన అవినాశ్‌రెడ్డిని సాధారణంగా తరచూ కలిసేవారు. వారిద్దరి మధ్య ఫోన్ కాల్స్ కూడా కుట్రలో భాగంగా చూపించడం విడ్డూరంగా ఉంది. దర్యాప్తు ఇంత డొల్లతనంగా ఉండటం సీబీఐ ప్రమాణాలను దిగజారుస్తోంది.

వారి ఫోన్ కాల్స్ మ్యాప్ ఎందుకు గీయలేదు?

ఈ కేసులో నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి వివేకానందరెడ్డికి అత్యంత సన్నిహితులు. ఆ నలుగురు ఆయన అల్లుడు–చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డిలకు అత్యంత సన్నిహితులన్నది పులివెందులలో అందరికీ తెలిసిన విషయమే. మరి ఎర్ర గంగిరెడ్డి– నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, ఎర్ర గంగిరెడ్డి– నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి మధ్య ఫోన్ కాల్స్‌పై సీబీఐ ఎందుకు దృష్టి సారించలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. వారి మధ్య కాల్స్‌ను అనుమానాస్పదంగా పరిగణించాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నా సీబీఐ ఎందుకు పట్టించుకోవడం లేదు? వారి మధ్య ఫోన్ కాల్స్ మ్యాప్‌ల ఆధారంగా ఎందుకు దర్యాప్తు చేయడం లేదో సీబీఐనే సమాధానం చెప్పాలి. వివేకా హత్య తరువాత సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి జైలులో ఉన్న ఎర్ర గంగిరెడ్డిని కలుసుకున్నారు. ఆ ములాఖత్ కచ్చితంగా అనుమానాస్పదమే. ఇక వివేకాను నరికి చంపానని అంగీకరించిన దస్తగిరి బెయిల్ పిటీషన్‌ను సునీత వ్యతిరేకించకపోవడం కీలకంగా మారింది. డి.శివశంకర్‌రెడ్డి బెయిల్‌ను మాత్రం ఆమె వ్యతిరేకించడం వెనుక దురుద్దేశం ఉందని స్పష్టమవుతోంది. దస్తగిరి బెయిల్‌ను వ్యతిరేకించని సునీత డి.శివశంకర్‌రెడ్డి బెయిల్‌ను మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని న్యాయస్థానం ప్రశ్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆధారాలు ధ్వంసం చేయించింది వివేకా బావమరుదులే

వివేకా హత్యా స్థలంలో ఆధారాలను ధ్వంసం చేయించారంటూ అవినాశ్‌రెడ్డిపై సీబీఐ మోపిన అభియోగాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. వివేకా చనిపోయారని, వెంటనే అక్కడికి వెళ్లమని ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి చెబితేనే అవినాశ్ వెళ్లారు. అప్పటికే వివేకా రాసిన లేఖ గురించి శివప్రకాశ్‌రెడ్డికి తెలిసినా అవినాశ్‌కు చెప్పకుండా గోప్యంగా ఉంచారు. ఇక వివేకా నివాసంలో రక్తపు మరకలు, ఫ్లోర్‌ను శుభ్రం చేయించింది ఎర్ర గంగిరెడ్డి. శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఆయన అలా చేశారు. ఎందుకంటే వారిద్దరూ అత్యంత సన్నిహితులు కాబట్టి. అంటే ఆధారాలను ధ్వంసం చేయించింది శివప్రకాశ్‌రెడ్డి అని స్పష్టమవుతూనే ఉంది. మరి ఈ విషయంలో శివప్రకాశ్‌రెడ్డిని సీబీఐ ఎందుకు విచారించడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. అవినాశ్ ఆధారాలను ధ్వంసం చేయించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైందా? అలాంటిది ఏదీ లేనప్పుడు సీబీఐ ఏ ఆధారాలతో ఈ అభియోగాలను మోపుతోంది? వివేకా లేఖ, సెల్‌ఫోన్‌ను గోప్యంగా ఉంచిన ఆయన అల్లుడు, పెద్ద బావమరిదిని విచారించాలని అవినాశ్ ఎప్పటి నుంచో కోరుతునే ఉన్నారు. ఇన్నాళ్లకు మేలుకున్న సీబీఐ నర్రెడ్డి రాజశేఖరరెడ్డిని కొద్ది రోజుల క్రితం ఎట్టకేలకు విచారించింది.



పది రోజుల క్రితమే సీబీఐ అఫిడవిట్ దాఖలు..

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, విశాఖలో అదాని డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే అద్భుతమైన ఆ రెండు ప్రాజెక్టులపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. మరోవైపు చంద్రబాబు సర్కారు భూదోపిడీ, ఇతర అవినీతి బాగోతాలపై సిట్ దర్యాప్తు కొనసాగించవచ్చని సుప్రీం కోర్టు బుధవారమే తీర్పునిచ్చింది. ఆ రెండు అంశాలు గురువారం మీడియాలో ప్రముఖంగా ప్రచురితమవుతాయని తెలుసు. అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు టీడీపీ, పచ్చ మీడియా వేసిన పన్నాగమే సీబీఐ కౌంటర్ అఫిడవిట్‌ను హఠాత్తుగా తెరపైకి తేవడం. వాస్తవానికి సీబీఐ పది రోజుల క్రితమే న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. అదే రోజు అది అన్ని పత్రికలకు అందుబాటులోకి వచ్చింది. సీబీఐ కౌంటర్‌కు సమాధానంగా ఎంపీ అవినాశ్‌రెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ రెండింటి ఆధారంగా న్యాయస్థానంలో వాద ప్రతివాదనలు జరిగాయి. అనంతరం న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. అవన్నీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తాజాగా భోగాపురం విమానాశ్రయం, అదాని డేటా సెంటర్‌కు శంకుస్థాపన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు ఆదేశాలతో ఈనాడు, ఎల్లో మీడియా సీబీఐ అఫిడవిట్ అంశాన్ని ప్రముఖంగా ప్రచారంలోకి తెచ్చాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** పౌర్ణమి రా.10.44 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** స్వాతి రా.9.32 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.3.09 నుండి 4.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.08 నుండి 8.59 వరకు తదుపరి ప.12.22 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** ప.12.30 నుండి 1.45 వరకు, బుద్ధపౌర్ణమి; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.36, **సూర్యాస్తమయం:** 6.16.

తెలుగు రాష్ట్రాల్లో 2,000 ఆలయాల నిర్మాణం

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


మహా సంప్రోక్షణలో పాల్గొన్న సుబ్బారెడ్డి

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో గడిచిన నాలుగేళ్లలో 2,000 ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర దేవాలయ మహాసంప్రోక్షణలో వైవీ దంపతులు గురువారం పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు గిరిజన, మత్స్యకార, దళితవాడలు, ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోలేని భక్తుల కోసం వారి చెంతకే శ్రీవారిని తీసుకువస్తున్నామని తెలిపారు. సీతంపేటలో రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. కల్యాణ మండపాన్ని ఇంకా విస్తరించి చుట్టుపక్కల గిరిజనులకు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. రంపచోడవరంలో ఈ నెల 17 నుంచి 22 వరకు మహాసంప్రోక్షణ నిర్వహిస్తామన్నారు. కురుపాంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యేలు కళావతి, పుష్పశ్రీవాణి, చిన్నప్పలనాయుడు, జోగులు, రెడ్డి శాంతి పాల్గొన్నారు.

సిట్ విచారణతో చంద్రబాబు అవినీతి బట్టబయలు

- టీడీపీ, జనసేన కలిసినా ఓటమి తప్పదు
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మీడియాతో మాట్లాడుతున్న కేఏ పాల్

సీతమ్మధార(ఉత్తర విశాఖ): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి సిట్ విచారణ ద్వారా బయటకొస్తుందని, ఇప్పటికే బాబు అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు చేశానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాలులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అక్రమాలపై సిట్ విచారణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలుపుతూ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు పాలనలో లెక్కలేనన్ని స్కాములు జరిగాయని, టీడీపీ ప్రభుత్వం రూ.6లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ప్రజాశాంతి పార్టీతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు పార్టీల నేతలు టచ్‌లో ఉన్నారన్నారు. చంద్రబాబు నన్ను చంపేస్తానని వార్నింగ్ ఇచ్చారని, నన్ను ఏం చేయలేరన్నారు. బాబు వస్తే రాష్ట్రానికి శని పడుతుందన్నారు. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసినా ఒక్క సీటు రాదన్నారు. కుప్పంలో ఈ సారి చంద్రబాబు ఓడిపోతాడని జోస్యం చెప్పారు. తారకరత్న..లోకేశ్ పాదయాత్రలో పాల్గొనడం వల్లే చనిపోయాడన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉచిత కరెంట్, విద్య అందిస్తామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు రాష్ట్ర ప్రజలు వేచి చూడాలని, అతి పెద్ద మార్పు చూస్తారని కేఏ పాల్ అన్నారు.

13న రుషికొండ బీచ్‌లో బ్లూఫ్లాగ్ ఎగరవేత



సాక్షి, విశాఖపట్నం: ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణహిత, ప్రమాద రహిత బీచ్‌లకు అందించే బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ పొందిన రుషికొండ తీరంలో నీలి రంగు జెండా మరోసారి రెపరెపలాడనుంది. వరుసగా మూడేళ్ల పాటు అంతర్జాతీయ సర్టిఫికేషన్ పొందిన రుషికొండ బీచ్‌లో ఈ నెల 13న జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో బ్లూఫ్లాగ్ హోస్టింగ్ నిర్వహించనున్నారు. దీన్ని ఎగరేసేందుకు 50 అడుగుల పొడవైన పోల్స్ సిద్ధం చేస్తున్నారు. జెండా ఎగరవేసేందుకు అవసరమైన ఏర్పాట్లను టూరిజం శాఖ ముమ్మరం చేసింది. ఈ బ్లూఫ్లాగ్ బీచ్‌లో 3 పతాకాలు ఎగరవేయనున్నారు. ఇంటర్నేషనల్ జ్యూరీ పంపించిన బ్లూఫ్లాగ్‌తో పాటు త్రివర్ణ పతాకం, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన మరో పతాకాన్ని బీచ్‌లో ఎగరవేయనున్నట్లు టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి చెప్పారు. బ్లూఫ్లాగ్ బీచ్‌గా పొందిన గుర్తింపుని వరుసగా నాలుగో ఏడాది కూడా పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకుగాను రెన్యువల్ కోసం దరఖాస్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అమరావతి దొంగల బండారం బట్టబయలు

- 949వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు


రిలే దీక్షలో పాల్గొ బహుజన నాయకులు

తాడికొండ: అమరావతిపై పూర్తిస్థాయి విచారణ జరిగితే ఈ ప్రాంతంలో చేసిన అవినీతి, దోపిడీ దొంగల బండారం బట్టబయలవుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 949వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. బాబుపై ఉన్న సిట్, సీఐడీ, ఈడీ కేసుల్లో జైలుకెళ్లడం ఖాయమని, దీనిని ఆపడం ఎవరితరం కాదన్నారు. 9/77 అసైన్డ్ యాక్ట్‌ను సవరణ చేసి జీవో నంబర్ 54ను తీసుకొచ్చిన చంద్రబాబు పేదలకు తీరని అన్యాయం చేశాడని మండిపడ్డారు. నేడు గూడులేని పేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల పట్టాలు, రాజధాని ప్రాంతంలో 54 వేల పట్టాలు అందజేస్తుంటే అడుగడుగునా అడ్డు తగలడం బాబు పక్షపాతానికి పరాకాష్ట కాదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సిట్, సీఐడీ అధికారులు వెంటనే రాజధానిలో జరిగిన అవినీతి వ్యవహారంలో చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేశ్‌ను వెంటనే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. పులి!

పల్నాడు జిల్లా దుర్గి మండల పరిసరాల్లో రెండు పులుల సంచారం

- ఇటీవల ఆవును వేటాడి చంపిన పులులు
- నల్లమల టైగర్ జోన్ నుంచి వచ్చినట్టు భావిస్తున్న అటవీశాఖ అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన


దుర్గి మండలం గజాపురం అటవీ ప్రాంతంలో వారం కిందటి పులుల పాదముద్రలు



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న మండలాల్లో పులులు సంచరిస్తున్నాయని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దుర్గి మండలం గజాపురం అటవీ ప్రాంతంలో వారం కిందట ఓ ఆవును అడవి జంతువులు వేటాడి చంపాయి. ఆవుపై దాడి చేసిన విధానం, ఆ ప్రదేశంలో ఉన్న పాదముద్రల ఆధారంగా రెండు పులులు దాడి చేసినట్టు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లా అడవులకు ఆనుకుని ఉన్న నల్లమల టైగర్ జోన్ నుంచి ఆ రెండు పులులు దారి తప్పి వచ్చాయని వారు అనుమానిస్తున్నారు. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజల్లో గుబులు మొదలైంది. ఏ సమయంలో పులులు దాడులు చేస్తాయోనని ముఖ్యంగా పశువుల కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం అయితే ప్రజలంతా ఇళ్లకే పరిమితమవుతున్నారు.

ఆహారం దొరక్క వచ్చాయా!?

శ్రీశైలం, నాగార్జున సాగర్ పరిసర ప్రాంతాల మధ్య ఉన్న నల్లమల అభయారణ్యంలో పులుల సంతతి గత రెండు మూడేళ్లుగా బాగా వృద్ధి చెందుతోంది. ప్రస్తుతం వాటి సంఖ్య 73 దాకా ఉందని అటవీశాఖ అధికారిక లెక్కల ప్రకారం చెబుతున్నా.. అనధికారికంగా మరో పది పులులు ఉండొచ్చని భావిస్తున్నారు. టైగర్ జోన్‌లో ఆహారం లభించక వేట కోసమో, నీటి లభ్యత తగ్గడం వల్లనో పులులు పల్నాడు జిల్లా వైపు వచ్చి ఉంటాయంటున్నారు. ఈ పులులు దుర్గి, కారంపూడి, బొల్లాపల్లి మండల పరిధిలోని నల్లమల అటవీ సమీప ప్రాంతాల్లో సంచరించే అవకాశం ఉందని, ఆ ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, దారి తప్పి వచ్చిన రెండు పులులను తిరిగి అభయారణ్యంలోకి సురక్షితంగా పంపేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అటవీ, వేట నిరోధక దళాలు, వనమిత్రల సాయంతో పులుల జాడ తెలుసుకుని, వాటి మార్గాలను టైగర్ జోన్ వైపు మళ్లించే యత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యంగా అభయారణ్యంలో నుంచి నీటి కోసం పులులు వచ్చే అవకాశం ఉండటంతో మంచి నీటి కుంటలు ఏర్పాటు చేసి నీటిని నింపుతున్నారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు పొలాల చుట్టూ వేసే విద్యుత్ కంచెల బారిన పడి మరణించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట విద్యుత్‌ను నిలుపుదల చేయాలని విద్యుత్ శాఖను కోరారు.

అప్రమత్తంగా ఉండండి..



దుర్గి మండల పరిసరాల్లో రెండు పులులు సంచరిస్తున్నట్టు గుర్తించాం. ప్రస్తుతం పులులకు ఎటువంటి ఆపద రాకుండా సురక్షితంగా తిరిగి అభయారణ్యంలోకి పంపడం, ప్రజలను అప్రమత్తం చేసి వాటికి దూరంగా ఉంచడం మా కర్తవ్యం. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు అటవీ సమీప ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే గుంపులుగానే వెళ్లాలి.

– రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి.

రెండు పులులను చూశా..



నాలుగు రోజుల కిందట అర్ధరాత్రి పూట పొలానికి వచ్చిన సమయంలో రెండు పులులను చూశాను. ఒకటి పెద్దది, రెండోది చిన్నది. పొలంలోని గుంతల్లో నీటిని తాగి వెళ్లాయి. ఇటీవల మా పొలం సమీపంలోనే ఆవును చంపి లాక్కెళ్లాయి. రాత్రి పూట పొలానికి రావాలంటే భయంగా ఉంది.

– గోవింద, పులిని చూసిన ప్రత్యక్ష సాక్షి, గజాపురం, దుర్గి మండలం.

వెంగమాంబ రచనలు ఎందరికో స్ఫూర్తి

- విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర
- ఘనంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 293వ జయంతి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర

తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కీర్తనలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 293వ జయంతి ఉత్సవాలు గురువారం తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో టీటీడీ నిర్వహించింది. స్వరూపానందేంద్ర అనుగ్రహభాషణం చేస్తూ..వెంగమాంబ తన సాహిత్యం, సంకీర్తనల ద్వారా అప్పట్లో సమాజంలో ఉన్న సమస్యలకు వ్యతిరేకంగా పోరాడి సంస్కరించారని చెప్పారు. వెంగమాంబ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు టీటీడీ ఈవో ధర్మారెడ్డిని అభినందించారు. సారకాయల కృష్ణారెడ్డి రచించిన 'వెంగమాంబ దాన శాసనాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వరూపానందేంద్ర, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రకు టీటీడీ జేఈవో సదా భార్గవి శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే జేఈవోను శాలువాతో స్వరూపానందేంద్ర సత్కరించారు. అంతకుముందు సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీవారి ఆలయం నుంచి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనంలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ ప్రారంభమైంది. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు తరిగొండ వెంగమాంబ యక్షగానం సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహించారు.

పైన క్యాబేజీ బుట్టలు.. కింద గంజాయి

- బొలేరా వాహనంలో తరలిస్తున్న ఇద్దరు అరెస్టు


గంజాయి మూటలను పోలీస్‌స్టేషన్‌కి తరలిస్తున్న దృశ్యం

సింహాచలం: సినీ ఫక్కీలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని గురువారం పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. క్యాబేజీ బుట్టల మూటలను నగరంలోకి విక్రయానికి తీసుకెళ్తున్నట్లు నమ్మిస్తూ దాంతోపాటు గంజాయిని కూడా సరఫరా చేస్తున్న వైనాన్ని పోలీసులు పసిగట్టారు. పెందుర్తి సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ నుంచి క్యాబేజీ బుట్టల మూటల లోడుతో విశాఖ నగరం వైపు గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఓ బొలేరో వాహనం వెళుతున్నది. కొత్తవలస నుంచి పెందుర్తి వచ్చే మార్గంలో సరిపల్లి వద్ద వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. నగరంలోకి క్యాబేజీ బుట్టలు విక్రయానికి తీసుకెళ్తున్నామని వాహనంలో ఉన్న చంద్రశేఖర్ బిసోయ్ (23) మరో మైనర్ బాలుడు చెప్పడంతో అనుమానం వచ్చి తనిఖీ చేశారు. క్యాబేజీ బుట్టల మూటలు పైకి తీయగా అడుగున గంజాయి మూటలు కనిపించాయి. సుమారు 14 మూటల్లో తరలిస్తున్న 450 కిలోల గంజాయిని, బొలేరా వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు.

కేదార్‌నాథ్ యాత్రికులు సురక్షితం

- ఏలూరులోని ట్రావెల్ ఏజెన్సీ నుంచి వెళ్లిన 88 మంది
- అందరూ బాగానే ఉన్నారని వెల్లడి

ఏలూరు టౌన్ /పాలకొల్లు సెంట్రల్: కేదార్‌నాథ్‌లో మంచు తుపాన్‌లో చిక్కుకున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన యాత్రికులు సురక్షితంగా ఉన్నారు. కేదార్‌నాథ్ యాత్రికులు మంచు ప్రమాదంలో చిక్కుకున్నారని తెలియడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి వెళ్లినవారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం అందరూ బాగానే ఉన్నారని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఏలూరులోని ఇండిగా ట్రావెల్స్ ద్వారా ఆంధ్రా, తెలంగాణ నుంచి 88 మంది ఏప్రిల్ 24వ తేదీన కేదార్‌నాథ్ యాత్రకు బయలుదేరి వెళ్లారు. వారు బుధవారం బద్రీనాథ్‌లో దర్శనం చేసుకున్నారు. ఈ నెల ఐదో తేదీన హరిద్వార్‌లో దర్శనం చేసుకోవాల్సి ఉంది. కానీ, బుధవారం వారు దర్శనం చేసుకున్న తర్వాత విపరీతమైన మంచు కురియడం, మంచు చరియలు పడిపోయాయి. దీనిపై సరైన సమాచారం అందక వారి బంధువులు ఆందోళనకు గురయ్యారు. తమ వద్ద నుంచి వెళ్లిన అందరూ బాగున్నారని, దర్శనం పూర్తి చేసుకుని సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారని ఇండిగా ట్రావెల్స్ యజమాని రాజు తెలిపారు. తాము నిత్యం యాత్రికులతో ఫోన్‌లో మాట్లాడుతూ యోగక్షేమాలు తెలుసుకుంటూనే ఉన్నామని చెప్పారు. మరోవైపు కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లిన పాలకొల్లుకు చెందిన తొమ్మిది మంది యాత్రికులు కూడా సురక్షితంగా ఉన్నారు. తాము సురక్షితంగా ఉన్నామని బంధువులకు తెలియజేస్తూ ఫోటోను వాట్సాప్ ద్వారా పంపించారు.

సూడాన్ నుంచి క్షేమంగా చేరిన ప్రొద్దుటూరు వాసులు


సూడాన్ నుంచి వచ్చిన ముక్కర బాబు, కాటం హరిప్రసాద్

ప్రొద్దుటూరు : సూడాన్ అంతర్ యుద్ధంలో చిక్కుకున్న వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు కార్మికులు సురక్షితంగా గురువారం ఇంటికి చేరారు. పట్టణానికి చెందిన బంధువులైన ముక్కర బాబు, కాటం హరిప్రసాద్ చాలాకాలంగా సూడాన్‌లోని ఆల్‌బగీర్ ప్రాంతంలో ఉన్న టైల్స్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో ఇంటికి వచ్చిన వీరు రెండు నెలల క్రితం మళ్లీ సూడాన్ వెళ్లారు. ఊహించని విధంగా సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య సూడాన్‌లో అంతర్ యుద్ధం జరుగుతోంది. వీరు పనిచేసే ప్రాంతంలో సైతం తరచూ కాల్పులు జరిగేవి. గత నెల 17న జరిగిన కాల్పుల్లో కేరళ రాష్ట్రానికి చెందిన అల్బర్ట్ అగస్టీన్ మృతి చెందారు. దీంతో కేంద్ర ప్రభుత్వం భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఆపరేషన్ కావేరి చేపట్టింది. ఈ మేరకు బాబు, హరిప్రసాద్ క్షేమంగా వచ్చారు. వీరితోపాటు విజయవాడ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, తిరుపతికి చెందిన సుధాకర్ కూడా ఉన్నారు.

రూ.2 వేల కోసం కత్తితో దాడి

- ఆస్పత్రిలో చావుబతుకుల్లో బాధితుడు
- వడ్డీ వ్యాపారి భార్య ఆత్మహత్యా యత్నం
- తిరుపతిలో ఘటన


జ్ఞానేంద్రరెడ్డి శరీరంపై కత్తిపోట్లు

తిరుపతి రూరల్: రూ.10 వేలు వడ్డీకి ఇచ్చాడు. ఎనిమిది నెలల్లో వడ్డీ రూపంలోనే రూ.25 వేలు వసూలు చేశాడు. ఇంకా రూ.2 వేలు ఇవ్వాలని వేధించాడు. ఇవ్వకపోవడంతో కత్తితో విచక్షణరహితంగా దాడి చేశాడు. దీంతో బాధితుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. తిరుపతి రూరల్ మండలం అవిలాలకు చెందిన జ్ఞానేంద్రరెడ్డి తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఖర్చుల నిమిత్తం గతేడాది ఆగస్టులో ఎంఆర్‌పల్లికి చెందిన వడ్డీ వ్యాపారి లోకేష్ వద్ద రూ.10 వేలు అప్పు చేశాడు. వారం వారం వ్యాపారి వడ్డీ వసూలు చేసుకునేవాడు. ఇలా ఎనిమిది నెలల్లోనే అసలు కాకుండా రూ.25 వేలు వడ్డీ కింద చెల్లించినట్లు బాధితుడు చెప్పాడు. అసలు, వడ్డీతో కలిపి రూ.35 వేలు చెల్లించినా ఇంకా రూ.2 వేలు చెల్లించాల్సిందేనంటూ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో జ్ఞానేంద్రరెడ్డి ఇంటికి లోకేష్ వెళ్లాడు. మాట్లాడుదాం అంటూ బయటకు తీసుకెళ్లి అక్కడ మరో ఇద్దరితో కలిసి జ్ఞానేంద్రరెడ్డిపై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన జ్ఞానేంద్రరెడ్డిని స్థానికులు రుయా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. అనంతరం లోకేశ్ ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. అనంతరం రాత్రి అతన్ని ఇంటికి పంపించివేశారు. ఇంటికి వెళ్లిన అనంతరం లోకేష్ తన భార్యతో గొడవ పెట్టుకోవడంతో ఆమె విషం తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కూడా చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. దీంతో అర్ధరాత్రి రుయా వద్ద జ్ఞానేంద్రరెడ్డి, లోకేష్ వర్గాలు ఘర్షణకు దిగాయి. గురువారం ఉదయం లోకేష్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు.

ఎలక్ట్రిక్ బైక్‌గా.. చవకగా

- నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఘనత


తాము తయారు చేసిన ఎలక్ట్రిక్ బైక్‌తో మెకానికల్ బ్రాంచి విద్యార్థుల బృందం

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో పెట్రోలు వాహనాలకు బదులుగా కాలుష్యం లేని విద్యుత్ వాహనాలను ఉపయోగించాలనే లక్ష్యంతో మెకానికల్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరానికి చెందిన 12 మంది విద్యార్థుల బృందం పెట్రోలు బైక్‌ను ఎలక్ట్రిక్ బైక్‌గా మార్చారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఈ బైక్ విద్యార్థులను, ఫ్యాకల్టీని ఆకట్టుకుంటోంది. మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరానికి చెందిన వానపల్లి యశ్వంత్‌కుమార్ సారథ్యంలో 12 మంది విద్యార్థులు పాత బైక్‌ను తీసుకుని దాని ఇంజన్ స్థానంలో 48 వోల్టేజీ, 24 ఏహెచ్ సామర్థ్యం కలిగిన సెకండ్ హ్యాండ్ లిథియమ్ అయాన్ బ్యాటరీని రూ.14,300కు కొనుగోలు చేశారు. రూ.17 వేలతో బీఎల్‌డీసీ హబ్ మోటార్‌ను కొనుగోలు చేసి వెనుక చక్రానికి బిగించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. బ్యాటరీని ఫుల్ చార్జి చేశాక ట్రయల్ రన్ నిర్వహించగా ఇద్దరు కలిసి గంటకు 60 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించగా 37 కిలోమీటర్ల దూరం నడిచింది. ఈ బ్యాటరీ ఫుల్ చార్జింగ్‌కు రెండున్నర గంటలు పడుతుండగా, ఇంట్లోనే మామూలు ప్లగ్ ద్వారా చార్జింగ్ పెట్టుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు గైడ్‌గా ఫ్యాకల్టీ అశ్వర్థ నారాయణ వ్యవహరించారు.

వేడుకగా ప్రారంభమైన పద్మావతీ అమ్మవారి వసంతోత్సవాలు


అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు: తిరుపతి జిల్లాలోని తిరుచానూరులో కొలువైన శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది వసంత రుతువులో అలివేలుమంగమ్మకు పాంచరాత్ర్య ఆగమానుసారం శాస్త్రోక్తంగా వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామునే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనం మండపానికి తీసుకువచ్చి కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యం, గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాంగ శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగారు. వసంతోత్సవంలో భాగంగా స్వర్ణరథంపై తిరువీధుల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తెలంగాణ

హెలికాప్టర్ కూలి జవాన్ మృతి

- మృతునిది రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి

బోయినపల్లి (చొప్పదండి): జమ్ముకశ్మీర్‌లో హెలికాప్టర్ కూలి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంమల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్ (29) దుర్మరణం చెందారు. పదకొండేళ్ల క్రితం ఆర్మీలో చేరిన అనిల్.. సీఎఫ్ఎన్‌లో ఏవీఎన్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అనిల్ తన అత్తగారి గ్రామమైన కోరెంలో జరిగిన బీరప్ప పట్నాల నిమిత్తం 20 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి.. పది రోజుల క్రితమే తిరిగి విధుల్లో చేరారు. ఆయనకు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు

- నేడు సెమీ ఫైనల్స్, ఫైనల్స్


హ్యాండ్‌బాల్‌లో పోటీపడుతున్న విశాఖ-పశ్చిమ గోదావరి జిల్లాల బాలికల జట్లు

తిరుపతి ఎడ్యుకేషన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి తిరుపతిలో నిర్వహిస్తోన్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు రసవత్తరంగా మారాయి. ఫుట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి 14 క్రీడల్లో జరుగుతోన్న పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శుక్రవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. రన్నింగ్ రేస్ పురుషుల విభాగంలో విజయనగరం 21 పాయింట్లు, విశాఖ 14, పశ్చిమ గోదావరి 12 పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో తొలి 3 స్థానాల్లో నిలిచాయి. వెయిట్ లిఫ్టింగ్ మహిళల విభాగంలో పశ్చిమ గోదావరి 14 పాయింట్లు, శ్రీకాకుళం 14, గుంటూరు 11 పాయింట్లు సాధించాయి. వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి 20 పాయింట్లు, కర్నూలు 19, తూర్పు గోదావరి 15 పాయింట్లు సాధించాయి. బ్యాడ్మింటన్ పురుషుల టీం చాంపియన్‌షిప్ విభాగంలో పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప, కృష్ణ జట్లు మొదటి 3 స్థానాలను సాధించాయి. బ్యాడ్మింటన్ మహిళల టీం చాంపియన్‌షిప్ విభాగంలో పశ్చిమ గోదావరి, కృష్ణ, వైఎస్సార్ కడప జట్లు తొలి 3 స్థానాల్లో నిలిచాయి.

తెలంగాణ

పటాయా పార్టీతో సంబంధం లేదు

- అలా ఉంటే వెంటనే ఇక్కడికి రాలేను
- పటాయా పార్టీతో సంబంధం లేదు
- అలా ఉంటే వెంటనే ఇక్కడికి రాలేను
- తప్పుడు ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశం
- చీకోటి ప్రవీణ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్, కొండపాక(గజ్వేల్): మొన్నటికి మొన్న ఈడీ మనీలాండరింగ్ కేసు... నిన్నటికి నిన్న థాయిలాండ్‌లో గుట్టురట్టయిన అక్రమ క్యాసినో వ్యవహారం ఈ రెండింటిలోనూ ప్రధానంగా వినిపించిన పేరు చీకోటి ప్రవీణ్ కుమార్. నగరానికి చేరుకున్న ప్రవీణ్ పటాయా క్యాసినో వ్యవహారంపై స్పందిస్తూ మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని ఆరోపించారు. ఆ వీడియోలో ప్రవీణ్ మాట్లాడుతూ... 'థాయిలాండ్‌లో నేను ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆ ఈవెంట్ దేవ్, సీత అనే వాళ్లు నిర్వహించారు. పోకర్ టోర్నమెంట్ నాలుగు రోజులు పాటు జరుగుతోందని నాకు ఆహ్వాన పత్రిక పంపారు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు పాల్గొనే టోర్నమెంట్ అని చెప్పడంతోనే పటాయా వెళ్లా. నేను అక్కకు వెళ్లిన నాలుగో రోజు సదరు హోటల్‌లోని కాన్ఫరెన్స్ రూమ్‌ను సందర్శించా. అందులో అడుగుపెట్టిన 15 నుంచి 20 నిమిషాల్లోనే పోలీసులు దాడి చేశారు. అప్పుడే నాకు వాళ్లు పంపింది నకిలీ ఆహ్వానపత్రిక అని తెలిసింది. అక్కడి పోలీసులేమో సదరు ఈవెంట్ నిర్వహణకు అనుమతి లేదన్నారు. కానీ ఆహ్వానించిన వాళ్లు ఉందని చెబుతున్నారు. ఆ అక్రమ క్యాసినో నిర్వహించింది నేనే అయితే ఇంత తేలిగ్గా తిరిగి రాలేను. అలాంటి వాటికి అక్కడ కఠినమైన శిక్షలు ఉన్నాయి. థాయిలాండ్‌లో అక్రమంగా పేకాట శిబిరాలు నిర్వహిస్తే ఆరు నెల నుంచి ఏడాది వరకు జైలు శిక్షపడుతుంది. నా పాస్‌పోర్టు కూడా బ్లాక్‌లిస్ట్ చేసే వాళ్లు. పోలీసులు దాడి చేసిన రోజు అక్కడి న్యాయస్థానానికి సెలవు. అందులో మరుసటి రోజు కోర్టులో హాజరుపరచగా స్వల్ప జరిమానాతో విడిచిపెట్టారు. అని వివరించారు.



నామీద చాలా కుట్రలు

''నా చుట్టూ చాలా కుట్రలు జరుగుతున్నాయి. నేను రాజకీయ పార్టీలోకి వస్తున్నానని కొందరు అనుకుంటున్నారేమో..! ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పటాయాలో అక్రమ క్యాసినోతో నాకు ఎలాంటి సంబంధం లేదని నిర్వాహకులు దేవ్, సీత కూడా అక్కడి పోలీసుల వద్ద అంగీకరించారు. ఈ స్టేట్‌మెంట్ తర్వాతే థాయ్ పోలీసులు నా పాత్ర లేదని నిర్ధారించుకున్నారు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి నేను అక్కడ రూ.50 లక్షలు లంచం ఇచ్చానని జరుగుతున్న ప్రచారం సత్యదూరం. చట్టబద్ధంగా క్యాసినో నడపడానికి నాకు అనేక చోట్ల అవకాశం ఉంది. అలాంటప్పుడు అక్రమంగా నిర్వహించాల్సిన అవసరం లేదు. ఆ ఈవెంట్‌కు చీకోటికి ఎలాంటి సంబంధం లేదు'అని అన్నారు.

నాకేం సంబంధం లేదు: దేవేందర్‌రెడ్డి

థాయ్‌లాండ్‌లోని పటాయాలో జరిగిన గ్యాంబ్లింగ్ డెన్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లగా.. అక్కడి హోటల్‌లో ఇండియన్ ఫుడ్ తయారు చేయించామంటూ స్నేహితులు చెప్పడంతో ఆ హోటల్‌కు వెళ్లామన్నారు. 10 నిమిషాల్లోనే అక్కడి పోలీసులు వచ్చి పట్టుకున్నారని చెప్పారు. అసలు అక్కడ కేసినోనే జరగలేదనీ, పోకర్ గేమ్ మాత్రమే పెట్టారని తెలిపారు. తమపై పెట్టిన కేసు నిరాధారమంటూ కోర్టు కొట్టివేసిందన్నారు. తన రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక కొందరు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కక్షతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

మణిపూర్‌లో భీకర హింస

అగ్గి రాజేసిన 'గిరిజన హోదా' డిమాండ్

మైతీ, గిరిజన వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ	ఇళ్లు, దుకాణాలు, వాహనాలు దహనం	రంగంలోకి దిగిన సైన్యం, అస్సాం రైఫిల్స్ దళం	రాష్ట్రంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ



ఇంఫాల్‌లో ఆందోళనకారులు నిప్పుపెట్టిన వాహనాలు

ఇంఫాల్: మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లింది. తమకు షెడ్యూల్డ్ కులాల(ఎస్టీ) హోదా కల్పించాలని రాష్ట్ర జనాభాలో 53 శాతం ఉన్న మైతీ వర్గం డిమాండ్ చేయడం అగ్గి రాజేసింది. గిరిజనులు భగ్గుమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇళ్లు, దుకాణాలు, వాహనాలకు నిప్పుపెట్టారు. ప్రార్థనా మందిరాలపై దాడి చేశారు. గిరిజనేతరులతో ఘర్షణకు దిగారు. ఈ హింసాకాండలో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి 55 పటాలాల సైన్యంతోపాటు అస్సాం రైఫిల్స్ జవాన్లను ప్రభుత్వం గురువారం రంగంలోకి దించింది. మరో 14 పటాలాల సైన్యాన్ని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. మైతీ వర్గం అధికంగా ఉన్న దక్షిణ ఇంఫాల్, కాక్‌చింగ్, థౌబాల్, జిరిబామ్, బిష్ణుపూర్ జిల్లాలతోపాటు గిరిజన ప్రాబల్యం కలిగిన చురాచాంద్‌పూర్, కాంగ్‌పోక్పి, తెంగ్నౌపాల్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. చురాచాంద్‌పూర్, మంత్రిపుఖ్రీ, లాంఫెల్, కొయిరంగీ, సుగ్ను తదితర ప్రాంతాల్లో అస్సాం రైఫిల్స్ జవాన్లు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్) సిబ్బంది మోహరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రమంతటా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటిదాకా 9,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఘర్షణలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేసింది.

అక్రమ వలసల వల్లే..

మైతీలు ప్రధానంగా మణిపూర్ లోయలో నివసిస్తున్నారు. మయన్మార్, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసల కారణంగా తాము ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని, తమకు ఎస్టీ హోదా కల్పించాలని వారు కోరుతున్నారు. వలసదారుల నుంచి గిరిజనులకు చట్టప్రకారం కొన్ని రక్షణలు ఉన్నాయి. మైతీలకు ఎస్టీ హోదాపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సును నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని గత నెలలో మణిపూర్ హైకోర్టు సూచించింది. దీనిపై గిరిజనులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అపార్థం వల్లే అనర్థం: సీఎం

రాష్ట్రంలో శాంతి భద్రతలకు ప్రజలంతా సహకరించాలని ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ విజ్ఞప్తి చేశారు. అమాయకులు మృతి చెందడం, ఆస్తులు ధ్వంసం కావడం బాధాకరమని పేర్కొన్నారు. కేవలం అపార్థం వల్లే ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు. మణిపూర్‌లో హింసాకాండపై పొరుగు రాష్ట్రం మిజోరాం ముఖ్యమంత్రి జోరాంథాంగా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో త్వరగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

గిరిజన సంఘీభావ యాత్ర

గిరిజనేతరులైన మైతీ వర్గానికి ఎస్టీ హోదా కల్పించాలన్న డిమాండ్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లాల్లో ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపూర్(ఏటీఎస్‌యూఎం) ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా మైతీలకు, గిరిజనులకు నడుమ ఘర్షణ మొదలయ్యింది. రాత్రికల్లా తీవ్రస్థాయికి చేరింది. హింస చోటుచేసుకుంది. తొలుత చురాచాంద్‌పూర్ జిల్లాలో మొదలైన ఘర్షణ, హింసాకాండ క్రమంగా రాష్ట్రమంతటికీ విస్తరించింది.

యూపీలో మరో గ్యాంగ్‌స్టర్ హతం



గ్యాంగ్‌స్టర్ దుజానా మృతదేహం

మీరట్: ఉత్తరప్రదేశ్ పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. యూపీ, ఢిల్లీల్లో 18 హత్య కేసులు సహా మొత్తం 60 కేసుల్లో నిందితుడైన గ్యాంగ్‌స్టర్ అనిల్ దుజానా పోలీసుల వాంటెడ్ లిస్ట్‌లో ఉన్నాడు. గౌతమ బుద్ధనగర్ జిల్లా బాదల్‌పూర్ పరిధిలోని దుజానా గ్రామానికి చెందిన అనిల్‌పై 2002లో మొదటిసారిగా హత్యకేసు నమోదైంది. ఓ కేసులో అరెస్టయిన ఇతడు ఇటీవలే జైలు నుంచి బెయిల్‌పై వచ్చాడు. తన గ్యాంగ్‌ను మళ్లీ బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడిపై తాజాగా బలవంతపు వసూళ్ల కేసు నమోదైంది. దీంతో, గురువారం మధ్యాహ్నం ఎస్‌టీఎఫ్ పోలీసులు మీరట్ సమీపంలోని ఓ గ్రామంలో అతడున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి పట్టుకునేందుకు ప్రయత్నించారు. 'తప్పించుకునే క్రమంలో తన ఎస్‌యూవీతో విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించాడు. పోలీసుల ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు'అని ఎస్‌టీఎఫ్ అదనపు డీజీ అమితాబ్ యశ్ తెలిపారు. అతడి వాహనంలో ఉన్న నాలుగు పిస్టళ్లు దొరికాయన్నారు. పట్టణ స్థానిక ఎన్నికల పోలింగ్ మొదటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. కొన్ని రోజుల క్రితమే గ్యాంగ్‌స్టర్– రాజకీయ నాయకుడు అతీక్ అహ్మద్ కొడుకు అసద్, అతడి సన్నిహితుడు ఎన్‌కౌంటర్‌ హతమయ్యారు. ఆ తర్వాత రెండు రోజులకే అతీక్, అతడి సోదరుడు అష్రఫ్‌లను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపడం తెలిసిందే.

బిహార్‌లో కుల గణనపై స్టే

డేటా ఎవరికీ ఇవ్వొద్దని నితీశ్ ప్రభుత్వానికి పట్నా హైకోర్టు ఆదేశం

పట్నా: బిహార్‌లో నితీశ్ కుమార్ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కులగణనకు ఎదురు దెబ్బ తగిలింది. వెంటనే ఈ సర్వేని నిలిపివేయాలని పట్నా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు సేకరించిన డేటాని తాము తుది ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కులాల ఆధారంగా జనాభా లెక్కలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లను గురువారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వినోద్ చంద్రన్ ఆధ్వర్యంలో హైకోర్టు బెంచ్ పిటిషన్‌దారులు డేటా సమగ్రత, భద్రతపై వెలిబుచ్చిన ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం నివారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. జనాభా లెక్కల్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలే తప్ప రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ అధికారం లేదంటూ పిటిషన్‌దారులు పేర్కొనడాన్ని కూడా ప్రస్తావించింది. కులాల గణాంకాలు ఇతరుల చేతుల్లో పడితే దాని వల్ల రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనని ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు బెంచ్ తదుపరి విచారణను జులై 7కి వాయిదా వేసింది. నితీశ్ ప్రభుత్వం జనవరి 7 నుంచి 21 వరకు తొలి విడత కులగణన నిర్వహించింది. రెండో విడత ఏప్రిల్ 15 నుంచి మే 15వరకు జరగాల్సి ఉంది. ప్రభుత్వం ఇది కులగణన కాదని, ఆర్థికంగా వెనుకబడిన వారు ఏయే కులాల్లో ఉన్నారో తెలిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయన్న ఉద్దేశంతోనే దీనిని చేపట్టినట్టుగా వాదిస్తోంది.

జెలెన్‌స్కీని అంతం చేయక తప్పదు: మెద్వెదేవ్

మాస్కో: తమ దేశ అధ్యక్ష భవన సముదాయంపై డ్రోన్ల దాడికి ముమ్మాటికీ ఉక్రెయిన్ కారణమని రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ ఆరోపించారు. ఈ ఉగ్రవాద దాడి తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అంతం చేయడం మినహా తమకు మరో గత్యంతరం లేదని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్ వ్యవహార శైలిపై రష్యా అధినేత పుతిన్ సన్నిహితుడు, దిగువ సభ స్పీకర్ వైచెస్లావ్ వొలోదిన్ తీవ్రంగా స్పందించారు. ప్రత్యర్థి దేశం ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని అన్నారు. లేకపోతే ఉక్రెయిన్ ఉగ్రవాదులకు బుద్ధి చెప్పే ఆయుధాలను తాము ప్రయోగించాల్సి వస్తుందని ఉద్ఘాటించారు. ఇదిలా ఉండగా, క్రెమ్లిన్‌పైకి రెండు డ్రోన్లు దూసుకురావడంతో రష్యా భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా అధ్యక్షుడు పుతిన్‌ను ఆయన నివాసంలోని బంకర్‌లోకి తరలించినట్లు తెలుస్తోంది.

పుతిన్‌ను కోర్టు బోనెక్కిస్తా: జెలెన్‌స్కీ

హేగ్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ అంతర్జాతీయ న్యాయస్థానం బోనుకెక్కుతారని తాను బలంగా విశ్వసిస్తున్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. యుద్ధంలో తాము గెలిచిన వెంటనే యుద్ధ నేరాల కేసులో పుతిన్‌పై విచారణ ప్రారంభించేలా చర్యలు చేపడతామనన్నారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఉన్న నగరమైన హేగ్‌లో జరిగిన సదస్సులో ''ఉక్రెయిన్‌కు న్యాయం జరగనిదే శాంతి నెలకొనదు'' అనే అంశంపై జెలెన్‌స్కీ మాట్లాడారు. రష్యాతో ఏడాదికి పైగా కొనసాగుతున్న పోరులో తాము విజయం సాధిస్తామని జెలెన్‌స్కీ ధీమా వ్యక్తం చేశారు. యుద్ధంలో తాము గెలిచిన వెంటనే పుతిన్ అరెస్టుకు ఐసీసీ వారెంట్లు జారీ చేస్తుందన్నారు.

రెజ్లర్ల దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత

పోలీసుల చర్యపై వెల్లువెత్తిన విమర్శలు



గాయపడిన రెజ్లర్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో రెజ్లర్లు ఆందోళన చేస్తున్న దీక్షా స్థలి ఒక్కసారిగా ఉద్రిక్తతకు కేంద్ర బిందువైంది. రెజ్లర్లు, వారికి మద్దతుగా వచ్చిన ఆప్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడం, చివరకు తోపులాట, ఘర్షణకు దారితీసింది. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దీక్షా శిబిరం వద్ద వర్షాలతో రెజ్లర్లు వినియోగిస్తున్న పరుపులు తడిసి ముద్దయ్యాయి. వారికి సాయపడేందుకు కొన్ని చెక్క మంచాలను ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి తన కార్యకర్తలతో తెప్పించారు. వాటిని రెజ్లర్లకు ఇచ్చేందుకు అనుమతించేది లేదని, జంతర్‌మంతర్‌ను శాశ్వత దీక్షాశిబిరంగా మార్చేందుకు అనుమతులు లేవని అక్కడే మోహరించిన పోలీసులు తెగేసి చెప్పారు. అయినా సరే కొన్ని మంచాలను రెజ్లర్లకు కార్యకర్తలు ఇవ్వడం, వాటిని రెజ్లర్లు శిబిరంలోకి తీసుకెళ్తుండటంతో పోలీసులు, ఆప్ కార్యకర్తలకు మధ్య గొడవ జరిగింది. తమకు సాయపడేందుకు వచ్చిన ఆప్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో రెజ్లర్లు వారితో వాదనకు దిగారు. దీంతో రెజ్లర్లు, కార్యకర్తలను నిలువరించేందుకు పెద్ద ఎత్తున పోలీసులు బలప్రయోగం చేశారు. ఇరువర్గాల వాదనలు చివరకు తోపులాటలు, ఘర్షణకు దారితీశాయి. ఈ ఘటనలో రాహుల్ యాదవ్, దుష్యంత్ ఫొగాట్‌సహా పలువురు రెజ్లర్లకు గాయాలయ్యాయి.



రోదిస్తున్న సంగీతా ఫొగాట్, వినేశ్ ఫొగాట్

వినేశ్ ఫొగాట్ కంటతడి

నన్ను తిట్టారు. నేలకు పడేశారు. పురుష పోలీసులు తమతో అనుచితంగా ప్రవర్తించారు. ఒక్క మహిళా పోలీసు అయినా ఉన్నారా ఇక్కడ?. మమ్మల్ని చంపేద్దామనుకుంటున్నారా? చంపేయండి. ఇలాంటి రోజు కోసమేనా మేం దేశం కోసం పతకాలు సాధించింది? అంటూ ప్రముఖ మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ కన్నీరు పెట్టుకున్నారు. తాము సాధించిన పతకాలు, కేంద్రం ఇచ్చిన అవార్డులు, పద్మశ్రీ అన్నీ వెనక్కి ఇస్తామని రెజ్లర్లు హెచ్చరించారు.

విపక్షాల తీవ్ర ఆగ్రహం

రెజ్లర్లపై పోలీసుల దాడి దారుణమని విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. 'ఆటగాళ్లపై పోలీసుల దాడి సిగ్గు చేటు. సమాఖ్య చీఫ్ శరణ్‌ను ఆ పదవి నుంచి మోదీ తొలగించాలి' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. 'కోర్టు పర్యవేక్షణలో ఘటనపై దర్యాప్తు జరగాలి. కనీసం ఘటనాస్థలికి వెళ్లి మోదీ రెజ్లర్లకు సంఘీభావం ప్రకటించాలి' అని కాంగ్రెస్ డిమాండ్‌చేసింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితర నేతలూ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.



6న జరిగే పట్టాభిషేకంలో బ్రిటన్ రాజు చార్లెస్ ధరించే కిరీటం అచ్చం ఈ డిజైన్‌లో ఉంటుంది. దీనిని లండన్‌లో ఏర్పాటు చేశారు.

ఎన్సీపీ అధినేత ఎవరవుతారో?

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) తదుపరి జాతీయ అధ్యక్షుడు ఎవరన్నది శుక్రవారం తేలిపోనుంది. పార్టీ అధినేతగా తన వారసుడిని ఎంపిక చేసేందుకు శరద్ పవార్ ఒక కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ శుక్రవారం సమావేశం కానుందని ఎన్సీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. దక్షిణ ముంబైలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు భేటీ జరుగుతుందని వెల్లడించారు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే, సోదరుడి కుమారుడు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 1999లో ఏర్పాటైన ఎన్సీపీ అధ్యక్ష బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు శరద్ పవార్ మంగళవారం హఠాత్తుగా ప్రకటించి, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. తదుపరి అధినేతగా పవార్ కుటుంబం నుంచే ఎవరో ఒకరు ఎంపికవుతారని ప్రచారం సాగుతోంది. సుప్రియా సూలే లేదా అజిత్ పవార్ ఎన్సీపీ అధినేతగా పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఎన్సీపీ భవిష్యత్తు కోసమే తాను అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నానని శరద్ పవార్ గురువారం ప్రకటించారు.

581 మంది అభ్యర్థులపై నేరారోపణలు

కర్ణాటక ఎన్నికల్లో అభ్యర్థుల నేరచరితపై ఏడీఆర్ నివేదిక

సాక్షి బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న నేతలకూ ప్రధాన పార్టీలు టికెట్లిచ్చిమరీ ఎన్నికల బరిలో నిలిపాయి. ఈసారి పోటీ చేసే అభ్యర్థుల్లో 581 మంది (22 శాతం) నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు ఉండటం తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ 581 మంది నేతల్లో 404 మందిపై తీవ్రమైన నేరారోపణలు నమోదై ఉన్నాయి. ఈసారి శాసనసభ ఎన్నికల్లో నామినేషన్ దాఖలుచేసిన 2,613 మందిలో 2,586 మంది అభ్యర్థుల నామినేషన్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే సంస్థ పరిశీలించి సంబంధిత గణాంకాలను విడుదలచేసింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..

- ➤ బీజేపీ తరఫున 224 మంది నామినేషన్లు వేయగా అందులో 96 మందిపై కేసులున్నాయి. మొత్తం 223 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 122 మందిపై కేసులున్నాయి. మొత్తం 208 మంది జేడీఎస్ అభ్యర్థుల్లో 70 మందిపై, 208 ఆప్ అభ్యర్థుల్లో 48 మందిపై, 9 మంది ఎన్సీపీ అభ్యర్థుల్లో ఇద్దరిపై, ముగ్గురు సీపీఐ అభ్యర్థుల్లో ఒకరిపై, 901 స్వతంత్ర అభ్యర్థుల్లో 119 మందిపై కేసులున్నాయి.
- ➤ గతంలో పోలిస్తే బీజేపీ, జేడీఎస్‌లు ఎక్కువ మంది నేరచరితులకు టికెట్లు ఇచ్చాయి. 2018లో బీజేపీ అభ్యర్థుల్లో 37 శాతం మందిపై కేసులుంటే ఈసారి 43 శాతం మందిపై కేసులున్నాయి. జేడీఎస్‌లోనూ ఈ శాతం 21 నుంచి ఏకంగా 34 శాతానికి పెరగడం ఆందోళనకరం. కాంగ్రెస్ అభ్యర్థుల్లో 2018 ఏడాదిలోనూ, ఇప్పుడూ 55 శాతం మంది నేరచరితులున్నారు.
- ➤ 111 నియోజకవర్గాల్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది అభ్యర్థులు వివిధ రకాల క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు.

కుబేరులూ ఉన్నారు..

- ➤ బీజేపీ నుంచి 216 మంది, కాంగ్రెస్ నుంచి 215 మంది, జేడీఎస్ నుంచి 170, ఆప్ నుంచి 197 మంది అభ్యర్థులు కోట్లకు పడగలెత్తారని వారి నామినేషన్ల పత్రాల ద్వారా తెలుస్తోంది. స్వతంత్ర అభ్యర్థుల్లో 215 మంది కోటీశ్వరులు ఉండటం విశేషం. కోటీశ్వరులైన అభ్యర్థులను మొత్తంగా పరిశీలిస్తే ప్రతి అభ్యర్థి సరాసరి ఆస్తి విలువ రూ. 12 కోట్లు.

కర్ణాటక 'సెంట్రల్' ఎవరివైపు..!

అయిదుగురు సీఎంలను ఇచ్చిన ప్రాంతంగా ఘనత • బీజేపీ కంచుకోటలో కాంగ్రెస్ పాగా వెయ్యగలదా?

కన్నడ పోరు

సాక్షి,బెంగళూరు: సెంట్రల్ కర్ణాటకలో గత కొన్ని దశాబ్దాలుగా బీజేపీయే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. లింగాయత్‌ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో బీజేపీ హవా నడుస్తూ వస్తోంది. బీజేపీతో విభేదాలతో ఆ పార్టీ దిగ్గజ నాయకుడు యడియూరప్ప కర్ణాటక జనతా పార్టీ పేరుతో వేరు కుంపటి పెట్టి ఎన్నికల బరిలో దిగిన 2013లో మినహాయిస్తే మిగిలిన ఎన్నికల్లో బీజేపీదే పై చేయి. దావణగెరె, శివమొగ్గ, చిత్రదుర్గ, తుమకూరు జిల్లాలతో కూడిన ఈ ప్రాంతంలో లింగాయత్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ జనాభా ఎక్కువే. మొత్తం 32 స్థానాల్లో 8 సీట్లు ఎస్సీ, ఎస్టీకి రిజర్వ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఈ సారి లింగా యత్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ ఓట్లు తమకేనని అందుకే ఈ సారి ఈ ప్రాంతంలో తమ పార్టీ దూసుకు పోతుందన్న అంచనాలతో ఉంది. మలేనాడు, మధ్య కర్ణాటక జిల్లాల నుంచి రాష్ట్రానికి ఇప్పటికి ఐదు మంది ముఖ్యమంత్రులు వచ్చారు. దీంతో కర్ణాటక లోని ఈ ప్రాంతంపై ఆయా రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. అయిదుగురు మాజీ ముఖ్యమంత్రుల్లో కడిదాళ్ మంజప్ప, ఎస్.బంగారప్ప, జేహెచ్ పటేల్, బీఎస్ యడియూరప్ప వంటి నేతలు అవిభజిత శివమొగ్గ జిల్లాకు చెందిన వారు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఈ ప్రాంతంపై పట్టుకు బీజేపీ,కాంగ్రెస్ శ్రమిస్తున్నాయి. కేవలం తుముకూరు జిల్లాలో మాత్రమే పట్టు ఉన్న జేడీ(ఎస్) ఈ సారి అన్ని జిల్లాలకు విస్తరించడానికి వ్యూహాలు పన్నుతోంది.

అవకాశాలను అందిపుచ్చుకున్న బీజేపీ..


గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతం కాల క్రమేణ బీజేపీ వశం అయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బీజేపీకి మధ్య హోరాహోరీ పోరు నడుస్తోంది. 2004 నుంచి హిందూ ఓట్లను క్రోడీకరించడంలో బీజేపీ సఫలీకృతమైంది. అప్పటి నుంచి నెమ్మదిగా పుంజుకుంటూ మధ్య కర్ణాటకలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. బీజేపీకి కీలక ఓటు బ్యాంకుగా ఉన్న లింగాయత్‌లు శివమొగ్గ, దావణగెరె జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉండడం అధికార పార్టీకి కలిసి వచ్చింది.

సీట్లను పెంచుకునే వ్యూహంలో కాంగ్రెస్

స్థానికంగా ఉన్న సమస్యల్ని ఎత్తి చూపుతూ కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా ప్రచారంలో మలుచుకుంటోంది. ఎక్కడిక్కడే హామీలు గుప్పిస్తూ ఈ సారి మధ్య కర్ణాటకలో అత్యధిక స్థానాలను దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. గత ఏడాది కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య 75వ పుట్టిన రోజు వేడుకల్ని దావణగెరెలో భారీగా నిర్వహించి ఎన్నికల సమరశంఖాన్ని పూరించింది. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా సెంట్రల్ కర్ణాటకలో అత్యధికంగా ర్యాలీలు నిర్వహిస్తూ వస్తున్నారు. జేడీ(ఎస్) తుముకూరు ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి పంచరత్న యాత్రని వినియోగించుకున్నారు. మొత్తమ్మీద సెంట్రల్ ఓటరు ఎవరిని కరుణిస్తారో వేచి చూడాలి.

స్థానిక అంశాలపై బీజేపీ దృష్టి

లింగాయత్ ఓట్లతో పాటుగా స్థానిక సమస్యల పరిష్కారంపై బీజేపీ దృష్టి సారించింది. శివమొగ్గ జిల్లాలో బగర్‌హుకుం భూ స్వాధీనం, శరావతి ప్రాజెక్టు పునరావాసం, విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ కర్మాగారం మూసివేత వంటి సమస్యలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. చిక్కమగళూరు జిల్లాలో వర్షాల వల్ల కాఫీ సాగుదారులు తీవ్రంగా నష్టపోయారు. భద్రా ఎత్తిపోతల ప్రాజెక్టు చిత్రదుర్గ జిల్లాలో ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ. 5,300 కోట్లు ప్యాకేజీ ప్రకటించింది. ఈ అంశం బీజేపీకి అనుకూ లంగా మారింది. ఇక ధరాభారం, రాష్ట్ర ప్రభుత్వ అవినీతి కూడా ఎన్నికల్లో ప్రభావం చూపనుంది. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ఇంకా ఎటూ తేల్చకపోవడంతో ఈ వర్గం వారు అధికార పార్టీపై గుర్రుగా ఉన్నారు.



సరిహద్దు సమస్యల పరిష్కారానికే పెద్ద పీట

చైనా విదేశాంగ మంత్రి కిన్‌తో జైశంకర్ భేటీ

గోవా: తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో శాంతి స్థాపన లక్ష్యంగా సరిహద్దు సమస్యల్ని పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌కు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి సరిహద్దు సమస్యల్ని పరిష్కరించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. గురువారం జరిగిన షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల మండలి సమావేశంలో పాల్గొనడానికి గోవాకి వచ్చిన కిన్ గాంగ్‌తో బెనాలిమ్ బీచ్ రిసార్ట్‌లో జై శంకర్ సమావేశమయ్యారు. సరిహద్దు సమస్యతో పాటు ఎస్‌సీఓ, జీ–20, బ్రిక్స్‌కు సంబంధించిన అంశాలపై ఇరుదేశాల మంత్రులు చర్చించారు. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో జైశంకర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్ రష్యా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించారు. ఎస్‌సీఓలో పాల్గొనేందుకు పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ గురువారం గోవాకు చేరుకున్నారు.

దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లు

సాక్షి, న్యూఢిల్లీ: చిరుతిండిని అమితంగా ఇష్టపడే ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 100 'ఫుడ్ స్ట్రీట్'లకు ఆర్థికసాయం చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు సంబంధిత ఫుడ్‌స్ట్రీట్ ప్రాజెక్టు కార్యాచరణపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర ఆరోగ్య శాఖ, భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికార సంస్థ(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) అధికారులు పాల్గొన్నారు. మొదటగా పైలట్ ప్రాజెక్ట్ కింద దేశవ్యాప్తంగా 100 చోట్ల ఫుడ్‌స్ట్రీట్‌లను అక్కడి వ్యాపార సంస్థలు/వ్యాపారులతో కలిసి ప్రారంభిస్తారు. ఈ 100 ఫుడ్ స్ట్రీట్స్‌లో ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగు, తెలంగాణలో నాలుగు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో ఫుడ్‌స్ట్రీట్‌కు రూ.1 కోటి ఆర్థిక సాయం అందిస్తారు. ఈ ఫుడ్‌స్ట్రీట్‌లలో ఆహారం ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతోపాటు ఆయా వ్యాపారులు సొంత బ్రాండింగ్ చేసుకోవాలి.

పాక్‌లో కాల్పుల్లో 8 మంది టీచర్లు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో గురువారం జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో 8 మంది ఉపాధ్యాయులు చనిపోయారు. అప్పర్ కుర్రమ్ జిల్లా పరాచినార్‌లోని ప్రభుత్వం పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ షరీఫ్‌ను గుర్తు తెలియని సాయుధుడు కాల్చి చంపాడు. ఆయన సున్నీ మెంగల్ తెగకు చెందిన వాడు. దీంతో మెంగల్ వర్గీయులు ఆగ్రహంతో ప్రభుత్వ తెరి మెంగల్ హైస్కూల్‌లోకి చొరబడి ప్రత్యర్థి తోరి షియా తెగకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులను చంపేశారు. ఈ ఘటన స్థానిక తెగల మధ్య ఉద్రిక్తతలు రాజేసే అవకాశముందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

'బజరంగ్‌దళ్ నిషేధం' హామీపై నిరసనలు

బెంగళూరు: అధికారంలోకి వస్తే వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌లపై నిషేధం విధిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీపై కర్ణాటకలో నిరసనలు వెల్లువెత్తాయి. బెంగళూరు, చిక్కబళ్లాపుర, శ్రీరంగపట్న, మాండ్య, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు హనుమాన్ చాలీసా పఠించారు. ఆలయాల్లో హనుమాన్ చాలీసా పఠిస్తూ కాంగ్రెస్‌పై నిరసన వ్యక్తం చేశారు. ప్రజలంతా పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి హనుమాన్ చాలీసా పారాయణం చేయాలంటూ పిలుపునిచ్చారు. శ్రీరంగపట్నలో కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. వాటిని కాళ్లతో తొక్కారు.

37 వేల కిలోమీటర్ల రైల్వే లైన్ల విద్యుదీకరణ

న్యూఢిల్లీ: గడిచిన 9 ఏళ్లలో దేశవ్యాప్తంగా ఉన్న 37,011 కిలోమీటర్ల రైల్వే లైన్ విద్యుదీకరణ పూర్తి చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు కేవలం 21,413 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరిగిందని పేర్కొంది. దీంతో, మొత్తం 58,424 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరిగిందని వివరించింది.

అవినీతి బీజేపీని ఓడించాలి: ప్రియాంక

సాక్షి, బళ్లారి: 'కర్ణాటక ఎన్నికలు మహాభారత యుద్ధం వంటివి. కౌరవులు, పాండవుల మధ్య యుద్ధం జరుగుతోంది. అవినీతి పరులు, రాష్ట్రాన్ని లూటీ చేసిన బీజేపీకి ఓటు వేస్తారా? అవినీతి రహిత పాలన అందించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారా? మీరు తేల్చుకోవాల్సిన విషయం'అని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. ఆమె గురువారం కర్ణాటకలోని కనకగిరిలో ప్రచారసభలో మాట్లాడారు. యుద్ధంలోనైనా, ఎన్నికల్లోనైనా లక్ష్యం తప్పితే ఓడిపోతామన్నారు. లక్ష్యం తప్పితే మళ్లీ అవినీతి ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. అప్పటి ఇందిరాగాంధీ పాలనను ప్రజలు ఇప్పటికీ తలుచుకుంటున్నారంటే కారణం.. ఆమె దేశాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు, పేదల కన్నీరు తుడిచినందుకేనన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక లక్షన్నర కోట్ల రూపాయలను లూటీ జరిగిందని, ఆ డబ్బుతో 30 లక్షల పేదల కుటుంబాలకు ఇళ్లు కట్టించవచ్చునని, 100 ఆస్పత్రులను నిర్మించవచ్చునని ఆమె పేర్కొన్నారు. ఇంత భారీగా దోపిడీ చేసిన ప్రభుత్వానికి ఓటు వేస్తారా? అని ప్రశ్నించారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 5 । మే । 2023

20 జిల్లాలకు వర్ష సూచన

7, 8 తేదీల్లో భారీ వర్షాలు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ప్రధానంగా 7, 8 తేదీలలో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నట్లు హెచ్చరించింది. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా బాణుడి ప్రతాపం ఓ వైపు ఉన్నా.. మరోవైపు అకాల వర్షాలు అప్పుడప్పుడూ పలకరిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో గత రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా మారింది. ఉపరితల ఆవర్తనం, గాలుల ప్రభావం వల్ల తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. అదే సమయంలో 7వ తేదీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ ప్రభావంతో శుక్రవారం పలు జిల్లాల్లో తేలికపాటి వర్షం, మరి కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక గురువారం కృష్ణగిరి, సేలం, కడలూరు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఘనంగా వైద్యవీరరాఘవుడి తీర్థవారి



తీర్థవారి నిర్వహిస్తున్న అర్చకులు

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన వైద్య వీరరాఘవుడి చైత్రమాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన గురువారం ఉదయం స్వామివారికి తీర్థవారి నిర్వహించారు. వివరాలు.. తిరువళ్లూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వైద్య వీరరాఘవుడి ఆలయం ఉంది. ఆలయంలో ఏటా చైత్రమాస బ్రహ్మోత్సవాలను 10 రోజుల పాటు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా గరుడసేవ, రథోత్సవం, సింహవాహనంతో పాటు రోజు వేర్వేరు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో తొమ్మిదవ రోజు ఉదయం స్వామి వారిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ పుష్కరిణిలో తీర్థవారి నిర్వహించారు. అనంతరం అక్కడే ప్రత్యేక పూజలు చేసి తిరిగి ఆలయానికి స్వామి వారు తిరుగు ప్రయాణమయ్యారు. కాగా స్వామి వారికి తీర్థవారి నిర్వహించిన తరువాత వందలాది మంది భక్తులు పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

ఆటోను ఢీ కొన్న బస్సు

- ఆరుగురి మృతి
- మహాబలిపురంలో ఘోరం

సాక్షి, చెన్నై: మహాబలిపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఆటోను ప్రభుత్వ బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వివరాలు.. ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని మహాబలిపురానికి సమీపంలోని మనమై గ్రామం వద్ద పుదుచ్చేరి వైపుగా వెళ్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఓ ఆటోను ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న వారు తీవ్ర గాయాలతో మరణించారు. ఈ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. విచారణలో మృతులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కారపాక్కంకు చెందిన ఆటో డ్రైవర్ గోవిందన్ సహా నలుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. ఇందులో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు ఉన్నారు. మృతి చెందిన వారిలో గోవిందన్, ఆయన తల్లి, భార్య, కుమార్తె, ఇద్దరు మనవరాళ్లుగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

95 పంచాయతీల అభివృద్ధికి హెచ్‌సీఎల్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొరుక్కుపేట: సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వంతో గ్లోబల్ టెక్నాలజీ సంస్థ హెచ్‌సీఎల్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 95 గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేలా సంతకాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమ క్రీడా శాఖామంత్రి ఉదయనిధి స్టాలిన్ సమక్షంలో హెచ్‌సీఎల్ సముదాయ్, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అలోక్ వర్మ, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పి. అముధ సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను అందుకున్నారు. ఇందులో హెచ్‌సీఎల్ టెక్ బోర్డు మెంబర్ శిఖర్ మల్హోత్రా కూడా పాల్గొన్నారు. సమగ్ర గ్రామీణాభివృద్ధి ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక ప్రాజెక్టులను తూత్తుకుడి జిల్లాలోని విలాతికులం, పదూరు ప్రాంతాల్లో చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 68,953 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 30,579 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల సమయం పడుతోంది.





బంగారు పల్లకిలో ఊరేగుతున్న కళ్లలగర్

మదురైలో కళ్లలగర్ వైభవం

మదురై మాడ వీధుల్లో గురువారం బంగారు పల్లకిలో విహరిస్తూ కళ్లలగర్ స్వామి భక్తులను కటాక్షించారు. భక్తులు ఎదుర్ సేవతో స్వామివారికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఇక శుక్రవారం ఉదయం స్వామి వారు వైగై నదీ ప్రవేశం చేయనున్నారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షల్లో భక్తులు మదురైకు రాత్రికి రాత్రే చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

- ఎదుర్ సేవతో స్వామికి భక్తుల ఆహ్వానం
- నేడు వైగై నదీ ప్రవేశం
- మీనాక్షి అమ్మన్ సన్నిధిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

సాక్షి, చెన్నై: మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కోలాహలంగా 12 రోజులు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు అనుబంధంగా మదురై అళగర్ మలైలోని కళ్లలర్ స్వామి (పెరుమాళ్) ఆలయంలో ఉత్సవాలు మే ఒకటో తేదీ మొదలయ్యాయి. మీనాక్షి అమ్మవారి కల్యాణోత్సవానికి, కళ్లలర్ స్వామి వైగై నదీ ప్రవేశానికి మధ్య అన్నా చెల్లెల అనుబంధాన్ని చాటే విధంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు భక్తులు పేర్కొంటూ వస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి తేనూరు కరుప్పన్న స్వామి అనుమతి పొందిన అనంతరం అక్కడి నుంచి కళ్లలగర్ స్వామి వారు బంగారు పల్లకిలో మదురైకు బయలుదేరారు. మార్గం మధ్యలోని ఆలయాల్లో స్వామి వారిని ఆహ్వానిస్తూ కార్యక్రమాలు జరిగాయి.

మదురైలో ఎదుర్ సేవ..


రాత్రంతా స్వామి వారు బంగారు పల్లకిలో ప్రయాణించి గురువారం వేకువ జామున 1.30 గంటలకు మదురైలోకి ప్రవేశించారు. 2.30 గంటల సమయంలో వేలాదిగా వేచి ఉన్న భక్తులకు స్వామి వారు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆరున్నర గంటలకు మావడి అనే ప్రాంతంలో కళ్లలగర్ స్వామికి భక్తులు ఎదుర్ సేవతో బ్రహ్మాండంగా ఆహ్వానం పలికారు. పట్టు వస్త్రాలను ధరించిన భక్తులు స్వామి వారికి ఎదురుగా వెళ్లి ఆహ్వానం పలికే విధంగా ప్రత్యేక సేవ నిర్వహించారు. ఉదయం 9గంటలకే పుదుర్ మారియమ్మన్ ఆలయానికి చేరుకున్న స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున అభిషేకాలు నిర్వహించారు.

తిరుమంజనంతో..

సాయంత్రం ఆరు గంటల సమయంలో అంబలకార మండపం చేరుకున్న స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అక్కడి నుంచి తల్లా కులం ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న కళ్లలగర్‌కు ప్రత్యేక తిరుమంజన సేవ వంటి విశిష్ట పూజలు జరిగాయి. రాత్రంతా ఇక్కడ పూజలు అందుకున్న స్వామి వారు గురువారం ఉదయం బంగారు అశ్వవాహనంపై వైగైనదీ ప్రవేశానికి వెళ్లనున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాన్ని తిలకించేందుకు రాత్రికి రాత్రే లక్షలాదిగా భక్తులు మదురైకు చేరుకున్నారు. దీంతో మదురై నగరాన్ని నిఘా వలయంలోకి తీసుకొచ్చిన పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు డొల్ల

- ద్రవిడ మోడల్‌కు కాలం చెల్లింది
- వర్సిటీల నిబంధనలకు విరుద్ధంగా ముసాయిదాలు
- గవర్నర్ వ్యాఖ్యలతో రాష్ట్రంలో మళ్లీ రాజకీయ చర్చ
- ఓ ఇంటర్వ్యూలో ప్రజల భద్రతపై ఆర్‌ఎన్ రవి అసహనం



గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి, చెన్నై : ఏదీ శాంతి వనం..? ఎక్కడ భద్రత అంటూ గవర్నర్ చేసిన వ్యాఖ్యలు అధికార డీఎంకేలో ఆగ్రహాన్ని రేపింది. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గవర్నర్ మళ్లీ ప్రభుత్వంతో ఢీ కొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. ఆది నుంచి డీఎంకే ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా గవర్నర్ ఆర్‌ఎస్ రవి వ్యవహిస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో రెండు సార్లు డీఎంకే పాలకులు తీర్మానం చేశారు. అసెంబ్లీ ఆమోదించిన అనేక తీర్మానాలను గవర్నర్ మళ్లీ పక్కన పెట్టే పనిలో పడ్డారు. ఇందులో సిద్ధ వైద్య వర్సిటీ ఏర్పాటు తదితర అంశాలు ఉన్నాయి. డీఎంకే పాలకులపై పరోక్షంగా తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో చర్చల్లో ఉంటూ వస్తున్న గవర్నర్ ఈ సారి ఆంగ్ల మీడియా వేదికగా విమర్శలు ఎక్కువ పెట్టడం డీఎంకే పాలకులకు పుండు మీద కారం చల్లినట్టయ్యింది.

వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా..

ఓ ఆంగ్ల మీడియాకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఇచ్చిన ఇంటర్వ్యూలోని అంశాలు గురువారం వెలుగులోకి వచ్చాయి. ఇందులో ఆయన రాజ్ భవన్‌కు నిధుల కేటాయింపులు, ముసాయిదాల ఆమోదంలో జాప్యం, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘన, శాంతి భద్రతల వ్యవహారం, ద్రవిడ మోడల్ పాలనపై విమర్శలు గుప్పించే విధంగా వ్యాఖ్యలు చేశారు. విద్యా ముసాయిదాలపై గవర్నర్ స్పందిస్తూ, విద్య అన్నది జనరల్ కేటగిరీ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, వర్సిటీలకు సంబంధించి ప్రభుత్వం పంపించిన ముసాయిదాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ఆరోపించారు. విద్యకు ప్రత్యేక అధికారం ఉందని, ఇందులో రాజకీయం జోక్యం తగదని గవర్నర్ స్పష్టం చేశారు. వీసీల నియామకం బిల్లు నుంచి సిద్ధ వర్సిటీ ముసాయిదా వరకు నిబంధనలకు అనుగుణంగా లేని కారణంగానే వాటిని పెండింగ్‌లో పెట్టినట్లు పేర్కొనడం గమనార్హం.

నిధులపై రాద్ధాంతం తగదు

రాజ్ భవన్‌కు నిధుల కేటాయింపు, ఖర్చుల గురించి స్పందిస్తూ, రాజ్ భవన్ కేటాయించిన మొత్తం దుర్వినియోగమైనట్లు ప్రభుత్వం పేర్కొనడం శోచనీయమన్నారు. గవర్నర్‌కు కేటాయించిన నిధులు, ఖర్చులను ఎవ్వరూ కట్టడి చేయలేరని, ఇది గవర్నర్ వ్యక్తిగత నిర్ణయాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఇక అక్షయ పాత్ర నిర్వహణ అంశం గతంలో పూర్తిగా గవర్నర్ పరిధిలో ఉందని, తద్వారా అక్షయ పాత్ర పేద విద్యార్థుల కడుపు నింపిందని ఆర్‌ఎన్ రవి వివరించారు.

కాలం చెల్లింది..

ద్రవిడ మోడల్ పాలన గురించి స్పందిస్తూ, ఇది కాలం చెల్లిన సిద్ధాంతమని గవర్నర్ వ్యాఖ్యానించారు. శాంతి భద్రతల గురించి స్పందిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత వివాదానికి ఆజ్యం పోశాయి. అసెంబ్లీ వేదికగా రాష్ట్రం శాంతివనంగా ఉండటం వంటి అంశాలను తాను ప్రస్తావించక పోవడాన్ని గుర్తు చేస్తూ గవర్నర్ కొన్ని వ్యాఖ్యల తూటాలు పేల్చారు. రాష్ట్రంలో ఏదీ శాంతి, ఎక్కడ భద్రతా.. అంటూ గవర్నర్ ఎదురు ప్రశ్నలు వేయడం గమనార్హం. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాపై నిషేధం అనంతరం అనేక చోట్ల జరిగిన పెట్రో బాంబు దాడులు, కోవై పేలుడు ఘటన, కళ్లకురిచ్చి అలర్లు, తిరుచ్చి డీఎంలో వార్, మహిళా పోలీసులకు బెదిరింపులు, ఇసుక మాఫియా చేతిలో వీఏఓ హత్య వంటి అంశాలను ప్రస్తావిస్తూ గవర్నర్‌పై ప్రశ్నలను సంధించడం గమనార్హం. ఈ పరిణామాలను డీఎంకే నేతలు తీవ్రంగానే పరిగణించారు. ఎదురు దాడికి సిద్ధమయ్యే విధంగా వ్యూహాలు రచిస్తున్నారు. ఇదే విషయంగా స్పీకర్ అప్పావును ప్రశ్నించగా, అసెంబ్లీ వ్యవహారాలను బహిరంగంగా చర్చించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని సీఎం స్టాలిన్ నిశితంగా పరిశీలిస్తున్నారని సరైన సమయంలో స్పందిస్తారన్నారు. అదే సమయంలో గవర్నర్ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని డీఎంకే వర్గాలు పోరుబాటకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది.

ద్రవిడ మోడల్ దేశానికే ఆదర్శం

- కేడర్‌కు స్టాలిన్ లేఖ

సాక్షి, చెన్నై: దేశంలోని ఇతర రాష్ట్రాలకు ద్రవిడ మోడల్ ఆదర్శంగా నిలుస్తోందని సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అభిప్రాయపడ్డారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 7వ తేదీతో రెండేళ్లు పూర్తి కానుంది. ఈ కాలంలో ప్రభుత్వం పథకాలు, ప్రాజెక్టులు, ప్రగతి, ద్రవిడ మోడల్ పాలనను ప్రజలకు వివరించే విధంగా సభలు నిర్వహించాలని డీఎంకే నిర్ణయించింది. ఈనెల 7, 8, 9 తేదీలలో డీఎంకే నేతృత్వంలో ఓ వైపు, ఆ పార్టీ యువజన విభాగం నేతృత్వంలో మరోవైపు రెండేళ్ల ప్రగతిని ప్రజలకు తెలియజేయనున్నారు. కాగా ఈ సభలు విజయవంతం చేయాలని కేడర్‌కు స్టాలిన్ గురువారం లేఖ రాశారు.

సాధనతో చరిత్ర సృష్టిద్దాం

డీఎంకే ఆవిర్భవించి 75 ఏళ్లు అవుతోందని, ఈ కాలంలో జరిగిన సభలు, మహానాడులు వంటి కార్యక్రమాలను గుర్తు చేస్తూ కేడర్‌కు లేఖ ద్వారా స్టాలిన్ సమగ్ర సమాచారాలు తెలియజేశారు. ప్రజలకు రెండేళ్ల ప్రగతి పాలనను సమగ్ర వివరాలు, గణాంకాలు, తదితర అన్ని అంశాలను క్షుణ్ణంగా సభల రూపంలో తెలియజేయాలని కోరారు. ఈ సభల ద్వారా సరి కొత్త చరిత్రను సృష్టిద్దామని పిలుపు నిచ్చారు. ఈ రెండేళ్ల ద్రవిడ మోడల్ పాలన అన్నది ప్రస్తుతం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఓ ఫార్ములాగా మారిందన్నారు. ఉచిత పథకాలను విమర్శించిన వాళ్లు ప్రస్తుతం కర్ణాటక ఎన్నికల్లో వాటినే అస్త్రంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారి రెండు నాల్కల ధోరణిని ప్రజలకు తెలియజేసే విధంగా ప్రసంగాలు చేయాలని సూచించారు. ప్రజల మద్దతుతో రానున్న ప్రతి ఎన్నికలోనూ తిరుగులేని విజయాన్ని సాధించే శక్తిగా డీఎంకేను ఉన్నత స్థానానికి తీసుకెళ్దామని పిలుపు నిచ్చారు.

అధికారులతో సమీక్ష

రాష్ట్రంలోని ఉన్నతాధికారులతో సీఎం స్టాలిన్ గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలలో 12 గంటల పని వేళల వ్యవహారం వివాదానికి దారితీసిన అంశంపై సమీక్షించారు. ఇందుకు సంబంధించి తీసుకువచ్చిన చట్టాన్ని నిలుపుదల చేస్తూ చేసిన ప్రకటనను అమలులోకి తెచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

అల్పాహార పథకం విస్తరణపై చర్చ



ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో గురువారం సచివాలయంలో సీఎం అల్పాహార పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు విస్తరించే విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో మంత్రి ఉదయనిధి స్టాలిన్, ప్రధాన కార్యదర్శి ఇరైయన్బు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

– సాక్షి, చెన్నై

పన్నీరుకు మరో షాక్!

అన్నాడీఎంకే నేత పన్నీరు సెల్వంకు మరో షాక్ తగిలింది. ఆధిపత్య పోరులో తనకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని భావించిన ఆయనకు నిరాశే మిగిలింది. ఓపీఎస్‌కు హ్యాండిచ్చే విధంగా ప్రస్తుతం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలలో తాము జోక్యం చేసుకోబోమని, ఇది వారి వ్యక్తిగతం అని అమిత్ షా స్పష్టం చేయడం పన్నీరు శిబిరాన్ని కలవరంలో పడేసింది.

- హ్యాండిచ్చిన అమిత్ షా
- కలవరంలో ఓపీఎస్ మద్దతుదారులు
- పళణి శిబిరంలో జోష్



పన్నీరు సెల్వం, అమిత్ షా, పళణి స్వామి (ఫైల్)

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేలో పన్నీరు సెల్వం, పళణి స్వామి మధ్య జరుగుతున్న వార్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, న్యాయ పోరాటం, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో అన్నాడీఎంకేను పళణి స్వామి పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పగ్గాలు చేపట్టి ఢిల్లీ వెళ్లిన ఆయన అక్కడి పెద్దల ఆశీస్సులు అందుకున్నారు. అదే సమయంలో కేంద్రం తనకు అనుకూలంగా ఉంటుందని, వారి ద్వారా పళని స్వామికి చెక్ పెట్టవచ్చనున్న ధీమాతో ఆ పార్టీ సమన్వయ కమిటీ పన్నీరు సెల్వం ఉంటూ వస్తున్నారు.

చర్చకు ముగింపు..

ఢిల్లీ పర్యటన సందర్భంగా పళని స్వామికి అమిత్ షా హిత బోధ చేసినట్టు పన్నీరు సెల్వంతో పాటుగా మిగిలిన వారిని కలుపుకుని వెళ్లాలని క్లాస్ తీసుకున్నట్లుగా కొన్ని మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. దీనిపై పెద్దఎత్తు చర్చలు సాగడంతో పన్నీరు శిబిరంలో ఆనందడోలికల్లో తేలింది. కేంద్రం ద్వారా మళ్లీ అన్నాడీఎంకేను కైవసం చేసుకోవచ్చనే ధీమాతో తన బలాన్ని చాటే ప్రయత్నాలను పన్నీరు వేగవంతం చేశారు. అలాగే కేంద్రం ద్వారా పళణి స్వామితో రాయబారాలు జరపడం లేదా, కోర్టు తుది తీర్పు వ్యవహారంలో కేంద్రాన్ని ఆశ్రయించడం వంటి ఎత్తుగడలతో పన్నీరు ముందుకెళ్లారు. అయితే ఇవన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. పన్నీరు శిబిరానికి పెద్ద షాక్ ఇచ్చే విధంగా , తాజాగా జరుగుతున్న చర్చకు ముగింపు పలికే రీతిలో బెంగళూరులో అమిత్ షా ఓ మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు.

జోక్యం చేసుకోం..

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అది వారి అంతర్గత వ్యవహారం, ఇందులో ఒకరిపై ఒత్తిడి తీసుకురావాల్సినంత అవసరం తమకు లేదన్నారు. వారి మధ్య సమస్యలు, వివాదాలను వాళ్లే పరిష్కరించుకోవాలే గానీ మధ్యవర్తులు ఉండ కూడదని వ్యాఖ్యానించారు. ఓ పార్టీ వ్యవహారంలో జోక్యం చేసుకుని రాజకీయాలు చేయాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. పన్నీరు సెల్వం వ్యవహారంలో అన్నాడీఎంకేనే నిర్ణయం తీసుకోవాలి. తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ ఆయన చర్చకు ముగింపు పలికారు. ఈ వ్యాఖ్యలు పన్నీరు సెల్వం శిబిరాన్ని షాక్‌కు గురి చేసింది. అదే సమయంలో పళని స్వామి శిబిరంలో జోష్‌ను నింపింది.

వందే భారత్‌లో పళణి

అమిత్ షా వ్యాఖ్యలు ఉదయాన్నే పళణి శిబిరంలో జోష్‌ను నింపాయి. ఇదే ఊపులో పళణి స్వామి ఆనందంగా వందే భారత్ రైలులో ప్రయాణించారు. సేలం నుంచి ఆయన వందే భారత్ రైలులో పర్యటించారు. ఈ సమయంలో ఆయనతో అనేక మంది ప్రయాణికులు సెల్ఫీలు దిగడం విశేషం.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

అన్నానగర్: కడయనల్లూరులో ఏటీఎం కార్డును దొంగిలించి దాని ద్వారా రూ.40 వేలు దోపిడీ చేసిన కోయంబత్తూరుకు చెందిన మహిళను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా కడయనల్లూరు సమీపంలోని కాశీధర్మం గ్రామానికి చెందిన మురుగేశ్వరి (33). ఇటీవల ప్రభుత్వ బస్సులో కడయనల్లూరు వెళ్లింది. అక్కడ సరుకులు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి బయలుదేరింది. బస్సు ఎక్కి ఇంటికి వచ్చి బ్యాగ్ తెరిచి చూడగా పర్సు కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పర్సును అపహరించినట్లు వెల్లడైంది. ఆ పర్సులో ఏటీఎం కార్డు, దాని సీక్రెట్ కోడ్ నంబర్ ఉంది. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తి వెంటనే రూ.40వేలు డ్రా చేసి పరారయ్యారు. దీంతో బాధితురాలు మురుగేశ్వరి కడయనల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో పర్సు చోరీ చేసింది కోయంబత్తూరుకు చెందిన పళనియమ్మాళ్ (55) అని తేలింది. దీంతో ఆమెను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రసాయనాలతో పండించిన 5 టన్నుల మామిడి పండ్లు సీజ్

అన్నానగర్: తిరుచ్చిలో గురువారం రసాయనాలతో పండించిన 5 టన్నుల మామిడి పండ్లను అధికారులు తొలగించారు. తిరుచ్చి శ్రీరంగం అమ్మ మండపం ప్రాంతంలో మామిడి పండ్లను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న సుమారు 5 మామిడి గోడౌన్లలో ఆహార భద్రతా విభాగం బృందం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రసాయనాలతో (ఇథిలిన్ స్ప్రే) పండిన 5 టన్నుల మామిడి పండ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2 లీగల్ శాంపిల్స్ తీసి చెన్నైలోని గిండీ లాబొరేటరీకి పంపారు. రసాయనిక పద్ధతిలో పండిన మామిడి పండ్లను అరియమంగళంలోని డంప్‌లో పడేసి ధ్వంసం చేశారు.

వేడుకగా స్వర్ణ రథం ఊరేగింపు

తిరువొత్తియూరు: సమత్తువ మక్కల్ కళగం నిర్వాహక అధ్యక్షుడు రాష్ట్ర కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎర్నావూర్ నారాయణన్ జన్మదినం సందర్భంగా తిరువ ట్రియూర్ వడివుడై అమ్మన్ ఆలయంలో స్వర్ణ రథం ఊరేగింపు చేయడం నిర్వహించారు. ఇందులో అర్చకులు వడి వుడై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కార్తిక్ నారాయణ, సాంకేతిక సమాచార విభాగం కార్యదర్శి విశ్వనాథన్, విభజన బృందం ఉప కార్యదర్శి సోనైయాదవ్ పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకు 4,500 ప్రత్యేక బస్సులు

కొరుక్కుపేట: చిత్రపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి తిరువణ్ణామలైకు 4,500 ప్రత్యేక బస్సులను బుధ, గురువారాల్లో నడుపుతున్నట్లు రవాణా శాఖాధికారులు తెలియజేశారు. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర ఆలయానికి ప్రతీ నెలా పౌర్ణమి రోజున వేలాదిమంది భక్తులు తరలివస్తారు. అయితే చిత్ర పౌర్ణమి విశిష్టత కావడంతో లక్షలాదిమంది భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. ప్రజలు, భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుతున్నారు. వెల్లూరు, విల్లుపురం, తిరువణ్ణామలైకి మూడు రోజులు అదనంగా ప్రత్యేక రైళ్లను కూడా ఏర్పాటు చేశారు. దీనికి సంబందించి రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ చెన్నైలోని విల్లుపురం రవాణా కార్పొరేషన్ తరపున అదనంగా 1000 బస్సులు, కుంభకోణం, సేలం, కోయంబత్తూరు, మదురై ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్ల నుంచి సాధారణ బస్సులు 1,500 బస్సులతో పాటు తిరువణ్ణామలైకి 4,500 ప్రత్యేక బస్సులు నడుపుడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు చెన్నైకొయంబేడు, తాంబరం, విల్లుపురం, కాంచీపురం, తిరుపత్తూరు, సేలం, కళ్లకురిచ్చి, ఈరోడ్ కోయంబేడు, మదురై తంజావూరు, ధర్మపురి, హోసూరు, తిరుచ్చి, పుదుచ్చేరి, కడలూరు, మదురై నుంచి బస్సులు నడపుతున్నట్లు వెల్లడించారు. చెన్నై నుంచి తిరువణ్ణామలైకి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనాతో బుధవారం కోయంబేడు, తాంబరం బస్ స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.


ప్రయాణికులతో కిక్కిరిసిన కోయంబేడు బస్టాండ్

3 ఆటోలు, 2 బైకులకు నిప్పు

అన్నానగర్: నాగపట్టణంలో బుధవారం రాత్రి 3 ఆటోలు, 2 బైకులను తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. నాగై పుదుతేరు ప్రాంతానికి చెందిన మహ్మద్ సర్బుద్దీన్. అదే ప్రాంతంలో కార్లు, ఆటోలు అద్దెకు తీసుకుని వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం రాత్రి యథావిధిగా తన దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి అక్కడ నిలిపి ఉంచిన వాహనాల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది చూసిన ఇరుగుపొరుగువారు నాగై ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నీటిని చిమ్మి మంటలను ఆర్పివేశారు. అయితే మంటల్లో 3 ఆటోలు, 2 ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. వీటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ విషయమై మహ్మద్ సర్బుద్దీన్ నాగై పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో, నాగై టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొందరు వ్యక్తులు శత్రుత్వంతో వాహనాలకు నిప్పుపెట్టారని ఫిర్యాదు చేశారు. దీంతో వాహనాలకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.


దగ్ధమైన ఆటోలు

అంబులెన్స్‌లో ప్రసవం


నవజాత శిశువును చూపుతున్న 108 సిబ్బంది

అన్నానగర్: కడలూరు ముత్తునగర్ సమీపంలో గురువారం వేకువజామున అంబులెన్స్‌లో ఓ మహిళ ప్రసవించింది. వివరాలు.. కడలూరు ముత్తునగర్ సమీపంలోని సేదపాళ్యం గ్రామానికి చెందిన ప్రశాంత్ భార్య శరణ్య (22). గురువారం తెల్లవారుజామున ప్రసవ నొప్పి రావడంతో బంధువులు ఆమెను 108 అంబులెన్స్‌లో తొండమానత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. దారిలో శరణ్యకు ప్రసవం నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో డ్రైవర్ చరణ్ రాజ్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపాడు. ఎమర్జెన్సీ టెక్నీషియన్ (నర్సు) దశరథ డెలివరీ చేశారు. శరణ్య అందమైన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డనితొండమానత్తం పీహెచ్‌సీలో చేర్పించారు.

చోళా ఎంఎస్‌లో 27.6 శాతం వృద్ధి

సాక్షి, చెన్నై: చోళ ఎంఎస్ – 2023 ఆర్థిక సంవత్సరంలో ఆశాజనకమైన ఫలితాలను నమోదు చేసినట్లు చోళ ఎంఎస్ మేనేజింగ్ డైరెక్టర్ వి.సూర్యనారాయణన్ తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో 2022 – 23 ఆర్థిక సంవత్సరం ఫలితాలను ఆయన ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ చోళ మండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (చోళ ఎంఎస్), మురుగప్ప గ్రూప్, జపాన్‌కు చెందిన మిట్సుయ్ సుమిటోమో ఇన్స్యూరెన్స్ గ్రూప్‌లు జాయింట్ వెంచర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ. 6,200 కోట్లుతో 27.6 శాతం వృద్ధి నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మార్చి 31, 2023తో ముగిసిన త్రైమాసికంలో చోళ ఎంఎస్ నికర విలువ రూ. 2,160 కోట్లుగా ఉందని వివరించారు. కస్టమర్లకు మెరుగైన సేవలను అందిచాలనే ఉద్దేశంతో రానున్న కాలంలో కంపెనీ తన డిజిటల్ ఆఫర్లను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఇందులో సీఎఫ్ఓ ఎస్.వేణుగోపాలన్, నోకీ తకేడా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణన్ తదితరులు

8 వరకు మెడ్ స్టార్ సమ్మిట్

సాక్షి, చెన్నై: చెన్నైలో మెడ్ స్టార్ సమ్మిట్–2023 ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సవిత వైద్య కళాశాల, ఐసీఎంఆర్‌ల నేతృత్వంలో ఈ కార్యక్రమం గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్నారు. ఇందులో ఐసీఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ పద్మ ప్రియదర్శిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠ్యాంశాలు, పరిశోధనలు, అసాధారణ ఏకీకరణ తదితర అంశాల గురించి చర్చించారు. 540 మంది పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు. ఇందులో ప్రత్యేకంగా 1000 అడుగులతో రూపొందించిన పోస్టర్ ప్రెజెంటేషన్, విద్యార్థుల పరిశోధన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

10 కిలోల గంజాయి స్వాధీనం

• యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నైలో గూగుల్ పే ద్వారా నగదు తీసుకుంటూ గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై ముగప్పేరు కూవం నది ఒడ్డున గంజాయి ప్యాకెట్లను భారీగా విక్రయిస్తున్నట్లు అన్నానగర్ ఎక్సైజ్ శాఖ విభాగానికి సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ మనోహరన్ నేతృత్వంలో పోలీసులు మఫ్టీలో నిఘా వేశారు. ఆ సమయంలో అక్కడ ఓ యువకుడు పోలీసులను చూసి తన చేతిలోని సంచిని కిందపడేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతను చుట్టుముట్టి పట్టుకున్నారు. విచారణలో ఆవడి సమీపంలోని నూర్ చోళవన్ నగర్ ప్రాంతానికి చెందిన నవ నీత కృష్ణన్ అలియాస్ కన్నయ్య (26) ఆంధ్ర నుంచి గంజాను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అతని వద్ద నుంచి 10 కిలోల గంజాయి, ఓ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితుడిని చెన్నై ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

ప్రాణం తీసిన అనుమానం

• భార్యను పొడిచి చంపిన భర్త

అన్నానగర్: కళ్లకురిచ్చి సమీపంలోని మొవన్నం జూర్ గ్రామానికి చెందిన విజయా (20)కి పల్లక్కచేరి గ్రామానికి చెందిన మురుగన్ (25)తో మూడేళ్ల క్రితం వివాహమైంది. తర్వాత కేవలం 3 నెలలు మాత్రమే వీరిద్దరూ భార్యాభర్తలుగా జీవించారు. ఆ తర్వాత మనస్పర్థలు రావడంతో విజయా తన తల్లి ఇంట్లోనే ఉంటోంది. అయితే మురుగన్ తన ఇంటికి రావాలంటూ విజయాను చాలాసార్లు పిలిచాడు. అయితే అందుకు ఆమె నిరాకరించింది. ఇదే సమయంలో కడలూరు జిల్లా సిరుపాక్కం గ్రామానికి చెందిన మురుగన్ బంధువు మాయవన్‌తో విజయాకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ నిత్యం కలుస్తుండడంతో కోపొద్రిక్తుడైన మురుగన్ బుధవారం సాయంత్రం విజయ కల్లకురిచ్చి బస్ స్టేషన్ నుంచి ప్రైవేట్ మినీ బస్సులో ప్రయాణిస్తున్న భార్య విజయాను వెంబడించాడు. బస్సు దిగి విజయ వెళ్తుండగా జోరు వానలో ఒక్కసారిగా ఆమెపై కత్తితో దాడి చేశాడు. రక్తపుమడుగులో విజయ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు మురుగన్‌పై దాడి చేయడంతో కళ్లకురిచ్చి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

తలసేమియాపై అవగాహన పెంచుకోవాలి


మ్యాజిక్ షోలో తలసేమియా చిన్నారులు

కొరుక్కుపేట: పిల్లల జీవితాలను ప్రభావితం చేసే వివిధ వ్యాధుల్లో తలసేమియా అత్యంత ప్రమాదకరమైందని, దీనిపై ప్రజల్లో ముఖ్యంగా తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాలని కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ ఆసుపత్రి హెమటాలజీ కన్సల్‌టెంట్ డాక్టర్ దీనదయాలన్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని (మే 8) పురస్కరించుకుని మిలాప్ ఆర్గనైజేషన్, కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియాపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో డాక్టర్ దీనదయాలన్‌తో పాటు డాక్టర్ మీనా శివశంకరన్ పాల్గొని తలసేమియాపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ద్వారా జన్యుపరంగా పిల్లలకు సంక్రమించే తలసేమియా చాలా ప్రమాదకరమైందన్నారు. ప్రతి నలుగురిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. తలసేమియాతో బాధపడే చిన్నారులకు ప్రతి 3 నుంచి 4 వారాలకు రక్తమార్పిడి అవసరం అవుతుందన్నారు. క్లౌడ్ ఫండింగ్ ద్వారా మిలాప్ ఆర్గనైజేషన్ తలసేమియా పిల్లలకు అండగా నిలవడం హర్షణీయమని కొనియాడారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఇందులో వైద్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చిన్నారుల్లో ఆనందాన్ని నింపేలా తోలుబొమ్మలాట, మ్యాజిక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మిలాప్ సహవ్యవస్థాపకులు అనోజ్ విశ్వనాథన్, వైద్యులు పాల్గొన్నారు.

నేడు తెరపైకి కులసామి

తమిళసినిమా: నటుడు విమల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కులసామి. నటి తాన్యా హోప్ నాయకిగా నటించిన ఈ చిత్రానికి కుట్టిపులి సర్వాణి శక్తి దర్శకత్వంలో మిక్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం శుక్రవారం తెరపైకి రానుంది. దీనిని సంజిత్ స్టూడియోస్ సంస్థ విడుదల చేస్తోంది. ఇది కళాశాలలో జరిగే అక్రమాలను ఆవిష్కరించే కథా చిత్రంగా రూపొందింది. నటుడు విమల్ ఆటో డ్రైవర్‌గా నటించారు. ఆయన చెల్లెలు వైద్య విద్యార్థిని. ఆమె అత్యాచారానికి గురై హత్యకు గురవుతుంది. దీనికి అతను ఎలా రియాక్ట్ అయ్యాడు? అన్నదే కులసామి చిత్ర కథ. నటి తాన్యాహోప్ మెడికల్ స్టూడెంట్‌గా నటించింది. ఆమె విమల్ మంచితనం చూసి అతన్ని ప్రేమిస్తుంది. తాన్యాహోప్ చదువుతున్న మెడికల్ కళాశాలలో ప్రిన్సిపల్ కావాలనే విద్యార్థులకు పరీక్షల్లో తక్కువ మార్కులు వేయించి వారిని ఒక విషయానికి నిర్బంధానికి గురి చేస్తుంది. ఇది ఏమిటన్నదే చిత్రంలో ప్రధానాంశం. నటుడు విమల్ మాస్ పాత్రలో నటించారు. మెడికల్ కళాశాలలో జరిగే అక్రమాలను తాను ఎలా అరికట్టాడు? ఆ తరువాత అతని జీవితం ఎలాంటి పరిణామాలకు గురైంది వంటి పలు ఆసక్తికరమైన అంశాలతో రూపొందిన యాక్షన్ రివెంజ్ డ్రామా కథా చిత్రం కులసామి. దీనికి మహాలింగం సంగీతాన్ని, రవిచంద్రన్ ఛాయాగ్రహణంను అందించారు.


కులసామి చిత్రంలో ఓ సన్నివేశం

డియర్ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

తమిళసినిమా: సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న తొలి చిత్రం డియర్. నటుడు ఖాళీ వెంకట్ యూనివర్సిటీ బ్లాక్ షీట్ నందిని తదితరులు ముఖ్యపాత్రులు పోషించిన ఈ చిత్రాన్ని ప్రొడక్షన్స్ నట్ మెక్ పతాకంపై త్రిపురనేని, అభిషేక్ రామ్ శెట్టి, పర్వీరాజ్ కలిసి నిర్మిస్తున్నారు. ఇంతకుముందు సేతువుమ్ ఆయిరం పెన్ చిత్రాన్ని తెరకెక్కించిన ఆనంద్ రవి చంద్రన్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ఇది. జీవిత ప్రకాష్ కుమార్ సంగీతాన్ని, జగదీష్ చక్రవర్తి ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. కాగా చిత్ర ఫస్ట్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో నిర్మాతలు పేర్కొంటూ ఇది కమర్షియల్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. జీవీ ప్రకాష్ కుమార్ కెరీర్ ఇది మరో వైవిధ్యమైన కథాచిత్రంగా ఉంటుందన్నారు. నటి ఐశ్వర్య రాజేష్ పాత్రకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందనే సంతోషాన్ని వ్యక్తం చేశారు.డియర్ చిత్రాన్ని త్వరలోనే తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.


డియర్ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

కోలీవుడ్ టాక్స్

నాలుగు పదుల పరువాల సుందరి


త్రిష

తమిళసినిమా: నటనకు వయసుతో పనేంటి? అందం, అభినయం ఉంటే చాలు.పెళ్లితో పనేంటి? నమ్ముకున్న వాళ్లు, నమ్మకమైన వాళ్లు మన చుట్టూ నలుగురు ఉంటే చాలు. ఇదే నటి త్రిష భావనగా తెలుస్తోంది. ఈ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ బ్యూటీ వయసు అక్షరాల నాలుగు పదులు. నటిగా 24 ఏళ్ల పయనం. తమిళం తెలుగు హిందీ కన్నడం భాషల్లో నటనాభినం. ఇప్పటికీ తిరుగులేని నాయకుడిగానే రాణిస్తున్న వైనం. గురువారం త్రిష తన 40వ పుట్టినరోజు వేడుకను జరుపుకుంటున్నారు. ఈ సుందరి సినీ ఫైనాన్స్ ఒకసారి పరిశీలిస్తే కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే తాను అందగత్తెను అనే విషయాన్ని గ్రహించి వాణిజ్య ప్రకటనల్లో నటించడం ప్రారంభించారు. అంతేకాకుండా అందాల పోటీల్లో పాల్గొని మిస్ చెన్నై కిరీటాన్నీ గెలుచుకున్నారు. అయితే వెంటనే సినిమాల్లో కథానాయకిగా నటించే అవకాశాలు వరించలేదు. ముందుగా జోడీ అనే చిత్రంలో నటి సిమ్రాన్‌కు స్నేహితురాలుగా చిన్న పాత్రలో నటించే అవకాశం వరించింది. అలా 1999లో త్రిష నటిగా సినిమా అనే కలర్ఫుల్ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత ప్రియదర్శన్ దష్టిలో పడి లేసా లేసా అనే చిత్రం ద్వారా కథానాయకగా రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు. మరో విషయం ఏంటంటే ఆరంభంలో త్రిషకు సినిమాల్లో నటించాలనే ఆసక్తే లేదట. ఆమధ్య ఓ భేటీటిలో త్రిష పేర్కొంటూ సినీ రంగంలోకి వచ్చే ఛాన్సే లేదని, అది తాను కోరుకున్న స్థానం కాదని పేర్కొన్నారు. అయితే కాల ప్రభావంతో తనకు ఇష్టం గాని సినిమా రంగంలోకే వచ్చాననే భావాన్ని వ్యక్తం చేశారు. నిజంగా ఆమె కోరుకున్నట్లే జరిగితే సినీ ప్రేక్షకులు ఒక సంచలన నీటిని కోల్పోయేవారు. ఇకపోతే తన విచిత్రమైన కోరికను త్రిష మరో భేటీలో వ్యక్తం చేశారు. పురుషుల గురించి మీ అభిప్రాయం ఏంటన్న ప్రశ్నకు ఆడవారిని అర్థం చేసుకోవడం కష్టమని అందరూ అంటుంటారు గాని నిజానికి మగవారిని అర్థమే చేసుకోలేమని బదిలించారు. వారు మనసులో వేరే విధంగా అనుకుంటూ బయటికి మరో విధంగా నటిస్తారని అన్నారు. తనకు మగ స్నేహితులు ఎక్కువ అనీ వారి మనసులను గాయపరచాలని ఇది చెప్పడం లేదని పేర్కొన్నారు. ఒకరోజు మగవాడిగా పుట్టాలన్నది తన గట్టి కోరిక అని ,ఇదే విషయాన్ని తన తల్లితో చెప్పాననీ అన్నారు. దీనికి కారణం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదని ఒక మగవారి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది అన్నది తెలుసుకోవాలనే కుతూహలమే దీనికి కారణమని త్రిష పేర్కొన్నారు.

కసరత్తుల మాళవిక


మాళవిక మోహన్

తమిళసినిమా: సిక్స్ ప్యాక్స్, 8 ప్యాక్‌ల హీరోలా తరహాలో తాము మారగలం అని నేటి హీరోయిన్లు చాటి చెపుతున్నారు. ముఖాల్లో గ్లో పోయినా పర్వాలేదు. సన్నపడటమే ధ్యేయం అన్నట్లు దూసుకుపోతున్నారు. ఆ మధ్య నత్తి కీర్తి సురేష్ ఇలానే కసరత్తులు చేసి బాగా బక్కజిక్కి పోయింది. అప్పట్లో పలు విమర్శలను ఎదుర్కొన్న ఆమె ఆ తర్వాత మళ్లీ కొత్త అందాలను సంతరించుకుందనుకోండీ. తాజాగా నటి మాళవిక మోహన్ కూడా జీరో సైజ్ కోసం తెగ కసరత్తులు చేసేస్తోంది. ఈమెది వాస్తవానికి జీరో సైజ్ బాడీనే. అయితే సిక్స్ ప్యాక్ కోసం మరింత కసరత్తులు చేస్తోంది. ఇందుకోసం రోజులో ఎక్కువ భాగం జిమ్ముల్లోనే గడిపేస్తుందట. ఈ బాలీవుడ్ బ్యూటీ రజనీకాంత్ కథానాయకుడు నటించిన పేట చిత్రం ద్వారా కోలీవుడ్‌కు దిగుమతి అయ్యింది. ఆ తర్వాత లోకేష్ కనకరాజు దర్శకత్వంలో విజయ్ కథానాయకుడుగా నటించిన మాస్టర్ చిత్రంలో ఆయనకు జంటగా నటించింది. అదేవిధంగా ధనుష్ సరసన మారన్ చిత్రంలోనూ నటించింది. ఇవేవీ ఈ అమ్మకి స్టార్‌డమ్‌ను తెచ్చి పెట్టలేదు కాగా చిన్న గ్యాప్ తర్వాత తాజాగా తంగలాన్ చిత్రంలో విక్రమ్‌తో జత కడుతోంది. పా రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విక్రమ్ గెటప్ ఇప్పటికే ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తోంది. ఆయన ఈ చిత్రం కోసం పూర్తిగా ఆదివాసి నాయకుడిగా మారిపోయారు. కాగా నటి మాళవిక మోహన్ కూడా ఈ చిత్రం కోసమే కసరత్తులు చేసి సిక్స్ ప్యాక్ కు మారినట్లు చెప్పుకొచ్చింది. అయితే ఆ ఫొటోలను, వీడియోను ఈమె సామాజిక మాధ్యమాలకు విడుదల చేసింది. అందులో ఎక్కువగా తన నడుమును చూపించే ఫొటోలే చోటు చేసుకోవటం గమనార్హం. దీంతో మాళవిక మోహన్‌పై నెటిజన్ల ట్రోలింగ్ మొదలైంది. అసలు ఏమైనా తింటున్నావా, కాస్త మంచినీళ్లయినా తాగమ్మా అంటూ సెటైర్లు వేస్తున్నారు.

తమిళసినిమా: తమిళ సినీ నిర్మాతల మండలి ఎన్నికలు ఇటీవల జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో గెలుపొందిన మురళి రామనారాయణన్ నేతృత్వంలోని నూతన కార్యవర్గం గురువారం ఉదయం ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను కలిసింది. ఈ సందర్భంగా తమిళ నిర్మాతల మండలి నూతన కార్యవర్గం ముఖ్యమంత్రి శుభాకాంక్షలు పొందినట్లు తెలిపారు. అనంతరం ఆయనకు ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి రామనారాయణన్ మీడియాతో మాట్లాడుతూ నూతన నిర్మాతల మండలి కార్యవర్గం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. అదే విధంగా 2009లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి సినీ పరిశ్రమకు చెందిన వారికి ఇళ్ల నిర్మాణం కోసం చెన్నై సమీపంలోని పైనూర్‌లో 100 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. అందులో చితికిపోయిన నిర్మాతలకు ఇళ్ల నిర్మాణం కోసం 10.5 ఎకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. అయితే తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ కొత్తగా అనుమతిని జారీ చేయాల్సిందిగా కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశామన్నారు. అందుకు ముఖ్యమంత్రి వెంటనే స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎం.కె.స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలియచేసినట్లు పేర్కొన్నారు. కాగా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి రామనారాయణన్‌తో పాటు కార్యదర్శులు కదిరేశన్, రాధాకృష్ణన్, ఉపాధ్యక్షుడు తమిళ కుమరన్, ఉపకార్యదర్శి సౌందర పాండియన్ ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ ప్రోత్సాహం భేష్ అని కొనియాడారు.

ముఖ్యమంత్రి ప్రోత్సాహం భేష్


సీఎం స్టాలిన్‌తో నిర్మాతల మండలి సభ్యులు

క్లుప్తంగా

ఏటీఎంలలో చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

కొరుక్కుపేట: తిరువణ్ణామలై జిల్లాలో ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి దుండగులు నాలుగు ఏటీఎంలను పగులగొట్టి రూ.79 లక్షలు చోరీ చేసిన కేసులో పోలీసులు బుధవారం రాత్రి మరో నిందితుడిని అరెస్టు చేశారు. గతంలో ఎనిమిది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. హరియానాలో ఉన్న మరో నిందితుడు ఆసీఫ్ (32)ని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని తిరువణ్ణామలై తీసుకువస్తున్నారు. మిగిలిన సొమ్ము ఎక్కడ ఉంది అన్న విషయాలు విచారణలో తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

తుపాకీ, తూటాలు స్వాధీనం

తిరువొత్తియూరు: మదురై వైగై నది ప్రాంతంలో చట్ట విరుద్ధంగా తుపాకీ, తూటాలతో తిరుగుతున్న చెన్నైకి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. తెప్పకులం ప్రాంతంలో ఉన్న వైగై నది ప్రాంతంలో బుధవారం సాయంత్రం పోలీసులు గస్తీ చేపట్టారు. ఆ సమయంలో వైగై నదీతీరం ఒడ్డున రోడ్డు సందేహాస్పదంగా నిలబడి ఉన్న ఇద్దరు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఒక తుపాకీ, 4 తూటాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి విచారణ చేశారు. ఒకరు చెన్నై అన్నానగర్‌కు చెందిన ధనశేఖర్ (52), మదురై గోమతిపురం నగర్‌కు చెందిన సుభాష్ (40)గా తేలింది. మదురైలో ఉన్న స్నేహితుడి ద్వారా తుపాకీ, తూటాలను తీసుకున్నట్లు గుర్తించారు. వారిని అరెస్టు చేశారు. వీరికి తుపాకీ తూటాలను ఎవరు సరఫరా చేశారు అన్నదానిపై విచారణ చేపట్టారు.

ఐసీఎఫ్ ఉద్యోగి మృతి

అన్నానగర్: చెన్నై వ్యాసార్పాడి సత్యమూర్తి నగర్‌కు చెందిన ఉమాశంకర్ (50) చెన్నై ఐసీఎఫ్ రైల్వేలో పని చేస్తున్నాడు. గత నెల 29వ తేదీన తనతో పని చేసిన వారికి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన తిరుమంగళం ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన ఆయనను స్థానికులు కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉమాశంకర్ గురువారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో తల్లిని చంపిన కొడుకు

అన్నానగర్: తల్లిని చంపిన కొడుకును పోలీసులు అరెస్టు చేశారు. శివగంగై జిల్లా తిరుప్పువనం సమీపంలోని మాదాపురం ఎంజీఆర్ నగర్‌కు చెందిన రైతు శివజ్ఞానంకు భార్య అరుళ్ జ్యోతి (45), ఇద్దరు కుమారులు ఉన్నారు. అరుళ్ జ్యోతి భర్తతో విడాకులు తీసుకుని కుమారులతో కలిసి ఉంటోంది. కుమారుడు విష్ణుప్రభు(19) ప్లస్ 2 పూర్తి చేసి ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లి ప్రవర్తనపై అనుమానం రావడంతో పలుమార్లు మందలించాడు. అయినా ఆమె వినకపోవడంతో బుధవారం రాత్రి కత్తితో తల్లి గొంతుకోసి హత్య చేశాడు. గురువారం ఉదయం పూవంతి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పూవంతి పోలీసులు అతన్ని అరెస్టు చేసి విచారిస్తున్నారు. అరుళ్ జ్యోతి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృగరాజుపై చెన్నకేశవుని అభయం



సింహ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారు సింహ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఉదయం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు బాలశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ గున్నేరి నీలకంఠారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ సభ్యురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరుని సేవలో సినీనటుడు సుమన్

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వ స్వామివారిని సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన సుమన్‌కు ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు ఆలయంలో కొలువుదీరిన స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగ అమ్మవారు, దాంపత్య దక్షిణామూర్తి, శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సుమన్‌కు చైర్మన్ ఆలయ మర్యాదలు చేయగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు.

రూ.1.50 కోట్లతో సముదాయ భవనం

- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా తిరువూర్‌లో రూ.1.50 కోట్లతో సముదాయ భవనాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే కృష్ణస్వామి భూమిపూజ చేశారు. తిరువూర్ గ్రామంలో సుమారు పది వేల మంది ప్రజలు నివాసం వుంటున్నారు. వీరి కోసం సముదాయ భవనాన్ని నిర్మించాలని స్థానికులు పదేళ్ల నుంచి కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణస్వామి నిధులతో భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో గురువారం ఉదయం పనులకు భూమి పూజ చేపట్టారు. పంచాయతీ అధ్యక్షుడు పళణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కృష్ణస్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సముదాయ భవన నిర్మాణం ఎస్సీలు, ఎస్టీలు నివాసం వున్న ప్రాంతాలకు మాత్రమే కాదన్నారు. నిరుపేదలు ఎక్కువగా వున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ భవనాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే కన్నపాక్యం, వెళ్లియూర్‌లో భవనాలను నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏడాదికి ఒక్కో నియోజకవర్గంలో 20 సముదాయ భవనాలను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ జయశీలిజయపాల్, వైస్ చైర్మన్ బర్గతుల్లా, కౌన్సిలర్ ఢిల్లీ, పంచాయతీ ఉపాధ్యక్షుడు గిరి పాల్గొన్నారు.

నేడు తాంబరంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తిరువొత్తియూరు: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వెస్ట్ తాంబరంలో శుక్రవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. వాటిని తాంబరం కార్పొరేషన్ డీఎంకే, తమిళనాడు కబడ్డీ సంఘం సంయుక్తంగా ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా నేతృత్వంలో జరగనున్నాయి. పోటీలను డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, యువజన అభివృద్ధి, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించనున్నారు. మండల కమిటీ అధ్యక్షుడు టి కామరాజర్ ఆహ్వానించనున్నారు. వెస్ట్ తాంబరం టీటీకే ప్రాంతంలో ఉన్న కలంజర్ మైదానంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఇందులో డీఎంకే పార్లమెంటు కమిటీ సభ్యులు టీఆర్ బాలు, ఎంపీ నిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, కాంచీపురం నార్త్ జిల్లా కార్యదర్శి, మంత్రి టీఎం అన్బరసన్ తదితరులు పాల్గొననున్నారు. పోటీ చివరి రోజైన ఏడో తేదీ గెలుపొందిన జట్టుకు డీఎంకే పార్లమెంటు కమిటీ సభ్యుడు కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు బహుమతులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో మేయర్ డిప్యూటీ మేయరు పార్లమెంటరీ సభ్యులు డీఎంకే నిర్వాహకులు పాల్గొననున్నారు.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట రూ.1.25 కోట్ల మోసం

– ముగ్గురి అరెస్టు



అరెస్టయిన ఆక్యుపంక్చర్ వైద్యులు

తిరువళ్లూరు: ఆన్‌లైన్ వ్యాపారం పేరిట రూ.1.25 కోట్లు మోసం చేసిన కేసులో ఇద్దరు ఆక్యుపంక్చర్ డాక్టర్లు సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. మదురై జిల్లా పసుమలై ప్రాంతానికి చెందిన కుమారప్రభు, అతని భార్య మహాలక్ష్మి ఆక్యుపంక్చర్ డాక్టర్లుగా క్లినిక్ నడుపుతున్నారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపంలోని కుండ్రత్తూరులో క్లినిక్‌ను ఏర్పాటు చేసి వారంలో ఒక రోజు వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ క్లినిక్‌లో ఆవడి పోలీసు కానిస్టేబుల్ దినేష్‌కుమార్ భార్య షర్మిల పనిచేస్తున్నారు. వీరు ఆక్యుపంక్చర్ డాక్టర్‌గా క్లినిక్ నిర్వహిస్తూనే ఆన్‌లైన్ వ్యాపారం పేరిట దీపావళీ చీటి, వేలం చిట్టీలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యాపారంలో తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలూకా దేవంపట్టు గ్రామానికి చెందిన సౌమ్య(26) తదితరులు చేరారు. వీరు పలువురి వద్ద రూ.1.25 కోట్లు వసూలు చేశారు. చిట్టీలు పూర్తయినా నగదు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు తిరువళ్లూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మోసం చేసినట్టు తేలడంతో ఆక్యుపంక్చర్ డాక్టర్లు కుమార ప్రభు, అతడి భార్య మహాలక్ష్మి, వారి వద్ద పనిచేసిన పోలీసు కానిస్టేబుల్ భార్య షర్మిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నీట్ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

తిరువొత్తియూరు: వైద్య కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే అర్హతా పరీక్ష నీట్ హాల్ టికెట్లు విడుదల చేశారు. వీటిని అభ్యర్థులు ఇంటర్నెట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని జాతీయ పరీక్ష విభాగం అధికారులు తెలిపారు. నీట్ పరీక్షలను ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం దేశంలోని 546 నగరాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. 20 లక్షల 87 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం హాల్ టికెట్లను ఇంటర్నెట్‌లో విడుదల చేశారు. విద్యార్థులు httpr://nŠbélet.nta.nic.in, www.nta.ac.inలో అప్లికేషన్ నెంబరు, పుట్టిన తేదీని నమోదు చేసి డౌన్లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. హాల్ టికెట్లను ఆధార్ కార్డు, పాస్‌ఫోర్ట్, లేదా డ్రైవింగ్ లైసెన్సు తదితరాల్లో ఏదేనా ఒక గుర్తింపు కార్డును పరీక్షా కేంద్రాలకు తీసుకువాలని సూచించారు. రాష్ట్రంలో 1.20 లక్షల మంది విద్యార్థులు ఈ నీట్ పరీక్షలు రాయనున్నారుఉ. రాష్ట్రంలో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కోవై, మదురై, కడలూరు, కరూరు, తిరుచ్చి, కన్యాకుమారి, తంజావూరు, వేలూరు, విల్లుపురం, ఊటీ తదితర 31 నగరాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు.

విద్యార్థిని హత్య కేసులో దంపతుల అరెస్ట్

తిరువొత్తియూరు: కోవై కళాశాల విద్యార్థిని హత్య కేసులో పొల్లాచ్చికి చెందిన దంపతులను పోలీసులు కేరళలో అరెస్టు చేశారు. కోవై ఇడయార్ పాలయంకు చెందిన సుజై (27) ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తున్నాడు. అతని భార్య రేష్మ (23) కేరళ రాష్ట్రం కొట్టాయంకు చెందిన వారు. సుజయ్ రేష్మను గత సంవత్సరము ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇతను భార్యతో సహా కొల్లాచి కొట్టంపట్టి వద్ద ఉంటున్నాడు. రేష్మ 8 నెల లగర్భిణి. మంగళవారం సుజై ఇంటిలో ఓ యువతి కత్తిపోటుకు గురై మృతిచెందినట్టు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేశారు. ఆ ఇంటిలో ఉన్న సుజై, రేష్మ కనిపించకుండా పోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. హత్యకు గురైన యువతి ఇడయార్ పాలయం ప్రాంతానికి చెందిన రాజన్ గాంధీ కుమార్తె సుబ్బలక్ష్మి అని, ఆమె కోవైలో ఉన్న ఓ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్టు గుర్తించారు. సుజై కోవైలో నివాసం ఉంటున్న సమయంలో సుబ్బలక్ష్మిని ప్రేమించినట్టు తెలిసింది. ఆమెను మోసం చేసి రేష్మను వివాహం చేసుకున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న సుబ్బలక్ష్మి వెతుక్కుంటూ అతని ఇంటికి వచ్చింది. ఆ సమయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగి హత్యకు గురై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అదృశ్యమైన సుజై, రేష్మ కేరళలో వున్నట్టు గుర్తించి గురువారం ఉదయం అరెస్టు చేశారు.

తిరుత్తణి ద్రౌపదీదేవి ఆలయ ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో ద్రౌపదీదేవి



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

తిరుత్తణి: తిరుత్తణిలోని పురాతన ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ ఉత్సవాలకు గురువారం ధ్వజారోహణం చేపట్టారు. 18 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి ఈ నెల 21న అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు. అనంతరం ధర్మరాజులుకు విశిష్ట అభిషేకాలు, ఆరాధనలు, పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ పగటి సమయాల్లో మహాభారత ప్రవచనాలు, రాత్రి వీధి నాటకాలు ప్రదర్శించనున్నారు. ఉత్సవ వేడుకలు ప్రారంభంతో ఆలయం పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు కంకణాలు ధరించి ఉపవాస దీక్షలు చేపట్టారు. పది వేలకు పైబడిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేపట్టనున్న క్రమంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆరు సవర్ల బంగారు నగలు చోరీ

తిరువొత్తియూరు: ప్రైవేటు సంస్థ విశ్రాంత ఉద్యోగి ఇంటిలో చెదలు పోగొట్టడానికి మందుకొట్టేందుకు వచ్చి 6 సవర్ల నగలను చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కొలతూరు ప్రాంతానికి చెందిన నటరాజన్ (69) ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ విశ్రాంతి పొందాడు. ఇతని ఇంటిలో చెదలు నివారణకు కోడంబాక్కంలో వున్న ప్రైవేటు సంస్థకు సమాచారం ఇచ్చాడు. మందుకొట్టేందుకు ఎన్నూర్ సునామీ క్వార్టర్స్‌కు చెందిన దయాలన్ (31) వచ్చాడు. ఈ క్రమంలో బెడ్ రూమ్‌లో ఉన్న ఆరు సవర్ల నగలు కనిపించకుండా పోయాయి. నటరాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న దయాలన్ వద్ద పోలీసులు విచారణ చేశారు. అతను ఆరు సవర్ల నగను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

విద్యార్థినిపై లైంగిక దాడి

- యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడి చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోల్లాచి సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక నెల క్రితం ఆ ప్రాంతంలో నీరు పట్టుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో సుశీంద్రన్ (22) అనే యువకుడు బాలికతో మాటలు కలిపి పరిచయం చేసుకున్నాడు. తర్వాత ప్రేమిస్తున్నట్లు మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విద్యార్థినిపై లైంగిక దాడి చేశాడు. దీని గురించి సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు పొల్లాచ్చి మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సుశీంద్రన్‌ను అరెస్టు చేశారు. తర్వాత కోర్టులో హాజరుపరిచి కోవై సెంట్రల్ జైలుకు తరలించారు.

రేషన్ దుకాణంలోకి చొరబడిన ఎలుగుబంటి

తిరువొత్తియూరు: నీలగిరి జిల్లా కున్నూరు ప్రాంతంలో ఇటీవల కాలంలో ఎలుగుబంటి, అడవి దున్నలు, చిరుత పులులు ఆహారం కోసం జనావాసాల్లోకి వస్తున్నాయి. కున్నూరు నగర ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో ఒక ఎలుగుబంటి రైల్వే క్రాసింగ్ ప్రాంతంలో ఉన్న రేషన్ దుకాణం తలుపులు పగలగొట్టింది. లోపలికి వెళ్లి గదిలో ఉన్న లోపల మరో గది తలుపు వేసి ఉండడంతో ఆహారం అవి తీసుకోవడానికి వీలు కాలేదు. దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఉదయం ఉద్యోగులు రేషన్ దుకాణానికి వచ్చిన సమయంలో తలుపులు పగలగొట్టబడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. దుకాణంలోకి ఎలుగుబంటి వచ్చినట్టు గుర్తించారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

రైల్వే స్టేషన్‌లో మూడు నెలల పసికందు

కొరుక్కుపేట: కాట్పాడి రైల్వే స్టేషన్‌లో 3 నెలల పసికందును ఓ తల్లి వదిలివెళ్లిపోయింది. సేలం ఆటయం పట్టికి చెందిన సుందరి (63), శివకుమార్ (43) పని నిమిత్తం కాట్పాడికి వచ్చారు. సేలం వెళ్లేందుకు బుధవారం సాయంత్రం కాట్పాడి రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. ఆ సమయంలో 1వ ప్లాట్‌ఫారమ్ వద్ద 30 ఏళ్ల మహిళ 3 నెలల పాపతో వచ్చింది. సుందరి, శివకుమార్ దగ్గరకు వెళ్లి నా బిడ్డను చూసుకోమని చెప్పింది. చిన్నారిని వారికి అప్పగించి వెళ్లిపోయింది. చాలా సేపయినా ఆమె రాలేదు. శివకుమార్ రైల్వే పోలీసులకు విషయాన్ని చెప్పాడు. రైల్వేస్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించిన మహిళ సుందరికి బిడ్డను అప్పగిస్తూ మళ్లీ రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించింది. గేటు దగ్గరకు వెళ్లి ఆటో డ్రైవర్లతో మాట్లాడినట్లు సమాచారం. రైల్వే పోలీసులు ఆటో డ్రైవర్లను విచారించారు. పాపను వదిలేసి వెళ్లిన మహిళ చిన్నారి తల్లి అయి ఉంటుందని, పరిసర ప్రాంతాలకు చెందిన వారు అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. బిడ్డను వదిలేసి వెళ్లిన ఆమెను పట్టుకునేందుకు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

డీఎంకే నాయకుడిపై హత్యాయత్నం

- గంజాయి బ్యాచ్ కోసం పోలీసుల గాలింపు



చికిత్స పొందుతున్న కలైవానన్

తిరువళ్లూరు: డీఎంకే విద్యార్థి విభాగం నాయకుడిపై గంజాయి బ్యాచ్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన తిరువళ్లూరు పట్టణంలో కలకలం రేపింది. తీవ్ర గాయాలైన యువకుడికి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. తిరువళ్లూరు మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ ఇందిర పరశురామన్ కుమారుడు కలైవానన్ డీఎంకే విద్యార్థి విభాగంలో ఉప కార్యదర్శిగా పని చేస్తున్నాడు. కలైవానన్ సమీప బంధువైన లోకనాథన్ కుమారుడు శరవణన్(21) డిగ్రీ పూర్తి చేసి గంజాయి స్మగ్లర్ ఆకాష్(25) బ్యాచ్‌తో తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో వారితో తిరగకుండా వేరే పని చేసుకోవాలని శరవణన్‌ను కలైవానన్ మందలించి తన షామియానా సప్లయర్స్‌లో పని కల్పించాడు. ఆకాష్ తరచూ సప్లయర్స్ వద్దకు వెళ్లి తమతో రావాలని శరవణన్‌ను వేధిస్తున్నాడు. ఈ విషయమై ఆకాష్ గ్యాంగ్‌కు కలైవానన్‌కు మధ్య రెండు వారాల క్రితం ఘర్షణ జరిగింది. ఈ సంఘటనపై తిరువళ్లూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. గురువారం ఉదయం 9 గంటలకు కలైవానన్ పట్టణంలో నిర్వహిస్తున్న మెడికల్ షాపుకు వెళుతుండగా గంజాయి స్మగ్లర్ ఆకాష్, సంతోష్, ప్రాంక్లిన్, దేవ, చిట్టూ, లిప్టిక్ అజిత్ అడ్డగించి కత్తులతో నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన కలైవానన్‌ను స్థానికులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం కలైవానన్ పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనపై తిరువళ్లూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

క్రీడా మైదానాలు, దోబీఘాట్ల అభివృద్ధి



క్షేత్రస్థాయి సమీక్షలో మంత్రి శేఖర్ బాబు

కొరుక్కుపేట: నగరంలోని కన్నికాపురం క్రీడా మైదానంతోపాటు పురసైవాక్కం, చేట్‌పేటలోని దోబీఘాట్లను అభివృద్ధి చేయనున్నట్టు దేవదాయ శాఖామంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. ఆయన గురువారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెన్నైలోని వ్యాసార్పాడిలో ఉన్న కన్నిగాపురం క్రీడామైదానాన్ని రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అదే విధంగా పురసైవాక్కం, చేట్‌పేటలో ఉన్న దోబీఘాట్లను ఒక్కొక్కటి రూ.10 కోట్లతో తీర్చిదిద్దుతామన్నారు. నిర్వాసితులకు చెన్నై డెవలప్‌మెంట్ బోర్డు నిర్మించే ప్లాట్లను కేటాయించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. శాసనసభలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలో అల్పాహార పథక కార్యక్రమాన్ని విస్తరించనున్నామని చెప్పారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని 32,122 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తామన్నారు. తద్వారా ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 18 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల సంరక్షణ కేంద్రానికి తరలింపు



బాలుడిని అధికారులకు అప్పగిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: వారం రోజుల కింద పుష్కరిణి వద్ద లభించిన శిశువును కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ చిన్నపిల్లల సంరక్షణ కమిటీకి అప్పగించారు. తిరువళ్లూరు జిల్లా వీరరాఘవుడి ఆలయం లోని పుష్కరిణి వద్ద గత 27న పది రోజుల మగ శిశువు లభించింది. ఈ శిశువును తిరువళ్లూరు టౌన్ పోలీసులు వైద్యశాలకు తరలించారు. అక్కడ వారం పాటు ఐసీయూలో వుంచి వైద్యసేవలను అందించారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా కోలుకోవడంతో కలెక్టర్ కార్యాలయానికి తీసుకొచ్చారు. బాలుడికి కలెక్టర్ ఆనంద్‌గా నామకరణం చేసి ఆరోగ్యంపై ఆరా తీశారు. బాలుడు ఆరోగ్యంగా వుండడంతో సంరక్షణ నిమిత్తం చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. కార్యక్రమంలో చిన్నారుల సంరక్షణ అధికారి నిషాంతిని, ప్రొబేషన్ అధికారి సయ్యద్ రవూఫ్, కమిటీ చైర్‌పర్సన్ మేరీ ఆక్సిలియా పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని మృతి

- చికిత్స పొందుతున్న ప్రియుడు

అన్నానగర్: బైక్‌లో వెళుతున్న ప్రేమికులు అదుపు తప్పి కిందపడి గాయపడ్డారు. ప్రియురాలు మృతిచెందగా ప్రియుడు చికిత్స పొందుతున్నాడు. కన్యాకుమారి జిల్లా మానవలకురిచ్చి సమీపంలోని దరువైయికి చెందిన లాజర్మణి, తమిళరసి దంపతుల కుమార్తె అపర్ణ (16) ప్లస్–2 చదువుతోంది. ఆమెకు రెండేళ్ల క్రితం కులచల్ కలిమార్ ప్రాంతానికి చెందిన విజు (19)తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తమిళరసి కుమార్తెను మందలించింది. విజును కూడా హెచ్చరించింది. దీంతో అతను కొన్ని రోజులుగా అపర్ణను కలవడం లేదు. ఈ స్థితిలో ఇంట్లో అపర్ణ ఒంటరిగా ఉన్నట్టు తెలుసుకున్న విజు బైకులో అక్కడికి వచ్చాడు. ఇద్దరూ పెళ్లి చేసుకుందామని చెప్పి ఆమెను తీసుకుని బయలుదేరాడు. మండైక్కాడు సమీపంలోని వెట్టుమడై వద్ద బైకు అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్ర గాయపడిన ఇద్దరినీ స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న తమిళరసి అపర్ణను ఆచారిపల్లం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించింది. అక్కడ అపర్ణ గురువారం మృతి చెందింది. అపర్ణను కిడ్నాప్ చేసిన విజు డ్రగ్ అడిక్ట్ అని సమాచారం. పోలీసులు విచారిస్తున్నారు.

సర్పంచ్ భర్తపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వీఆర్వోలు

తిరుత్తణి: పంచాయతీ సర్పంచ్ భర్తపై వీఆర్వోలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరువలంగాడు యూనియన్ అరుంగుళం పంచాయతీ సర్పంచ్ శరణ్య, ఆమె భర్త మురళి పంచాయతీ అధికారం చెలాయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో గ్రామ నిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న రఘువరన్ విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలో కార్మికుల దినోత్సవం సందర్భంగా మే 1 నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ భర్త అధికార దుర్వినియోగానికి పాల్పడి వీఆర్వోతో విభేదించి సమస్యలు సృష్టించారు. దీనిపై వీఆర్వో రఘువరన్ ఆధ్వర్యంలో వీఆర్వోలు తిరుత్తణి ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అలాగే కనకమ్మసత్రం పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.

పార్థసారథి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

కొరుక్కుపేట: చెన్నై ట్రిప్లికేన్‌లోని శ్రీ పార్థసారథి ఆలయంలో బ్రహోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయం 108 దివ్యదేశాలలో 60వ దివ్యదేశంగా ఖ్యాతిగడించింది. ఇక్కడ ఏటా చిత్ర మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వాహిస్తారు. ఈ వేడుకలు గురువారం ధ్వజారోహణంతో వైభవంగా ఆరంభమయ్యాయి. 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజూ ఉదయం, సాయంత్రం స్వామివారిని ఊరేగింపులు నిర్వహిస్తారు. 10వ రోజు రథోత్సవం ఉంటుంది. ఇక శుక్రవారం శేష వాహన సేవ, ఈనెల 6న ఉదయం గరుడ సేవ, సాయంత్రం హంస వాహన సేవ. 7న సూర్య ప్రభ, చంద్ర ప్రభ, 8న ఉదయం నాచియార్ తిరుకోలం, సాయంత్రం హనుమంత వాహన సేవ, 9న గజ వాహన సేవ ఉంటాయని ఆలయ నిర్వాహకులు వెల్లడించారు.

క్లుప్తంగా...

8 వరకు ఉన్నతవిద్య నియంత్రణ కమిషన్ హియరింగ్స్

- రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజుల ఖరారుకు చర్యలు
- కోర్సుల్లో ప్రవేశాలకు ముందుగా ఫీజుల ఖరారు తప్పనిసరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కాలేజీల్లోని వివిధ కోర్సుల్లో ఫీజుల ఖరారు ప్రక్రియ ఈనెల 8వ తేదీ వరకు జరుగుతుందని, ఆయా కాలేజీల యాజమాన్యాలు ఆలోగా ఫీజులు ఖరారు చేయించుకోవాలని రాష్ట్ర ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. కాలేజీల యాజమాన్యాలు ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పూర్తిచేయాలంటే కోర్సులకు ఫీజుల ధ్రువీకరణ తప్పనిసరి అని స్పష్టం చేసింది. వివిధ ఉన్నత విద్యాసంస్థల్లోని కోర్సులకు ఫీజులు ఖరారు ప్రక్రియను కమిషన్ మార్చి 28వ తేదీ నుంచి కొనసాగిస్తోందని తెలిపింది. ఇప్పటివరకు అగ్రికల్చరల్, హార్టికల్చరల్, మెడికల్, డెంటల్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, లా కాలేజీలు అందిస్తున్న కోర్సులకు విద్యార్థుల ట్యూషన్ ఫీజులకు సంబంధించిన పర్సనల్ హియరింగ్స్‌ను పూర్తిచేసినట్లు వివరించింది. మే ఒకటో తేదీ నుంచి డిగ్రీ, పీజీ కోర్సులు అందిస్తున్న వివిధ డిగ్రీ, పీజీ కాలేజీలకు విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల ఖరారు ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొంది. ఈ ఫీజుల ఖరారుకు సంబంధించిన పర్సనల్ హియరింగ్స్ ఈనెల 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపింది. కళాశాలల యాజమాన్యాలు వారికి నిర్దేశించిన తేదీల్లో పర్సనల్ హియరింగ్స్‌కు ఏ కారణం చేతనైనా హాజరుగాకపోతే ఈ నెల 8వ తేదీలోపు కమిషన్ ముందు హాజరుకావచ్చని తెలిపింది. డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులకు కాలేజీల యాజమాన్యాలు ప్రవేశాలు ఇవ్వాలంటే ఉన్నతవిద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ద్వారా ఫీజుల ఖరారు తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఫీజులు ఖరారు చేయించుకోని పక్షంలో ఆయా కాలేజీల కోర్సులను కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కౌన్సెలింగ్‌లో చూపించబోరని, దీంతో ఆ కాలేజీలకు విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉండదని పేర్కొంది.

టీడీపీ అధికారంలోకి వస్తే పన్నులు తగ్గిస్తాం

ఆ పార్టీ నేత నారా లోకేశ్

కర్నూలు : టీడీపీ అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారం తగ్గిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం పాణ్యం నియోజకవర్గంలోని బొల్లవరం గ్రామంలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాన్ ఆరోగ్యానికి హానికరం.. ఫ్యాన్ ఆపేస్తేనే మహిళలకు మంచి రోజులొస్తాయని చెప్పారు. విద్యా వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ఫెయిల్ అయ్యాయని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా ఫీజును నేరుగా కాలేజీలకు చెల్లించామని, జగన్ పాలనలో తల్లుల ఖాతాలో వేస్తామని చెప్పి చెల్లించడం లేదన్నారు. మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించేలా సబ్సిడీ రుణాలు అందజేసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, చిన్నకొట్టాల మీదుగా పెద్దకొట్టాల గ్రామం వరకు పాదయాత్ర కొనసాగింది.



విజయవాడ కొత్తపేటలో మారం బాలసుబ్రమణ్యంకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ పొట్నూరి పూర్ణిమ



గుంటూరు ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన బుజ్జమ్మకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వార్డు వలంటీరు బద్రి



ఏలూరులో ఎస్‌కే నూర్జహాన్‌కు వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ కె.హారిక



కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో ఐరిష్ ద్వారా సరస్వతమ్మకు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రెటరీ రవి

హవ్వ! ఇదేం తీరు రామోజీ?

భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఎటువంటి అనుమతులు, భూసేకరణ లేకుండా చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ప్రశ్నించని ఈనాడు

ఈ రోజు అన్ని అనుమతులతో శంకుస్థాపన చేస్తే పచ్చకలంతో విషం కక్కిన వైనం

- ఆ రోజు జగన్ వ్యతిరేకించింది బాబు భూదాహాన్ని.. భోగాపురం ఎయిర్‌పోర్టును కాదు
- అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పేరుతో 12,000 ఎకరాలు భూ సేకరణకు సిద్ధమైన చంద్రబాబు
- అంత భూమి అవసరం లేదు 2,300 ఎకరాలు చాలు అన్న వైఎస్ జగన్
- భూసేకరణ చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు.. కోర్టు కేసులు అధిగమించి పూర్తి చేసిన వైఎస్ జగన్
- 2,203 ఎకరాల్లో ఏర్పాటు చేసే విధంగా ఏప్రిల్ 2020లో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న జీఎంఆర్
- సుప్రీంకోర్టు నవంబర్11, 2022న తీర్పు ఇస్తే.. జనవరి 2023 నాటికి పూర్తయిన భూ సేకరణ
- రూ.80 కోట్లతో పునరావాస గ్రామాలను నిర్మించి నాలుగు గ్రామాల ప్రజలను గత మార్చిలో తరలింపు
- భోగాపురం ఎయిర్‌పోర్టుకు నిరభ్యంతర సర్టిఫికెట్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- భోగాపురం ఎయిర్‌పోర్టును భీమిలికి అనుసంధానం చేస్తూ రూ.6,300 కోట్లతో రహదారి నిర్మాణం
- జీఎంఆర్‌తో ఒప్పందం లేదు, ఒక ఎకరం భూ సేకరణ లేదు అయినా ఎన్నికల ముందు శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- చంద్రబాబు డ్రామాలు గమనించి శంకుస్థాపనకు దూరంగా ఉన్న జీఎంఆర్ కంపెనీ ప్రతినిధులు
- వాస్తవాలు ఇలా ఉంటే.. తప్పుడు రాతలతో సీఎం జగన్‌పై అక్కసు వెళ్లగక్కిన పచ్చ మీడియా



ఫ్యాక్ట్‌చెక్

సాక్షి, అమరావతి

అసత్యాలు ప్రమాదకరం. అర్ధసత్యాలు మరింత ప్రమాదకరం. అందుకే భోగాపురం ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసిన వేళ.. 'ఈనాడు' అర్ధసత్యాల రూటును ఎంచుకుంది. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సొంత భాష్యాలు చెబుతూ... వాటిలో కొంత మాత్రమే ఇస్తూ... ''హవ్వ... అది నోరేనా?'' అంటూ తన అక్కసు మొత్తం వెళ్లగక్కేసింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా చెప్పినవన్నీ ఇపుడు చేశాకే... విమానాశ్రయానికి ముఖ్యమంత్రి హోదాలో జగన్ శంకుస్థాపన చేశారనే అసలు వాస్తవానికి మాత్రం తనదైన ముసుగేసేసింది.

టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకుండానే... ఎప్పుడో రెండేళ్ల కిందటి ఫోటో తీసుకొచ్చి కొట్టారంటూ ప్రచారం చేయటం...

వ్యాపారులు మిల్లు ఆవరణలో ఆరబెట్టుకున్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకున్నారని అబద్ధాలు చెప్పి గుండెలు బాదేసుకోవటం...

ఇపుడేమో భోగాపురంపై జగన్‌మోహన్ రెడ్డి వ్యాఖ్యలకు వక్రభాష్యాలు చెప్పి దుష్ప్రచారానికి దిగటం...

ఇవన్నీ తాజా పరిణామాలు కావటంతో ''ఈనాడు మరీ ఇంతలా దిగజారిపోయిందేంటి?'' అనే వ్యాఖ్యలు, దానికి జోడించిన కథనాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏఏ అంశాలను వ్యతిరేకించారు? ఇపుడు వాటి విషయంలో ఎలా ముందుకు వెళుతున్నారో చూద్దాం...

ఎన్నికలకు నిండా నెల రోజులు కూడా లేదు. భూ సేకరణ పూర్తికాలేదు. ఎలాంటి అనుమతులూ లేవు. అయినా సరే... హడావుడిగా ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల ముందు 2019 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసేశారు చంద్రబాబు నాయుడు. అనుమతులు లేకుండా ఎలా చేశారు? భూసేకరణ ఎప్పుడు పూర్తి చేస్తారు? అసలు ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల ముందు ఎందుకింత హడావుడి? అని 'ఈనాడు' ఒక్క ప్రశ్న వేస్తే ఒట్టు!!. పైపెచ్చు కొబ్బరికాయ కొట్టిననాడే విమానాశ్రయం పూర్తయిపోయి విమానాలు ఎగురుతున్న రేంజిలో కవరేజి.

ఇప్పుడైతే ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం శంకుస్థాపనకే పరిమితం కాలేదు. భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన వివాదాలన్నిటినీ పరిష్కరించారు. కావాల్సిన అనుమతులన్నీ తెప్పించారు. అన్నీ చేసిన తరవాత... 30 నెలల్లో పూర్తి చేయాలని జీఎంఆర్ సంస్థకు లక్ష్యం విధించి మరీ కొబ్బరికాయ కొట్టారు. కానీ రామోజీరావు మాత్రం... సవాలక్ష అర్ధసత్యాలతో చెలరేగిపోయారు. నిజానికి 2018 మార్చి దాకా కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం భాగస్వామి. అన్నిటికన్నా ముఖ్యం... విజయనగరం జిల్లాకే చెందిన పి.అశోక్‌గజపతిరాజు కేంద్ర విమానయాన శాఖ మంత్రి. సొంత జిల్లాలో వస్తున్న విమానాశ్రయానికి అన్ని అనుమతులూ తెప్పించడానికి ఆయన ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. చంద్రబాబు నాయుడు కూడా పట్టించుకోలేదు.

కానీ ఎన్నికల ముందు ఉత్తుత్తి శంకుస్థాపనతో హడావుడి మాత్రం చేశారు. వాస్తవానికి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసింది కూడా విమానాశ్రయానికి సంబంధించిన భూమిలో కాదు. అది తన సొంత భూమి అని, తన నుంచి విమానాశ్రయం కోసం సేకరించటం కూడా జరగలేదని, కానీ అందులో శంకుస్థాపన చేశారని అప్పట్లో సత్యనారాయణ అనే రైతు వాపోయాడు. చివరకు ఆ రైతు గోడును కూడా పట్టించుకోని రామోజీరావు... ఇపుడు మాత్రం ముఖ్యమంత్రి జగన్‌పై అభాండాలు వేయటం విచిత్రం.

అమరావతి రైతులతో పోలికా?

అప్పట్లో అమరావతి రైతులను త్యాగధనులగాను, భోగాపురం రైతులను లిటిగేషన్ పెట్టే రైతులుగాను చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించటం నిజం కాదా? అమరావతి రైతులతో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... తాను ఇచ్చిన పిలుపుతో అమరావతి కోసం. గన్నవరం విమానాశ్రయం కోసం రైతులు భూమిని ఇచ్చి త్యాగం చేశారని, కానీ భోగాపురం రైతులు భూములిచ్చి కోర్టుల్లో కేసులు వేసి లిటిగేషన్లు పెడుతున్నారని, అందుకే తాము ఎయిర్‌పోర్టును నిర్మించలేకపోతున్నామని చెప్పారు. మరి 'ఈనాడు' ఈ వాస్తవాలెందుకు రాయదు? ముఖ్యమంత్రి జగన్ మాట మార్చారంటూ తప్పుడు కథనాలేల?

పునరావాస గ్రామాలూ పూర్తి...

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు ఉన్నా చిత్తశుద్ధి లేకుండా భోగాపురాన్ని ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్నది చంద్రబాబు నాయుడు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వైఎస్ జగన్ దీనికి అనుమతులు సాధించటంతో పాటు ఈ నాలుగేళ్లలో పునరావాస గ్రామాలను సైతం పూర్తి చేశారు. అప్పట్లో బలవంతపు భూ సేకరణను వ్యతిరేకించిన మాట వాస్తవం. అందుకే స్థానికులు తమకు పరిహారం దక్కి.. స్వచ్ఛందంగా పునరావాస కాలనీలకు వెళ్లిన తరవాతే శంకుస్థాపన చేశారన్న విషయాన్ని దాచిపెడతారెందుకు రామోజీరావు గారూ?

వ్యతిరేకించింది 12,000 ఎకరాల భూసేకరణనే...

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం చంద్రబాబు నాయుడు 2015లో రైతుల నుంచి 12,000 ఎకరాలను సేకరించాలని నిర్ణయం తీసుకోవడంపై స్థానిక రైతుల్లో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమయింది. ఈ ఆందోళనతో నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఏకీభవించారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు అన్ని ఎకరాల భూమి దేనికని ప్రశ్నించారు. 2,300 ఎకరాలు ఉంటే సరిపోతుందన్నారు. ''చెన్నై ఎయిర్‌పోర్టు ఎన్ని ఎకరాల్లో ఉంది? ఢిల్లీ ఎయిర్‌పోర్టు ఎన్ని ఎకరాల్లో ఉంది? అని ప్రశ్నిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు మద్దతుగా నిలిచారు. చివరకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సేకరించాల్సిన భూమిని తొలుత 6,000 ఎకరాలకు... ఆ తర్వాత 2,700 ఎకరాలకు కుదించుకుంటూ వచ్చింది. చివరకు 2017లో 2,700 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో పాటు... ఇందుకోసం ఏర్పాటు చేసిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ కంపెనీ పేరుమీద రూ.1,500 కోట్ల అప్పును హడ్కో నుంచి తీసుకోవడానికి అనుమతిస్తూ జీవో ఇచ్చారు. అయితే బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఇవేమీ ప్రస్తావించని 'ఈనాడు'... నాడు భూసేకరణను వ్యతిరేకించి, నేడు శంకుస్థాపన చేస్తున్నారంటూ రాయటం దారుణం కాక మరేమిటి?

ఏ1గా నిలిచింది జీఎంఆర్ సంస్థే...

- ▲ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తొలుత పిలిచిన టెండర్లల్లో ఎయిర్‌పోర్టు అథారిటీఆఫ్ ఇండియా ఎంపికయింది. కానీ ఆ టెండర్లను రద్దుచేసి తిరిగి పిలిచిన టెండర్లలో జీఎంఆర్ సంస్థే ఏ1గా నిలిచింది. ఈలోగా ఎన్నికలు సమీపించడంతో భూసేకరణ, పర్యావరణ అనుమతులు, జీఎంఆర్‌తో ఒప్పందం లేకుండానే హడావుడి శంకుస్థాపన చేశారు. అందుకే నాటి శంకుస్థాపనకు సైతం జీఎంఆర్ ప్రతినిధులు దూరంగా ఉన్నారు.
- ▲ ఈ ఎయిర్‌పోర్టు భూసేకరణపై సుప్రీంకోర్టు నవంబర్11, 2022న తీర్పు ఇస్తే జనవరి 2023 నాటికి భూసేకరణ పూర్తయ్యింది.
- ▲ ఈ ఏడాది మార్చిలో పునరావాస గ్రామాలకు ప్రజలను తరలించే ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది.
- ▲ ఇక ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి ఎన్ఓసీ 2022 నవంబర్లో వచ్చింది. ఇలా అడ్డంకులన్నీ తొలగించాకే శంకుస్థాపన చేశారు సీఎం జగన్. అసలు 'ఈనాడు' ఏడుపు ఎందుకంటే నాడు చంద్రబాబు చేయలేకపోయింది..నేడు జగన్ చేస్తున్నారనే ఈర్ష్య ఒకటి కాగా... జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ... శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి జగనే పూర్తయ్యాక విమానాశ్రయాన్ని ప్రారంభించాలని వ్యాఖ్యానించటం ఎల్లో ముఠా జీర్ణించుకోలేకపోతోంది. అందుకే శంకుస్థాపన కార్యక్రమం వార్తను కుదించేసి... అసత్యాలు, అర్ధసత్యాలతో కూడిన కథనాన్ని పతాక శీర్షికల్లో వేసేసింది.

> **తెలుగుదేశం ఎందుకు చేయలేకపోయింది**
>
> ''నిజంగా టీడీపీకి భోగాపురం ఎయిర్‌పోర్టుపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు ఒక అడుగు కూడా ముందుకు పడలేదు? హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వరకు అన్ని కేసులనూ దేవుడి దయతో పరిష్కరించుకుని రైతుల ఆమోదంతో భూసేకరణను పూర్తి చేశాం.అంతే కాకుండా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి శంకుస్థాపన చేస్తున్నాం. ఈ నాలుగేళ్లలో రూ.80 కోట్లు ఖర్చు చేసి అన్ని వసతులు, సౌకర్యాలతో పునరావాస గ్రామాలను అభివృద్ధి చేసి రైతులు స్వచ్ఛందంగా వెళ్లేలా చేశాం. విశాఖ నుంచి భోగాపురానికి ఎక్స్‌ప్రెస్ హైవేను రూ.6,300 కోట్లతో నిర్మించడానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకున్నాం. వీటి పనులు త్వరలో మొదలవుతాయి. ఇక భోగాపురం ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల నీటి ఎద్దడిని పరిష్కరించడానికి రూ.195 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మరో 30 నెలల్లో ఇక్కడి నుంచి విమానాలు ఎగురుతాయి. ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కిరీటంగా మారుతుంది.''
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సీతారామా.. నీళ్లెక్కడ?

తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన గోదావరి బోర్డు

- ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించని గోదావరి ట్రిబ్యునల్
- నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య కుదరని ఒప్పందం
- ఈ నేపథ్యంలో సీతారామ ఎత్తిపోతలను ఎలా చేపడతారు?
- సీతమ్మసాగర్ వద్ద 347.06 టీఎంసీలు ఉంటాయన్న తెలంగాణ
- పోలవరం ప్రాజెక్టుకు 561 టీఎంసీలపై స్పష్టత ఇవ్వాలని సీడబ్ల్యూసీని కోరిన బోర్డు
- బేసిన్, సబ్ బేసిన్ల వారీగా నదిలో నీటి లభ్యతను తేల్చాలని వినతి

సాక్షి, అమరావతి: సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బహుళార్ధసాధక ప్రాజెక్టుకు నీళ్లెక్కడివని తెలంగాణ ప్రభుత్వాన్ని గోదావరి బోర్డు ప్రశ్నించింది. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేయలేదని, నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందమే కుదరలేదని స్పష్టంచేసింది. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టును ఎలా చేపట్టారని తెలంగాణను నిలదీసింది. దమ్ముగూడెం ఆనకట్టకు 200 మీటర్ల దిగువన 36.57 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజీ, దానికి అనుబంధంగా 320 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్ కేంద్రం నిర్మించి రోజుకు 9 వేల క్యూసెక్కుల చొప్పున 70 టీఎంసీలను తరలించి 6.74 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా సీతారామ ఎత్తిపోతలను తెలంగాణ చేపట్టింది. ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలంటూ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను గోదావరి బోర్డుకు అందజేసింది. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చి, రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేసే వరకు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకూడదని, తద్వారా దిగువ రాష్ట్రం హక్కులను పరిరక్షించాలని గోదావరి బోర్డు, కేంద్ర జల్ శక్తి శాఖలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక లేఖలు రాసింది. ఇదే అంశంపై జనవరి 3న జరిగిన సర్వ సభ్య సమావేశంలోనూ సీడబ్ల్యూసీని కోరింది. తాజాగా సీతారామా ఎత్తిపోతలపై గోదావరి బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

పోలవరం ఆయకట్టుకు రక్షణ కల్పిస్తేనే

పోలవరం ప్రాజెక్టు వద్ద 75 శాతం లభ్యత ఆధారంగా 561 టీఎంసీల లభ్యత ఉంటుందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) 141వ సమావేశంలో తేల్చింది. ఎగువన ఏ ప్రాజెక్టు చేపట్టినా పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన 561 టీఎంసీలకు రక్షణ కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది. కానీ.. సీతారామ ఎత్తిపోతల డీపీఆర్‌లో సీతమ్మ సాగర్ వద్ద 347.06 టీఎంసీల లభ్యత ఉంటుందని తెలంగాణ పేర్కొంది. దీనిని అధ్యయనం చేసి నీటి లభ్యతను ఖరారు చేయాలని సీడబ్ల్యూసీకి గోదావరి బోర్డు ప్రతిపాదించింది. సీతారామ ఎత్తిపోతల చేపడితే పోలవరం వద్ద 561 టీఎంసీల లభ్యతపై స్పష్టత ఇవ్వాలని కోరింది.



కృష్ణా బేసిన్‌కు ఎలా తరలిస్తారు?

సీతారామ ఎత్తిపోతల ద్వారా 10.109 టీఎంసీల గోదవరి జలాలను కృష్ణా బేసిన్‌కి తరలించి నాగార్జునసాగర్, వైరా, పాలేరు ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరిస్తామని డీపీఆర్‌లో తెలంగాణ సర్కార్ పేర్కొంది. ఏ ప్రాతిపదికన గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తారో స్పష్టత ఇవ్వాలని తెలంగాణ సర్కార్‌ను గోదావరి బోర్డు కోరింది. వీటిపై స్పష్టత ఇస్తేనే సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ డీపీఆర్ మదింపు, అనుమతి ప్రక్రియ ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

రెండు రాష్ట్రాల డిమాండ్ 1,743 టీఎంసీలు

ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టుల అవసరాలకు 776 టీఎంసీలు అవసరమని ఏపీ, 967 టీఎంసీలు అవసరమని తెలంగాణ ప్రతిపాదించాయని గోదావరి బోర్డు పేర్కొంది. అంటే.. రెండు రాష్ట్రాల అవసరాలు 1,743 టీఎంసీలని లెక్కగట్టింది. కానీ, గోదావరిలో ఆ మేరకు నీటి లభ్యత లేదని రెండు రాష్ట్రాలూ అంగీకరిస్తున్నాయని తెలిపింది. ఉమ్మడి ఏపీ 2014 జనవరి 2న రాసిన లేఖ ప్రకారం గోదావరిలో నీటి లభ్యత 1,486.155 టీఎంసీలని తెలంగాణ అంటుండగా, 2004 నాటి వ్యాప్కోస్ నివేదిక ప్రకారం గోదావరిలో కేవలం 1,360 టీఎంసీలని, పునరుత్పత్తితో కలిసి 1,430 టీఎంసీలని ఏపీ ప్రభుత్వం పేర్కొంటోంది. పునరుత్పత్తి జలాలను పరిగణలోకి తీసుకోకూడదని గోదావరి ట్రిబ్యునల్ స్పష్టం చేసిన నేపథ్యంలో.. వ్యాప్కోస్ నివేదిక ప్రకారం నీటి లభ్యత 1,360 టీఎంసీలే. ఇదిలా ఉండగా.. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా 2000 – 2020 మధ్య కాలంలో సగటున వరుసగా 72 టీఎంసీలు, 11 టీఎంసీలను వాడినట్టు తెలంగాణ పేర్కొంది. ఈ నేపథ్యంలో గోదావరి బేసిన్, సబ్ బేసిన్ల వారీగా నీటి లభ్యతపై అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని గోదావరి బోర్డు కోరింది.

సుప్రీం తీర్పుతో టీడీపీలో గుబులు

- బాబు మోసాలు బయటకు వస్తాయనే ఆందోళన
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని



కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నమూనాను పరిశీలిస్తున్న మంత్రులు విడదల రజని, బుగ్గన

కర్నూలు(హాస్పిటల్)/బొమ్మలసత్రం: అమరావతి భూ కుంభకోణం విచారణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో టీడీపీ నాయకుల్లో గుబులు మొదలైందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ.12.90కోట్లతో నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్, రూ.4.50కోట్లతో నిర్మించిన ఉమెన్స్ పీజీ హాస్టల్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. రూ.120 కోట్లతో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మీడియాతో మాట్లాడుతూ అమరావతి భూకుంభకోణం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతి తదితర వ్యవహారాలపై దర్యాప్తు కొనసాగింపునకు వీలుగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వారి అవినీతి బాగోతం అంతా బయటకు వస్తుందనే ఆందోళన స్పష్టంగా తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, జనం మద్దతు టీడీపీకి దక్కే పరిస్థితి లేదని, ఈ విషయం అర్ధమయ్యే చంద్రబాబు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

నాలుగు మెడికల్ కాలేజీలకు అనుమతులు

ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఏకంగా రూ.8,500 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మంత్రి రజని తెలిపారు. వీటిలో ఐదు మెడికల్ కళాశాలలు ఈ ఏడాది నుంచే ప్రారంభం కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు కూడా వచ్చాయన్నారు. నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, విజయనగరంలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభమవుతాయని తెలిపారు. రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలకు కూడా త్వరలోనే అనుమతులు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా నంద్యాల మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, అకడమిక్ డీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.

రైతులను అధికారులు నిండా ముంచేశారు

- ప్రతి రైతుకూ ప్రభుత్వమే న్యాయం చేయాలి
- మద్దతు ధరకు ధాన్యం కొనాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: అకాల వర్షాలకు ధాన్యం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యంతో రైతులను నిండా ముంచేశారని, ఏప్రిల్ ఒకటో తేదీకి గోనె సంచులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు.రైతు పరామర్శ యాత్ర పేరిట ఆయన గురువారం ఏలూరు జిల్లా నాచుగుంట గ్రామం, పశ్చిమ గోదావరి జిల్లా నందమూరు, దువ్వ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశంలో కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. ముఖ్యమంత్రి, అధికారుల చేతగానితనంతో రైతులు ఎప్పుడూ లేని విధంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి డబ్బులివ్వాలని రైతులు, మిల్లర్ల నుంచి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రులు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ఈ జిల్లాల్లో ఉండి ఏం చేస్తున్నారని అన్నారు.వర్షం వస్తుందని తెలిసినా వ్యవసాయ శాఖ రైతులను ఎందుకు అప్రమత్తం చేయలేదని ప్రశ్నించారు. ధాన్యం కొనలేని మంత్రి.. రజనీకాంత్ గురించో, పవన్ కల్యాణ్ గురించో మాట్లాడతారంటూ స్థానిక మంత్రి కారుమూరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

తెలుగు తమ్ముళ్ల రైతు వేషాలు

చంద్రబాబు పర్యటనకు రైతుల నుంచి స్పందన కరువైంది. దీంతో టీడీపీ నాయకులే ఒకరిద్దరిని తీసుకువచ్చి బాబు ఎదుట మాట్లాడించారు. కొన్ని చోట్ల నాయకులే రైతుల్లా వ్యవహరించారు. తడిసిన ధాన్యాన్ని బాబుకు చూపించారు. వారితోనే చంద్రబాబు మాట్లాడారు. ఈ వ్యవహారమంతా చూసి దూరంగా ఉన్న అసలు రైతులు విస్తుపోయారు.

సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రస్థాయి కౌన్సిల్‌తోపాటు జిల్లాల వారీగా వృద్ధుల సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర గురువారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007 (కేంద్ర చట్టం నంబర్ 56) ప్రకారం వారికోసం సమర్థమైన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఆ చట్టంలోని సెక్షన్ 32లోని సబ్ సెక్షన్ (2) సబ్ సెక్షన్ (1) ద్వారా అందిన అధికారాలను అమలు చేసేందుకు 'తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించి పౌరుల నియమాలు (రూల్స్)-2011ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నోటిఫై చేసింది. 2007 కేంద్ర చట్టం, ఆంధ్రప్రదేశ్ తల్లితండ్రుల, వయోవృద్ధుల నిర్వహణ నియమాలు-2011 ప్రకారం తాజాగా రాష్ట్రస్థాయి కౌన్సిల్, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు.

ఫ్యాషన్

టూర్ స్టైల్

వేసవిలో ఎండవేడిమి అనే భయం ఉంటుంది. కానీ, సెలవుల్లో టూర్లు.. ఊర్లు తిరగచ్చనే ఆనందమూ ఉంటుంది. టూర్లకు వెళ్లినప్పుడు అనుకూలమైన డ్రెస్సులను ఎంపిక చేసుకుంటే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. కలర్‌ఫుల్‌గా, కంఫర్టబుల్‌గా, స్టైలిష్‌గా, వెరైటీగా ఉండాలని కోరుకునేవారు సులభంగా ఇలాంటి డ్రెస్సులను ఎంపిక చేసుకోవచ్చు. లైట్‌వెయిట్ డ్రెస్సింగ్‌తో ఈ వెకేషన్ టూర్లను మరింతగా ఆస్వాదించవచ్చు.





సింగిల్ పీస్ డ్రెస్ ఎంపికలో లేయర్స్ ఉన్న ఫ్రాక్స్, స్కర్ట్స్‌కు ప్రాముఖ్యం ఇవ్వచ్చు. లేయర్స్ కాంట్రాస్ట్ కలర్స్‌లో ఉండటం వల్ల స్టైలిష్‌గానూ కనిపిస్తాయి. ఫొటోలకు కలర్‌ఫుల్‌గానూ ఉంటుంది.



టాప్ టు బాటమ్ ఒకే కలర్ లేదా కాంట్రాస్ట్‌లో ఉన్న పలాజో–టాప్స్ కంఫర్ట్‌కు, స్టైల్‌కు పర్‌ఫెక్ట్ ఎంపిక అవుతుంది.



కాటన్ లాంగ్ టాప్స్, ఫ్రాక్ స్టైల్ కుర్తీలు బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తాయి. వీటికి బాటమ్‌గా పలాజో లేదా ధోతీ ప్యాంట్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. లేదంటే ఫ్రాక్ మాదిరిగా ఈ టాప్స్‌ను ధరిస్తే చాలు.



మిడ్ స్కర్ట్స్‌లో ప్రింటెడ్స్ మనసును ఆహ్లాదంగా మార్చేస్తాయి. వీటికి స్లీవ్‌లెస్ లేదా షర్ట్ టైప్ టాప్స్ సౌకర్యాన్ని బట్టి ఏ వయసు వారైనా ఎంచుకోవచ్చు.

టూర్లు వెళ్లేవారు రెగ్యులర్ డ్రెస్సులు కాకుండా వెళ్లబోయే ప్రాంత వాతావరణాన్ని బట్టి ఎంపిక చేసుకుంటారు. ఇక అక్కడి జ్ఞాపకాలను ఫొటోలలో భద్ర పరుచుకుంటారు కాబట్టి అందమైన డ్రెస్సులు ఉండాలనుకుంటారు. అందుకే, లైట్‌వెయిట్, సింగిల్ పీస్ డ్రెస్‌లకు అధిక ప్రాముఖ్యత ఉంటుంది. టూర్లలో వెంట తీసుకెళ్లే డ్రెస్‌లలో ఇవి ఎంచుకుంటే చాలు, స్టైలిష్ లుక్‌తో మెరిసిపోతారు. వెళ్లినచోట కంఫర్ట్‌ని ఎంజాయ్ చేస్తారు.



టై అండ్ డై, స్ట్రైప్స్ డ్రెస్సులు టూర్స్‌కి మంచి లుక్‌నిస్తాయి. వీటిలో లైట్ కలర్స్ ఎంచుకోవడం మేలు. మ్యాక్సీ, స్కర్ట్స్ ఇలా ఎంచుకోవచ్చు.

బ్యూటిప్స్

మృదువైన చేతులు పాదాల కోసం...

- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా ఒకింత జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మృదువుగా మారుతుంది.
- రెండు స్పూన్‌ల నిమ్మరసం లేదా కమలాపండు రసంలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ పన్నీరు కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకు పట్టించాలి. ఇది రెగ్యులర్ ప్యాక్. చలికాలంలో రోజూ వేసుకోవచ్చు. ఎండాకాలంలో వారంలో రెండుసార్లు సరిపోతుంది.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మరసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

హోమ్ మేడ్ ఫుట్ స్క్రబ్

- మూడు నిమ్మకాయలు, టేబుల్ స్పూన్ చక్కెర, టీ స్పూన్ బాదం నూనె, పది నుంచి పదిహేను పుదీన ఆకులు తీసుకోవాలి. నిమ్మకాయలను ముక్కలు చేయాలి. పుదీన ఆకులు, నిమ్మకాయ ముక్కలను (తొక్కతో సహా) మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులో చక్కెర, బాదం నూనె కలిపితే పాదాలకు స్క్రబ్ రెడీ. దీనిని పాదాలు, మడమలు, వేళ్ల మధ్య పట్టించి ఆరిన తర్వాత చేత్తో ఐదు నుంచి పది నిమషాల సేపు వలయాకారంగా మర్దన చేసి గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది అన్ని కాలాల్లోనూ అవసరమే. వర్షాకాలంలో పాదాలు నాని ఇన్ఫెక్షన్‌లు సోకకుండా ఉండడానికి ఈ స్క్రబ్‌లో చిటికెడు పసుపు కలుపుకోవాలి.

స్క్రబ్ తయారు చేసుకునే సౌకర్యం లేనప్పుడు... అర బకెట్ వేడి నీటిలో అరకప్పు ఉప్పు (కల్లు ఉప్పు), నిమ్మరసం, పుదీన ఆకులు, నాలుగు చుక్కల కొబ్బరి నూనె వేసి ఆ నీటిలో పాదాలను ఉంచాలి. పది హేను నిమిషాల తర్వాత బాత్ బ్రష్ లేదా చిన్న నూలు వస్త్రంతో పాదాలను రుద్ది కడగాలి.



వంటిల్లు

మ్యాంగో ఫీస్ట్

సీజనల్ ఫ్రూట్స్ తింటాం... మరి! సీజనల్ ఐస్‌క్రీమ్ ఎందుకు తినకూడదు? అదే చేత్తో... సీజనల్ కుల్ఫీ... కేక్... కూడా ట్రై చేద్దాం. ఈ మ్యాంగో సీజన్‌లో పుణె వారి మస్తానీ కూడా! ఈ వారం మన 'వంటిల్లు'లో మ్యాంగో ఫీస్ట్ చేద్దాం.



మ్యాంగో ఐస్‌క్రీమ్

కావలసినవి: మామిడి పండ్లు – 3 ; కండెన్స్‌డ్ మిల్క్– 400 మి.లీ; తాజా క్రీమ్ – 3 కప్పులు; వెనిలా ఎసెన్స్– అర టీ స్పూన్.

తయారీ: ● వెడల్పు పాత్రలో క్రీమ్ వేసి బీటర్‌తో చిలకాలి. సమంగా కలిసి మృదువుగా రావాలంటే దాదాపు పదినిమిషాల సేపు చిలకాల్సి ఉంటుంది. చిలికిన తర్వాత ఓ గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● మామిడిపండ్లను శుభ్రంగా కడిగి చెక్కు, టెంక వేరు చేసి ముక్కలు చేయాలి. ఆ ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో వేసి గుజ్జు చేయాలి. దాదాపు రెండు కప్పుల గుజ్జు వస్తుంది. అందులోనే కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● క్రీమ్ పాత్రను ఫ్రిజ్‌లో నుంచి తీసి అందులో మామిడి గుజ్జు–కండెన్స్‌డ్ మిల్క్ మిశ్రమాన్ని, వెనిలా ఎసెన్స్ వేసి బీటర్‌తో సమంగా కలిసేవరకు చిలకాలి. ఇందుకు ఎలక్ట్రిక్ బీటర్ ఉంటే మంచిది. అది లేకపోతే బ్లెండర్‌లోనే సమంగా కలిసేటట్లు కొద్ది సేపు బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి స్పూన్‌తో సమంగా సర్ది పైన అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి అంచులను అతికించి ఆరుగంటల సేపు ఫ్రీజర్‌లో పెట్టాలి. మ్యాంగో ఐస్‌క్రీమ్ రెడీ. ● ఫ్రీజర్‌లో నుంచి తీసిన వెంటనే కప్పులో వేయడానికి సాధ్యం కాదు. గట్టిగా ఉంటుంది. కాబట్టి తినడానికి పదినిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి తీసి మామూలు ఉష్ణోగ్రతలో ఉంచాలి. **గమనిక:** ఎవరి ఇష్టాన్ని బట్టి వారు చెర్రీ, నట్స్‌తో అలంకరించుకోవచ్చు.

మ్యాంగో కేక్ (ఎగ్‌లెస్)



కావలసినవి: మామిడి పండు ముక్కలు – 300 గ్రాములు ; కండెన్స్‌డ్ మిల్క్ – 400 ఎం.ఎల్ ; గోధుమ పిండి– 300 గ్రా ; చక్కెర – 3 లేదా 4 టేబుల్ స్పూన్‌లు (మామిడి ముక్కల తియ్యదనాన్ని బట్టి) ; బేకింగ్ పౌడర్– టీ స్పూన్ ; బేకింగ్ సోడా– అర టీ స్పూన్ ; వెనిలా ఎసెన్స్ – టీ స్పూన్ ; వెన్న– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● గోధుమ పిండి, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడాలను కలిపి జల్లించి పక్కన పెట్టాలి. ● మామిడి ముక్కలు, చక్కెర కలిపి బ్లెండర్‌లో మెత్తగా చేస్తే మ్యాంగో ప్యూరీ రెడీ. ● అవెన్‌ను 180 డిగ్రీల సెల్సియస్‌తో ప్రీ హీట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● ట్రేకి కొద్దిగా వెన్న రాసి సిద్ధం చేసుకోవాలి. ● మిగిలిన వెన్నను పెనంలో వేడి చేసి అందులో కండెన్స్‌డ్ మిల్క్ కలిపి మిశ్రమం మృదువుగా వచ్చే వరకు చిలకాలి. అందులో మ్యాంగో ప్యూరీ, వెనిలా ఎసెన్స్ వేసి బాగా కలిసే వరకు చిలకాలి. ఇప్పుడు ముందుగా జల్లించి సిద్ధంగా ఉంచిన గోధుమ పిండి మిశ్రమాన్ని వేసి సమంగా కలిసే వరకు గరిటెతో కలపాలి. ఇది చపాతీల పిండిలా గట్టిగా ఉండకూడదు. అలాగని దోశెల పిండిలా జారుడుగానూ ఉండరాదు. అవసరాన్ని బట్టి కొద్దిగా పాలు వేసి కలుపుకోవచ్చు. ● ఈ మిశ్రమాన్ని వెన్న రాసిన ట్రేలో పోసి ట్రేని ఒకసారి అటూఇటూ కదిలిస్తే ఒకే మందంలో సమంగా సర్దుకుంటుంది. 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో 45 నిమిషాల పాటు బేక్ చేయాలి. టూత్ పిక్‌ను గుచ్చి చూసుకుని తేమ లేకుండా లోపల అంతా బేక్ అయిందీ లేనిదీ చెక్ చేసుకోవాలి. అవసరమైతే మరో పది నిమిషాల సేపు బేక్ చేసుకోవాలి. ● అవెన్ నుంచి తీసిన తర్వాత వెడల్పాటి ప్లేట్‌కి వెన్న రాసి లేదా అల్యూమినియం ఫాయిల్ పరిచి అవెన్ బౌల్‌ని బోర్లించి ముక్కలుగా కట్ చేయాలి.

మ్యాంగో మస్తానీ



కావలసినవి: మామిడి పండు ముక్కలు – అర కేజీ ; పాలు – పావు లీటరు (కాచి చల్లార్చాలి) ; చక్కెర – 2 లేదా 3 టేబుల్ స్పూన్‌లు (మామిడి తియ్యదనాన్ని బట్టి) ; పిస్తా – టేబుల్ స్పూన్ ; బాదం – పది (సన్నగా తరగాలి) ; జీడి పప్పు – 20 (వేయించుకోవచ్చు లేదా పచ్చిగానే వేసుకోవచ్చు) ; చెర్రీలు –5 ; వెనిల్లా ఐస్ క్రీమ్ – 4 స్కూప్‌లు.

తయారీ: ● రెండు టేబుల్ స్పూన్ల మామిడి ముక్కలను విడిగా తీసుకుని మిగిలిన ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో మెత్తగా గుజ్జు చేసుకోవాలి. అందులో పాలు, చక్కెర వేసి మరోసారి బ్లెండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని గ్లాసులో పోసి ఐస్ క్రీమ్ అర స్పూన్ వేయాలి. పైన బాదం, పిస్తా, జీడిపప్పు, చెర్రీలు, ముందుగా తీసి పక్కన ఉంచిన మామిడి ముక్కలను చిన్న ముక్కలుగా తరిగి అలంకరించాలి.

గమనిక: మ్యాంగో మస్తానీ చిక్కగా కావాలంటే మామిడి ముక్కలను ఓ గంట సేపు ఫ్రిజ్‌లో పెట్టి బ్లెండ్ చేసుకోవచ్చు లేదా పాలు, చక్కెర కలిపి బ్లెండ్ చేసిన తర్వాత సర్వ్ చేసే లోపు ఓ గంట సేపు ఫ్రిజ్ లో పెట్టవచ్చు. టైమ్ లేనప్పుడు గ్లాసులో ముప్పావు వంతు మ్యాంగో మస్తానీతో నింపి మూడు ఐస్ క్యూబ్‌లు వేసుకోవచ్చు.

మ్యాంగో కుల్ఫీ



కావలసినవి: మామిడి పండ్లు – 3 (పెద్దవి) ; వెన్నతీయని పాలు – 300 ఎం.ఎల్ ; కండెన్స్‌డ్ మిల్క్ – 200 ఎం.ఎల్ ; తాజా క్రీమ్– అర కప్పు ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; కుంకుమ పువ్వు– పది రేకలు.

తయారీ: ● మామిడి పండ్లను కడిగి చెక్కు, టెంక తొలగించి ముక్కలు చేయాలి. ● పాలను కాచి మీగడ తేలనివ్వకుండా తిరగబోస్తూ వెంటనే చల్లార్చాలి. ● క్రీమ్‌ని విడిగా చిలికి పక్కన పెట్టుకోవాలి. ● పాలు, మామిడి పండు ముక్కలు, కండెన్స్‌డ్ మిల్క్ కలిపి బ్లెండ్ చేయాలి. అందులో యాలకుల పొడి, కుంకుమ పువ్వు, చిలికిన క్రీమ్ వేసి మరోసారి తిప్పాలి. ● ఈ మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లలో పోసి, మూత పెట్టి ఫ్రీజర్ పెట్టాలి. ఎనిమిది గంటలకు కుల్ఫీ సెట్ అవుతుంది. ● తినడానికి పది నిమిషాల ముందు ఫ్రీజర్‌లో నుంచి బయటకు తీయాలి. వెంటనే తినాలంటే నీటి ధార కింద కుల్ఫీ మౌల్డ్‌ను ఉంచితే మౌల్డ్ నుంచి కుల్ఫీ విడివడుతుంది. ఒక ప్లేట్‌లోకి తీసుకుని చాకుతో స్లైస్‌లుగా కట్ చేసి సర్వ్ చేయాలి. ఇష్టమైతే కుల్ఫీ స్లైస్‌ల మీద మరికొంత యాలకుల పొడి, కుంకుమ పువ్వు చల్లుకోవచ్చు.

ఆటలు ఆడు కన్నా

హెల్దీ టాయ్స్

చీప్ ప్లాస్టిక్. చైనా ప్లాస్టిక్. ఇవాళ పిల్లల బొమ్మలు వీటితోనే దొరుకుతున్నాయి. కళాత్మకమైన దేశీయమైన చెక్కతో తయారైన బొమ్మలు పిల్లలకు ఉండాలి అని బొమ్మల కేంద్రం ప్రారంభించింది మీతా శర్మ. హార్వర్డ్‌లో చదువుకున్నా తన ఇద్దరు పిల్లలు ఆడుతున్న బొమ్మలను చూశాక ఆమె ఈ పని మొదలెట్టింది. ఇవాళ నెలకు వెయ్యి అర్డర్లు వస్తున్నాయి. 100 మంది బొమ్మల కళాకారులు ఉపాధి పొందుతున్నారు. పిల్లలు ఆమె బొమ్మలతో చక్కగా ఆడుకుంటున్నారు.

ఈసప్ కథల్లో 'కాకి దప్పిక' కథ పిల్లలందరికీ చెబుతారు. దప్పిక గొన్న కాకి కుండలో నీళ్లను తాగడానికి ప్రయత్నించి, అవి అందక పోతే నాలుగు రాళ్లు జారవిడిచి, నీళ్ల పైకి తేలాక తాగుతుంది. ఆ విధంగా ఆ కథ అవసరం అయినప్పుడు యుక్తిని ఎలా పాటించాలో పిల్లలకు చెబుతుంది. ఈ కథ యూట్యూబ్‌లో వీడియోగా సులభంగా దొరుకుతుంది. కాని మీతా శర్మ తయారు చేసే బొమ్మల్లో ఇదే కథ మొత్తం బుజ్జి బుజ్జి చెక్క బొమ్మల సెట్టుగా దొరుకుతుంది. పిల్లలను ఉద్రేక పరిచే ఆటబొమ్మల కంటే ఇలాంటి బొమ్మలే అవసరం అంటుంది 'షుమి' అనే బొమ్మల సంస్థను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్న మీతా శర్మ.



మీతా శర్మ

కంప్యూటర్ ఇంజనీర్

మీతా శర్మది ఢిల్లీ. అక్కడే ఐఐటీ లో బిటెక్ చేసింది. ఆ తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసింది. వివాహం అయ్యాక అమెరికాలోనే జీవితం మొదలెట్టింది. 'మా పెద్దాడు పుట్టాక అమెరికాలో క్వాలిటీ బొమ్మలు కొనిచ్చాను ఆడుకోవడానికి. అవన్నీ ఎకో ఫ్రెండ్లీ కొయ్యబొమ్మలు. పాడు కావు. హాని చేయవు. 2012 లో అమెరికా వద్దనుకుని ఇండియా వచ్చాక నాకు సమస్య ఎదురైంది. అప్పటికి నా రెండో కొడుక్కి రెండేళ్లు. ఇక్కడ వాడికి ఇద్దామంటే మంచి బొమ్మలే లేవు. అన్నీ ప్లాస్టిక్‌వి లేదా గాడ్జెట్స్, అమెరికన్ కామిక్స్‌లో ఉన్న కేరెక్టర్... ఇవే ఉన్నాయి. ఆ ప్లాస్టిక్ పిల్లలు నోటిలో పెట్టుకుంటే ప్రమాదం. మన చిన్నప్పుడు చెక్కతో తయారు చేసిన బుజ్జి బుజ్జి బొమ్మలు ఎంతో బాగుండేవి. అలాంటి బొమ్మల కోసం ఎంత వెతికినా దొరకడం లేదు. కొన్నిచోట్ల సంప్రదాయ బొమ్మలు ఉన్నాయి కాని వాటి మార్కెటింగ్ సరిగా లేదు. అందుకని నాకే ఒక బొమ్మల తయారీ సంస్థ ఎందుకు మొదలెట్టకూడదు అనిపించింది. 2016లో షుమి సంస్థను స్థాపించాను' అని తెలిపింది మీతా శర్మ.

వేప, మామిడి కలపతో

'నిజానికి సంస్థ స్థాపించడానికి పెట్టుబడి దొరకలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో అందరూ పిల్లల గేమ్స్ తయారు చేసే సంస్థలనే ప్రోత్సహించేవి. నా దారేమో సంప్రదాయ కలప బొమ్మల దారి. అందుకే సొంత పెట్టుబడితో సంస్థను స్థాపించాను. బొమ్మలు చేసే కళాకారులను సంప్రదించి కేవలం వేప, మామిడి కలపతో ముద్దొచ్చే బొమ్మలను ముఖ్యంగా రెండేళ్ల వయసున్న పిల్లల కోసం ఎక్కువ గా ఆ తర్వాత పదేళ్ల లోపున్న పిల్లలకోసం బొమ్మలను తయారు చేయించాను. వాటికి ఉపయోగించే రంగులు కూడా రసాయనాలు లేనివే' అంది మీతా శర్మ.

ఢిల్లీలో తన సంస్థను స్థాపించాక రకరకాల కొయ్యగుర్రాలను, మూడు చక్రాల తోపుడు బండ్లను, బుజ్జి గుడారాలను, పిల్లలు ఆడే వంట సామగ్రిని, వారికి కొద్దిపాటి లెక్కలు నేర్పే ఆట వస్తువులను, కథలను బొమ్మల్లో చెప్పే సెట్లను ఇలా తయారు చేయించింది. 'ఆన్‌లైన్‌లో మాకు ఆర్డర్లు వచ్చేవి. చాలామంది తల్లులు ఆ బొమ్మలతో ఐడెంటిఫై అయ్యారు. ఎందుకంటే వారంతా బాల్యంలో అలాంటి బొమ్మలతోనే ఆడారు కనుక. తమ పిల్లలకు సరిగ్గా అలాంటివే దొరకడంతో వారి ఆనందానికి హద్దులు లేవు' అని చెప్పిందామె.



ఇప్పుడు మీతా తయారు చేయిస్తున్న బొమ్మలు అమెరికా, యు.కె, సింగపూర్‌కు కూడా రవాణా అవుతున్నాయి. నెలలో 8000 ఆన్లైన్ ఆర్డర్లు వస్తున్నాయి. 100 మంది కళాకారులు చేతి నిండా పనితో ఉపాధి పొందుతున్నారు.

ఆటే పరిశోధన

'పిల్లల అసలైన పరిశోధన వారు ఆడే ఆటలతోనే మొదలవుతుందని పిల్లల మనస్తత్వ నిపుణులు తెలుపుతారు. పిల్లల్ని పిల్లల్లా ఉంచే ఆటబొమ్మలతో వారిని ఆడనివ్వాలి. హింసాత్మకమైన బొమ్మల నుంచి వారిని దూరం పెట్టాలి. హింసను ప్రేరేపించే గేమ్స్ నుంచి కూడా. పిల్లలు బొమ్మలతో స్నేహం చేసి వాటిని పక్కన పెట్టుకుని భయం లేకుండా నిద్రపోతారు. వారికి బాల్యం నుంచి అలాంటి నిశ్చింతనిచ్చే బొమ్మల వైపుకు నడిపించాలి' అని సలహా ఇస్తోంది మీతా.

ఒక ఉద్యోగిగా కంటే తల్లిగా ప్రయోజనాత్మక అంట్రప్రెన్యూర్‌గా ఆమె ఎక్కువ సంతృప్తిని, గౌరవాన్ని, ఆదాయాన్ని పొందుతోంది. అదీ విజయమేగా.

బోరిస్ గెల్ఫాండ్‌పై అర్జున్ గెలుపు



టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. స్వీడన్‌లో గురువారం మొదలైన ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లు జరుగుతాయి. తొలి రౌండ్‌లో 19 ఏళ్ల అర్జున్ 41 ఎత్తుల్లో ఇజ్రాయెల్ గ్రాండ్‌మాస్టర్ బోరిస్ గెల్ఫాండ్‌పై గెలుపొందాడు. 54 ఏళ్ల గెల్ఫాండ్ 2012 ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో విశ్వనాథన్ ఆనంద్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు.

లిటన్ దాస్ స్థానంలో చార్లెస్



కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ జాన్సన్ చార్లెస్ చేరనున్నాడు. బంగ్లా ఆటగాడు లిటన్‌దాస్ కుటుంబసభ్యుల ఆరోగ్య అత్యవసర పరిస్థితి దృష్ట్యా స్వదేశం పయనమయ్యాడు. దీంతో మిగతా సీజన్ కోసం అతని స్థానంలో చార్లెస్‌ను రూ.50 లక్షల కనీస ధరకు కోల్‌కతా తీసుకుంది. విండీస్ తరఫున 41 అంతర్జాతీయ టి20లు ఆడిన అతను 971 పరుగులు చేశాడు. 2012, 2016 టి20 ప్రపంచకప్‌లు గెలిచిన కరీబియన్ జట్టులో చార్లెస్ సభ్యుడుగా ఉన్నాడు.

ఫైనల్లో బోపన్న జోడీ



మాడ్రిడ్: ఈ సీజన్‌లో తమ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ నాలుగో టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో భాగంగా గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 5–7, 7–6 (7/3), 10–4తో 'సూపర్ టైబ్రేక్'లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీని ఓడించింది. మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో బోపన్న ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 2015లో ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన బోపన్న, 2016లో రన్నరప్‌గా నిలిచాడు. ఏడేళ్ల తర్వాత మరోసారి ఈ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఈ సీజన్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో, దోహా ఓపెన్‌లో టైటిల్ సాధించి, రోటర్‌డామ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది.

మళ్లీ పాక్‌దే గెలుపు

12 ఏళ్ల తర్వాత కివీస్‌పై వన్డే సిరీస్ సొంతం



కరాచీ: వరుసగా మూడో వన్డేలోనూ గెలుపొందిన పాకిస్తాన్ రెండు మ్యాచ్‌లుండగానే 3–0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో వన్డేలో పాక్ 26 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై నెగ్గింది. తద్వారా 12 ఏళ్ల అనంతరం కివీస్‌పై పాక్ వన్డే సిరీస్‌ను దక్కించుకుంది. మొదట పాకిస్తాన్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. ఓపెనర్ ఇమామ్ ఉల్ హఖ్ (107 బంతుల్లో 90; 7 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ అజమ్ (62 బంతుల్లో 54; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. కివీస్ బౌలర్లలో హెన్రీ 3, మిల్నే 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 49.1 ఓవర్లలో 261 పరుగులకు కుప్పకూలింది. బ్లన్‌డేల్ (78 బంతుల్లో 65; 7 ఫోర్లు), యంగ్ (41 బంతుల్లో 33; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 83 పరుగుల శుభారంభం ఇచ్చినప్పటికీ వరుస విరామాల్లో కీలకమైన వికెట్లను కోల్పోయి లక్ష్యానికి దూరమైంది. షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, వసీమ్ తలా 2 వికెట్లు తీశారు.

కోల్‌కతా ప్రతీకారం

- ఉత్కంఠ పోరును జయించిన నైట్‌రైడర్స్
- 5 పరుగులతో సన్‌రైజర్స్ ఓటమి

సన్‌రైజర్స్ విజయానికి ఒకదశలో 30 బంతుల్లో 38 పరుగులే కావాలి... చేతిలో 5 వికెట్లు ఉన్నాయి. కెప్టెన్ మార్క్‌రమ్ కూడా అప్పుడే జోరు పెంచాడు... సొంత గడ్డపై గెలుపు ఖాయమనిపించింది. కానీ అంతా తలకిందులైంది. ఓటమి దిశగా వెళుతున్న కోల్‌కతా ఒక్కసారిగా పుంజుకుంది. పదునైన బౌలింగ్‌తో పరుగులు ఇవ్వకుండా కట్టడి చేసి చివరి వరకు ఆటను తీసుకొచ్చింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి వేసిన ఆఖరి ఓవర్లో 9 పరుగులు చేయాల్సి ఉండగా 3 పరుగులే వచ్చాయి. దాంతో నైట్‌రైడర్స్ ఊపిరి పీల్చుకోగా, రైజర్స్ నిరాశలో మునిగింది.

సాక్షి, హైదరాబాద్: ఈడెన్ గార్డెన్స్‌లో ఎదురైన పరాజయానికి ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ప్రతీకారం తీర్చుకుంది. గురువారం జరిగిన ఈ ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా 5 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. రింకూ సింగ్ (35 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ రాణా (31 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 166 పరుగులే చేయగలిగింది. మార్క్‌రమ్ (40 బంతుల్లో 41; 4 ఫోర్లు), క్లాసెన్ (20 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించినా ఫలితం దక్కలేదు.



వరుణ్ చక్రవర్తి



రింకూ సింగ్

కీలక భాగస్వామ్యం...

ఒక్కరూ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడకపోయినా... కీలక ఆటగాళ్లంతా తలా ఓ చేయి వేయడంతో కోల్‌కతా చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగింది. మార్కో జాన్సెన్ తన తొలి ఓవర్లోనే గుర్బాజ్ (0), వెంకటేశ్ అయ్యర్ (7)లను అవుట్ చేసి ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. జేసన్ రాయ్ (19 బంతుల్లో 20; 4 ఫోర్లు) కూడా ధాటిగా ఆడటంలో విఫలమయ్యాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 43 పరుగులకు చేరింది. ఈ దశలో కెప్టెన్ రాణా, రింకూ కీలక భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 40 బంతుల్లో 61 పరుగులు జోడించారు. కార్తీక్ త్యాగి ఓవర్లో వరుస బంతుల్లో 4, 6, 6తో రాణా దూకుడు ప్రదర్శించాడు. అయితే మార్క్‌రమ్ అద్భుత క్యాచ్‌కు రాణా వెనుదిరగ్గా... ఆండ్రీ రసెల్ (15 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ఎక్కువసేపు నిలవలేదు. సన్‌రైజర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇన్నింగ్స్ చివర్లో కూడా కేకేఆర్ ఆశించినన్ని పరుగులు చేయలేకపోయింది. ఆఖరి 5 ఓవర్లలో ఆ జట్టు 42 పరుగులే సాధించింది.

క్లాసెన్ మెరిసినా...

ఛేదనలో రైజర్స్ కూడా తడబడింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్ (18), అభిషేక్ శర్మ (9)లతో పాటు తక్కువ వ్యవధిలో రాహుల్ త్రిపాఠి (9 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (0) వికెట్లను జట్టు కోల్పోయింది. అయితే మార్క్‌రమ్, క్లాసెన్ భాగస్వామ్యం ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. చక్కటి షాట్లతో, సమన్వయంతో వీరిద్దరు పరుగులు రాబట్టారు. తన తొలి ఫోర్ కొట్టేందుకు మార్క్‌రమ్ 23 బంతులు తీసుకున్నా... అనుకూల్ రాయ్ ఓవర్లో రెండు సిక్సర్లతో క్లాసెన్ దూకుడు ప్రదర్శించాడు. ఐదో వికెట్‌కు 47 బంతుల్లో 70 పరుగులు జోడించిన అనంతరం క్లాసెన్ వెనుదిరిగాడు. అయితే మార్క్‌రమ్ క్రీజ్‌లో ఉన్నంత వరకు రైజర్స్ గెలుపుపై ధీమాగానే ఉంది. 20 బంతుల్లో 27 పరుగులు చేయాల్సిన స్థితిలో కెప్టెన్ వెనుదిరిగారు. తర్వాతి బ్యాటర్లు మిగిలిన పనిని పూర్తి చేయలేకపోయారు. సమద్ (18 బంతుల్లో 21; 3 ఫోర్లు) కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	9	6	3	0	12	0.532
లక్నో	10	5	4	1	11	0.639
చెన్నై	10	5	4	1	11	0.329
రాజస్తాన్	9	5	4	0	10	0.800
బెంగళూరు	9	5	4	0	10	-0.030
ముంబై	9	5	4	0	10	-0.373
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
హైదరాబాద్	9	3	6	0	6	-0.540
ఢిల్లీ	9	3	6	0	6	-0.768

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) కార్తీక్ త్యాగి 20; గుర్బాజ్ (సి) బ్రూక్ (బి) జాన్సెన్ 0; వెంకటేశ్ అయ్యర్ (సి) క్లాసెన్ (బి) జాన్సెన్ 7; నితీశ్ రాణా (సి అండ్ బి) మార్క్‌రమ్ 42; రింకూ సింగ్ (సి) సమద్ (బి) నటరాజన్ 46; రసెల్ (సి) నటరాజన్ (బి) మార్కండే 24; నరైన్ (సి) మయాంక్ అగర్వాల్ (బి) భువనేశ్వర్ 1; శార్దుల్ ఠాకూర్ (సి) సమద్ (బి) నటరాజన్ 8; అనుకూల్ రాయ్ (నాటౌట్) 13; హర్షిత్ (రనౌట్) 0; వైభవ్ అరోరా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–8, 2–16, 3–35, 4–96, 5–127, 6–130, 7–151, 8–168, 9–168. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–33–1, జాన్సెన్ 3–0–24–2, కార్తీక్ త్యాగి 2–0–30–1, మార్క్‌రమ్ 3–0–24–1, నటరాజన్ 4–0–30–2, మార్కండే 4–0–29–1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) రసెల్ (బి) శార్దుల్ ఠాకూర్ 9; మయాంక్ అగర్వాల్ (సి) గుర్బాజ్ (బి) హర్షిత్ 18; రాహుల్ త్రిపాఠి (సి) వైభవ్ అరోరా (బి) రసెల్ 20; మార్క్‌రమ్ (సి) రింకూ సింగ్ (బి) వైభవ్ అరోరా 41; హ్యారీ బ్రూక్ (ఎల్బీ) (బి) అనుకూల్ రాయ్ 0; క్లాసెన్ (సి) రసెల్ (బి) శార్దుల్ ఠాకూర్ 36; సమద్ (సి) అనుకూల్ రాయ్ (బి) వరుణ్ చక్రవర్తి 21; జాన్సెన్ (సి) గుర్బాజ్ (బి) వైభవ్ అరోరా 1; భువనేశ్వర్ (నాటౌట్) 5; మార్కండే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1–29, 2–37, 3–53, 4–54, 5–124, 6–145, 7–152, 8–165. **బౌలింగ్:** హర్షిత్ 4–0–27–1, వైభవ్ 3–0–32–2, శార్దుల్ 3–0–23–2, రసెల్ 1–0–15–1, అనుకూల్ రాయ్ 3–0–26–1, నరైన్ 2–0–16–0, వరుణ్ చక్రవర్తి 4–0–20–1.

ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో కేసు ముగిస్తున్నాం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న రెజ్లర్ల డిమాండ్ నెరవేరడంతో కేసును ముగిస్తున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్‌భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. కానీ సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో ఆయనను అరెస్టు చేయలేకపోయామని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం తమకు ఎదురుదెబ్బ కాదని, బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని బజరంగ్, వినేశ్, సాక్షి స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఢిల్లీ హైకోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించిందని దీనిని కూడా పరిశీలిస్తామని వినేశ్ తెలిపింది.

నరేందర్ ముందుకు...

శివ థాపాకు చుక్కెదురు



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. నరేందర్ బెర్వాల్ (ప్లస్ 92 కేజీలు), గోవింద్ సహాని (48 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... దీపక్ కుమార్ (51 కేజీలు) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అయితే స్టార్ బాక్సర్ శివ థాపా పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. తొలి రౌండ్ బౌట్‌లలో నరేందర్ 4–1తో మొహమ్మద్ అబ్రోరిదినోవ్ (తజికిస్తాన్)పై, గోవింద్ 5–0తో మెహ్రోన్ షఫియెవ్ (తజికిస్తాన్)పై, దీపక్ 5–0తో లూయిస్ డెల్గాడో (ఈక్వెడోర్)పై విజయం సాధించారు. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన శివ థాపా ఈసారి మాత్రం నిరాశపరిచాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్‌లో బరిలోకి దిగిన శివ థాపా 3–4తో డోస్ రెస్ యరీ (బ్రెజిల్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో భారత బాక్సర్లు హుసాముద్దీన్ (57 కేజీలు), ఆశిష్ చౌదరీ (80 కేజీలు), నవీన్ (92 కేజీలు) పోటీపడతారు.

సినిమా



చిరంజీవి



సిద్ధు జొన్నలగడ్డ

కాంబినేషన్ సెట్?

హీరో చిరంజీవి, దర్శకుడు కల్యాణ్ కృష్ణ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఆల్రెడీ చిరంజీవికి కల్యాణ్ కృష్ణ ఓ కథ వినిపించారట. ఈ స్క్రిప్ట్ చిరంజీవికి నచ్చిందని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే ఈ సినిమా కథ రీత్యా ఓ కుర్ర హీరోకి కీలక పాత్రలో నటించేందుకు స్కోప్ ఉందట. ఈ కుర్ర హీరో పాత్రకు సిద్ధు జొన్నలగడ్డ అయితే బాగుంటుందని చిత్ర యూనిట్ భావిస్తోందని, ఆల్రెడీ సంప్రదింపులు జరిగాయని భోగట్టా. త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే.. చిరంజీవి టైటిల్ రోల్‌లో మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'భోళా శంకర్' ఆగస్టు 11న విడుదల కానున్న విషయం తెలిసిందే.



రజనీకాంత్

ఆగస్టులో ఫిక్స్

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించిన ఓ అప్‌డేట్‌ను గురువారం చిత్ర యూనిట్ ఇచ్చింది. ఆగస్టు 10న 'జైలర్'ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, ఓ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వీడియోలో కారులో నుంచి స్టైల్‌గా దిగుతున్న రజనీకాంత్ లుక్ ఆకట్టుకుంటోంది. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు పూర్తి భిన్నంగా థ్రిల్లర్ తరహాలో ఈ సినిమా తెరకెక్కుతోందని కోలీవుడ్ టాక్. శివరాజ్‌కుమార్, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, తమన్నా, సునీల్, ప్రియాంక అరుల్ మోహన్, మిర్నా మీనన్ తదితరులు ముఖ్య పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

ఉగ్రం నా కెరీర్ హయ్యస్ట్ గ్రాసర్ ఫిల్మ్ అవుతుంది

- 'అల్లరి' నరేశ్



సాహు, విజయ్, 'అల్లరి' నరేశ్, హరీష్

"నేను పోలీసాఫీసర్‌గా చేసిన 'కత్తి కాంతారావు', 'బ్లేడ్ బాబ్జీ' చిత్రాలు విజయాలు సాధించాయి. అయితే ఇవి కామెడీ చిత్రాలు. కాగా నేను సీరియస్ పోలీస్ పాత్ర చేసిన 'ఉగ్రం' సినిమా కూడా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. 'ఉగ్రం' నా కెరీర్‌లో హయ్యస్ట్ గ్రాసర్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు 'అల్లరి' నరేశ్. 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఉగ్రం'. హరీష్ పెద్ది, సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''గతంలో నేను చేసిన ఫైట్స్ నవ్వించడం కోసం... ఈ సినిమాలో ఎమోషన్ కోసం యాక్షన్ సీన్స్ చేశాను'' అన్నారు. ''నాంది' సినిమాకు మూడురెట్ల వసూళ్లు 'ఉగ్రం' సినిమా రాబడుతుందనే నమ్మకం ఉంది'' ఉన్నారు విజయ్ కనకమేడల. ''భారతదేశ వ్యాప్తంగా మిస్సింగ్ కేసులు నమోదు అవుతున్నాయి. మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో మనకన్నా ఎక్కువ మిస్సింగ్స్ ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. పక్కా ఆధారాలతో వాస్తవ ఘటనలను బేస్ చేసుకుని 'ఉగ్రం' కథ రెడీ చేశాం'' అన్నారు రచయిత వెంకట్.

> కామెడీ సినిమాలు చేయడానికి నేను సిద్ధమే. నా తర్వాతి సినిమా కామెడీ జానర్‌లోనే ఉంటుంది. అయితే కొందరు నాకు కామెడీ కథలు చెప్పేటప్పుడు వాళ్లకు వాళ్లే ఎగ్జయిట్ అయ్యి, నవ్వేసుకుంటున్నారు. నాకు నవ్వు రావడం లేదు. ఆడియన్స్ ఆర్గానిక్ కామెడీని ఇష్టపడుతున్నారు. ఇప్పుడు నేను 'కితకితలు' సినిమా చేస్తే బాడీ షేమింగ్ అని తిడతారు. కుటుంబసమేతంగా చూసే కామెడీ సినిమాలు తీయాలన్నప్పుడు అందులో అసభ్య పదజాలం, డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉండకూడదు. చెప్పాలంటే కామెడీ సినిమాల రైటర్స్ తగ్గిపోయారు.
> **- 'అల్లరి' నరేశ్**

ఫారిన్‌లో ఫైట్



వరుణ్ తేజ్

ఫారిన్ ఫైట్ చేయడానికి రెడీ అవుతున్నారు వరుణ్ తేజ్. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గాండీవధారి అర్జున'. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ బుడాపెస్ట్‌లో ఆరంభం కానుంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ ఫైట్ సీక్వెన్స్ కోసం వరుణ్ తేజ్ ప్రస్తుతం ప్రిపేర్ అవుతున్నారు.

అంతం కాదిది...



జేడీ చక్రవర్తి, సిరాజ్

ఇషాన్, ప్రణాళి, 'రాకెట్' రాఘవ, ప్రవీణ్, 'కరాటే' కళ్యాణి, గీతా సింగ్, నాగ మహేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతం కాదిది ఆరంభం'. ఇషాన్ దర్శకత్వంలో ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన జేడీ చక్రవర్తి మాట్లాడుతూ– ''టైటిల్‌ని బట్టి ఇది మంచి సినిమా అని నమ్ముతున్నాను. ఈ చిత్రం విజయం సాధించి యూనిట్‌కి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది.

తరాలు మారినా ఎమోషన్స్ మారలేదు

- గోపీచంద్

"వందేళ్ల క్రితం అమ్మను 'అమ్మ' అనే పిలిచాం. ఇప్పుడూ అమ్మా అనే పిలుస్తాం. తరాలు మారినా ఎమోషన్స్ మారలేదు. అలాగే సినిమాల విషయంలో ఆడియన్స్ మారలేదు. సరైన కంటెంట్ ఇస్తే ఆడియన్స్ సినిమాలు చూస్తున్నారు. అయితే కథలో ఆడియన్స్‌ను మనం ఎంతవరకు ఇన్‌వాల్వ్ చేయగలుగుతున్నాం అన్నదే ముఖ్యం. వారు కనెక్ట్ అయ్యే ఏ జానర్ సినిమా తీసినా వాటిని ఆదరిస్తారు" అన్నారు హీరో గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో గోపీచంద్ చెప్పిన విశేషాలు....



- ఈ మధ్య నేను ఎక్కువగా యాక్షన్ చిత్రాలే చేశాను. ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉన్న సినిమా చేయాలని అనుకుంటున్నప్పుడు భూపతిరాజా గారు చెప్పిన కథ, అందులోని బ్రదర్ ఎమోషన్స్ నచ్చడంతో 'రామబాణం' సినిమా చేశాం. హిట్ చిత్రాలు 'లక్ష్యం', 'లౌక్యం'ల తర్వాత శ్రీవాస్, నేను మరో సినిమా చేయాలని 'రామబాణం' చేయలేదు. కథ కుదిరింది కాబట్టి చేశాం.
- 'రామబాణం' అన్నదమ్ముల కథ. ఇద్దరి స్వభావం ఒకటే. కానీ ఎంచుకున్న దారులు వేరు. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కమర్షియల్ హంగులు జోడించి ఈ సినిమా చేశాం. అలాగే అంతర్లీనంగా ఓ సందేశం కూడా ఉంది. ఓ సమస్యను మనం కొన్నేళ్లు పట్టించుకోకుండా ఉంటే దాని దుష్ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. అప్పుడు బాధ పడతాం. ఈ విషయాన్నే 'రామబాణం'లో చూపించాం.
- 'లక్ష్యం' సినిమాలో జగపతిబాబుగారితో స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఆ సినిమాలో అన్నదమ్ముల్లా నటించిన మేం 'రామబాణం'లోనూ అన్నదమ్ముల్లా నటించాం. ఈ సినిమాలో జగపతిబాబుగారిది కీలక పాత్ర. హీరోగా నా క్యారెక్టర్ పెంచేసి, ఆయన క్యారెక్టర్‌ను తగ్గించడం అనేది కరెక్ట్ కాదు. ఎందుకంటే సినిమాకు కథే హీరో. కథే సినిమాను నడిపించాలి.
- టీజీ విశ్వప్రసాద్ గారు మంచి నిర్మాత. ఇండస్ట్రీలో అతి మంచితనం మంచిది కాదని నేను ఆయనకు చెప్పాను. ఎందుకంటే ఆయన చాలా సినిమాలు చేస్తున్నారు. అలాంటి వారు ఇండస్ట్రీలో ఉంటే చాలా మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- ప్రస్తుతం కన్నడ దర్శకుడు హర్షతో ఓ సినిమా చేస్తున్నాను. ఆ తర్వాత దర్శకులు శ్రీను వైట్ల, తేజగార్లతో సినిమాలు ఉంటాయి.

> గతంలో నేను 'ఒక్కడున్నాడు', 'సాహసం' వంటి విభిన్నమైన సినిమాలు చేశాను. ఆ సినిమాలు ఇప్పుడు వచ్చి ఉంటే హిట్ అయ్యేవి. అయితే ఆ తరహా సినిమాల్లో నాకు నటించాలని ఉన్నా సరైన కథలు దొరకడం లేదు.

> హిట్ సినిమాలు అందించాలనే ఒత్తిడి నాకే కాదు... ప్రతి హీరోకూ ఉంటుంది. ఎందుకంటే ఓ సినిమా ఫలితంపై ఎన్నో కుటుంబాలు (ముఖ్యంగా బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్స్‌ని ఉద్దేశిస్తూ..) ఆధారపడి ఉంటాయి. అయితే కొన్నిసార్లు హిట్ అవుతాయని మేం భావించిన సినిమాలు సరైన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. తప్పులను విశ్లేషించుకుని అవి రిపీట్ కాకుండా చూసుకోవాలి. నాకు వచ్చిన ప్రతి రోల్‌ని డ్రీమ్ రోల్‌లా భావిస్తాను.

> నా కెరీర్ స్టార్టింగ్‌లో 'జయం', 'నిజం', 'వర్షం' చిత్రాల్లో విలన్ రోల్స్ చేశాను. ఇండస్ట్రీలో ముందు నన్ను నిలబెట్టింది విలన్ రోల్సే. ప్రభాస్ సినిమాలో విలన్ పాత్ర చేయడానికి సిద్ధంగానే ఉన్నాను. అయితే కథ, అందులోని విలన్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉండాలి.

సామాజిక బాధ్యతతో...

వినోద్ హీరోగా, రిచా కర్లా, ధరణి రెడ్డి హీరోయిన్లుగా రవికుమార్ గోనుగుంట దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మహిషాసురుడు'. అనిరుధ్, అపరాజిత సమర్పణలో ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎస్. గురుప్రసాద్ నిర్మించారు. సాకేత్ సాయిరామ్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, డైరెక్టర్ రేలంగి నరసింహారావు, నటులు తనికెళ్ల భరణి, గౌతం రాజు విడుదల చేశారు. ఎస్. గురుప్రసాద్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ప్రధాన పాత్ర చేశాను. కోట్లాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు మన దేశంలోనే వాటిని తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో వైద్యం అందించవచ్చనే పాయింట్‌తో ఈ సినిమా తీశాం'' అన్నారు. ''సామాజిక బాధ్యతతో గురుప్రసాద్ ఈ సినిమా నిర్మించాలనుకున్నారు'' అన్నారు రవికుమార్ గోనుగుంట.



రిచా, గురుప్రసాద్

గాలుల్లోన...



సుధీర్‌బాబు, ఈషా రెబ్బా

సుధీర్ బాబు హీరోగా రూపొందిన చిత్రం 'మామా మశ్చీంద్ర'. నటుడు, దర్శకుడు హర్షవర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా కథానాయికలు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గాలుల్లోన...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను కపిల్ కపిలన్, నూతన మోహన్ పాడారు. ''ఈ చిత్రంలో మూడు పాత్రల్లో కనిపించనున్నారు సుధీర్ బాబు. 'గాలుల్లోన...' అనే పాటలో దుర్గ, డీజే పాత్రల్లో ఆకట్టుకుంటారాయన. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సర్పంచ్‌లకు అంకితం



శంకర్ నాయక్

రజినీ కుమార్, జీవన్ కుమార్ హీరోలుగా, సపాన్స్ హీరోయిన్‌గా కొర్ర శంకర్ నాయక్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అయ్యో పాపం'. ప్రసాద్ రాజు ముప్పాల నిర్మాత. సంగీత దర్శకుడు భాను స్వరపరచిన ఈ చిత్రంలోని 'మా మంచి సర్పంచి మా శంకరన్న.. మాట తప్పని వాడు మన శంకరన్న..' పాటని విడుదల చేశారు. కొర్ర శంకర్ నాయక్ మాట్లాడుతూ– ''తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అయ్యో పాపం'. తెలంగాణలో 12,000, ఆంధ్రప్రదేశ్‌లో 13,000 మంది సర్పంచ్‌ల సాధకబాధకాల ఇతివృత్తంగా రాసిన ఈ పాటని సర్పంచ్‌లకు అంకితం చేస్తున్నాం'' అన్నారు. ''సమాజంలో, కుటుంబాల్లో జరుగుతున్న ఘటనల నేపథ్యంలో రూపొందుతోన్న సందేశాత్మక చిత్రం ఇది'' అన్నారు రజినీ కుమార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో — ముంబై
సెన్సెక్స్ ▲ 556 61,749	నిఫ్టీ ▲ 166 18,256	నాస్‌డాక్	12,011	▽ 14	బంగారం (99.9 గ్రాములు) 61,646 ▲ 602
		డోజోన్స్	33,145	▽ 269	బంగారం (99.5 గ్రాములు) 61,400 ▲ 600
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,703	▽ 86	వెండి (కిలో) 76,464 ▲ 1,182
		డాక్స్	15,134	▽ 81	
		షాంఘై	3,350	▲ 27	
		నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	▲ 35	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

అంచనాలను మించిన హెచ్‌డీఎఫ్‌సీ

- నికర లాభంలో 20 శాతం వృద్ధి
- జూలై చివరికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో విలీనం



ముంబై: గృహ రుణాల్లో అగ్రగామి సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ మార్చి త్రైమాసికానికి బలమైన పనితీరు నమోదు చేసింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 20 శాతం వృద్ధితో రూ.4,425 కోట్లకు చేరింది. ఇది విశ్లేషకుల అంచనాలను మించి నమోదైంది. విశ్లేషకులు రూ.3,900 కోట్ల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేశారు. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.3,700 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 16 శాతం వృద్ధితో రూ.5,321 కోట్లకు దూసుకుపోయింది. నికర వడ్డీ మార్జిన్ 3.7 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి ఇది రూ.4,601 కోట్లుగా ఉంది. 2022–23 సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.44ను మధ్యంతర డివిడెండ్‌గా ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది. ఆర్‌బీఐ రేట్ల పెంపుతో నికర వడ్డీ ఆదాయంపై ప్రభావం పడినట్టు తెలిపింది. ఇక, 2022–23 ఆర్థిక సంవత్సరానికి స్టాండలోన్ నికర లాభం 18 శాతం వృద్ధితో రూ.16,239 కోట్లకు చేరింది. వసూళ్లు లేని నికర రుణాల నిష్పత్తి క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 1.91 శాతం నుంచి 1.18 శాతానికి తగ్గింది.

దండిగా నిధులు..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో హెచ్‌డీఎఫ్‌సీ విలీనం జూలై చివరికి పూర్తి అవుతుందని హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్, సీఈవో కేకీ మిస్త్రీ తెలిపారు. తాము ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఉండాల్సిన దాని కంటే ఎక్కువే స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో నిర్వహిస్తున్నామని, అవసరానికంటే ప్రభుత్వ సెక్యూరిటీల్లో 128 శాతం పెట్టుబడులు ఉన్నట్టు చెప్పారు. అదనపు నిధుల విలీనం విషయంలో సానుకూలంగా పనిచేస్తాయని కేకీ మిస్త్రీ తెలిపారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం రెట్టింపు

క్యూ4లో రూ. 722 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 722 కోట్లను దాటింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 304 కోట్లు ఆర్జించింది. ప్రధానంగా విమానాశ్రయాలు, రహదారుల బిజినెస్‌లు లాభాల్లో వృద్ధికి దోహదం చేశాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 25,142 కోట్ల నుంచి రూ. 31,716 కోట్లకు జంప్ చేసింది. 7 ఎయిర్‌పోర్టులలో ప్రయాణికుల సంఖ్య 74 శాతం ఎగసి 21.4 మిలియన్లను తాకగా.. కార్గో 14 శాతం బలపడింది. ఈ బాటలో రహదారులు, మైనింగ్ బిజినెస్‌లు లాభదాయకతకు సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. దేశీయంగానేకాకుండా, ప్రపంచ స్థాయిలో విజయవంతమైన వ్యాపారాభివృద్ధికి కంపెనీ ప్రతీకగా అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ పేర్కొన్నారు. నిర్వహణ, ఆర్థిక పటిష్టతకు గతేడాది ఫలితాలు కొలమానమని విశ్లేషించారు. పాలన, నిబంధనల అమలు, పనితీరు, నగదు ఆర్జనలపై ప్రత్యేక దృష్టి కొనసాగుతుందని తెలియజేశారు. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం అదానీ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభం 218 శాతం దూసుకెళ్లి రూ. 2,473 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 96 శాతం జంప్‌చేసి రూ. 1,38,175 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) రెట్టింపునకుపైగా వృద్ధితో రూ. 10,025 కోట్లయ్యింది. ఎయిర్‌పోర్ట్స్‌లో ప్రయాణికుల సంఖ్య 74.8 మిలియన్లకు చేరింది. 2023 మార్చికల్లా కంపెనీ స్థూల రుణభారం రూ. 41,024 కోట్ల నుంచి తగ్గి రూ. 38,320 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 4.7 శాతం జంప్‌చేసి రూ. 1,925 వద్ద ముగిసింది.

ఈ-స్కూటర్ కస్టమర్లకు చార్జర్ డబ్బు వాపస్

తిరిగివ్వనున్న ఓలా ఎలక్ట్రిక్, ఏథర్



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాలతో పాటు చార్జర్లను విడిగా కొనుగోలు చేసిన కస్టమర్లకు సదరు చార్జర్ల డబ్బును వాపసు చేయనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్, ఎథర్ ఎనర్జీ తెలిపాయి. ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. స్వార్థ శక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినప్పటికీ విద్యుత్ వాహనాల పరిశ్రమ గత కొన్నాళ్లుగా అసాధారణంగా వృద్ధి చెందినట్లు సోషల్ మీడియా సైట్ ట్విటర్‌లో ఓలా పేర్కొంది. ఈ నేపథ్యంలో కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన కస్టమర్లందరికీ చార్జర్ల డబ్బును తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది. అయితే, ఎంత మొత్తం చెల్లించనున్నదీ మాత్రం వెల్లడించలేదు. ఇది సుమారు రూ. 130 కోట్లు ఉండొచ్చని అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఈవీ స్కూటర్లతో కలిపే చార్జర్లను విక్రయించే అంశంపై భారీ పరిశ్రమల శాఖతో కొన్నాళ్లుగా చర్చలు జరుపుతున్నట్లు ఎథర్ ఎనర్జీ తెలిపింది. చట్టబద్ధంగా ఇలా చేయాల్సిన అవసరం లేనప్పటికీ వాహనాలతో పాటే చార్జరును కూడా ఇచ్చేలా తమ నిబంధనలు మార్చుకున్నట్లు వివరించింది. అలాగే 2023 ఏప్రిల్ 12కు ముందు కొనుగోలు చేసిన వాహనాల విషయంలో చార్జర్లకు వసూలు చేసిన మొత్తాన్ని రిఫండ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఇదే తరహాలో టీవీఎస్ మోటార్ కంపెనీ తాము రూ. 20 కోట్లు పైచిలుకు వాపసు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

సూచీలకు మళ్లీ లాభాలు

- నష్టాలు ఒకరోజుకే పరిమితం
- ఫెడ్ నుంచి సానుకూల సంకేతాలు
- ఫైనాన్స్, మెటల్ షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 18,250 పైకి నిఫ్టీ



ముంబై: ఒక రోజు నష్టాల ముగింపు తర్వాత దేశీయ స్టాక్ సూచీలకు గురువారం మళ్లీ లాభాలొచ్చాయి. వడ్డీ రేట్ల పెంపు ఈ దఫా చివరిది కావచ్చంటూ ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన కమిటి నుంచి సంకేతాలు వెలువడ్డాయి. ఇటీవల విడుదలైన దేశీయ కార్పొరేట్ మార్చి త్రైమాసిక ఫలితాలు మెప్పించాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 1% వరకు బలపడి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 65 పాయింట్లు పెరిగి 61,258 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 605 పాయింట్లు ర్యాలీ చేసి 61,797 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 556 పాయింట్ల లాభంతో 61,749 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 177 పాయింట్లు దూసుకెళ్లి 18,267 గరిష్టాన్ని తాకింది. చివరికి 166 పాయింట్లు బలపడి 18,256 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో ఒక్క ఎఫ్‌ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.83%, 0.82% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1415 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.442 కోట్ల షేర్లను కొన్నారు. బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం విలువ రూ.2.21 లక్షల కోట్లు పెరిగి 275.13 లక్షల కోట్లకు చేరింది. ఆసియాలో షాంఘై, హాంగ్‌కాంగ్ సూచీలు లాభపడగా., కొరియా ఇండెక్స్ నష్టపోయింది. ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో యూరప్ మార్కెట్లు 0.50 – 1% క్షీణించాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ సర్వీస్ 'బై' రేటింగ్‌తో ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో షేరు 3% పైగా లాభపడి రూ.65.63 వద్ద స్థిరపడింది.
- మార్చి త్రైమాసికంలో నికరలాభం 13% బజాజ్ కన్జూమర్ కేర్ షేరు నాలుగుశాతం పెరిగి రూ.172 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో పదిశాతం దూసుకెళ్లి రూ.182 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- అంచనాలకు మించి మార్చి క్వార్టర్ ఫలితాలను ప్రకటించడంతో ఏబీబీ షేరు ఐదున్నర శాతం బలపడి రూ.3,646 వద్ద స్థిరపడింది.

హీరో మోటోకార్ప్ లాభం జూమ్

షేరుకి రూ. 35 డివిడెండ్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 31% జంప్‌చేసి రూ. 811 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో రూ. 621 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,628 కోట్ల నుంచి రూ. 8,672 కోట్లకు జంప్ చేసింది. షేరుకి రూ.35 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం కంపెనీ నికర లాభం రూ. 2,329 కోట్ల నుంచి రూ.2,800 కోట్లకు ఎగసింది. ఆదాయం సైతం రూ. 30,106 కోట్ల నుంచి రూ. 34,727 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 53.29 లక్షల వాహనాలు విక్రయించింది. 2021–22లో ఇవి 49.44 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో హీరో మోటో షేరు స్వల్ప లాభంతో రూ. 2,514 వద్ద ముగిసింది.

ఇక జియో ఫైనాన్షియల్ సర్వీసులు

- రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడదీత
- వాటాదారులకు ప్రతీ షేరుకీ 1 షేరు జారీ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) తమ ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని ప్రత్యేక కంపెనీగా విడదీయనుంది. ఇందుకు వాటాదారులు, రుణదాతలు తాజాగా ఆమోద ముద్ర వేశారు. తొలుత రిలయన్స్ స్ట్రాటజిక్ వెంచర్స్ లిమిటెడ్(ఆర్‌ఎస్‌ఐఎల్) పేరుతో విడదీయనున్న కంపెనీని తదుపరి జియో ఫైనాన్షియల్ సర్వీసులుగా మార్పు చేయనున్నారు. వాటాదారుల సమావేశంలో ఈ ప్రతిపాదనకు 99.99 శాతం ఓట్లు లభించినట్లు ఆర్‌ఐఎల్ వెల్లడించింది. కాగా.. ఆర్‌ఐఎల్ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ రూ. 10 ముఖ విలువగల ఆర్‌ఎస్‌ఐఎల్ షేరును జారీ చేయనున్నారు. తదుపరి ఆర్‌ఎస్‌ఐఎల్.. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(జేఎఫ్ఎస్ఎల్)గా ఆవిర్భవించనుంది.

సెప్టెంబర్‌కల్లా లిస్టింగ్

జెఫరీస్ రీసెర్చ్ వివరాల ప్రకారం జేఎఫ్ఎస్ఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో సెప్టెంబర్‌కల్లా లిస్టుకానుంది. ఇందుకు అప్పటికల్లా అన్ని అనుమతులూ లభించగలవని అభిప్రాయపడింది. కంపెనీ వెనువెంటనే రుణ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు తెలియజేసింది. అసెట్ మేనేజ్‌మెంట్, జీవిత, సాధారణ బీమా విభాగాలకు నియంత్రణ సంస్థల అనుమతులను కోరనుంది. వీటిని 12–18 నెలల్లోగా పొందే వీలున్నట్లు జెఫరీస్ పేర్కొంది. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసేందుకు గతేడాది అక్టోబర్‌లో ఆర్‌ఐఎల్ గ్రూప్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆర్‌ఐఎల్‌కు పూర్తి అనుబంధ సంస్థగా ఆర్‌ఎస్‌ఐఎల్ వ్యవహరిస్తోంది. ఆర్‌బీఐ వద్ద రిజిస్టరై డిపాజిట్లు సమీకరించని ప్రధాన ఎన్‌బీఎఫ్‌సీగా కొనసాగుతోంది.

ఈ వార్తల నేపథ్యంలో ఆర్‌ఐఎల్ షేరు 1.2 శాతం బలపడి రూ. 2,448 వద్ద ముగిసింది.

కామత్‌కు బాధ్యతలు



ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈవో కేవీ కామత్‌ను జేఎఫ్ఎస్ఎల్‌కు నాన్‌ఎగ్జిక్యూటివ్‌గా చైర్మన్‌గా ఆర్‌ఐఎల్ ఎంపిక చేసింది. 2021–22లో ఈ విభాగం రూ. 1,536 కోట్ల ఆదాయం సాధించింది. రూ. 27,964 కోట్ల సంయుక్త ఆస్తులను కలిగి ఉంది. బ్రోకింగ్ సంస్థ మెక్వారీ వివరాల ప్రకారం జియో ఫైనాన్షియల్ విలువ రూ. 1.52 లక్షల కోట్లకుపైనే. దేశీయంగా ఐదో అతిపెద్ద ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థగా నిలవనుంది.

యువర్స్

• మ్యూజిక్ వరల్డ్

రచిత స్వరాలు

బాలీవుడ్‌లోని అతికొద్ది మంది ఫిమేల్ కంపోజర్‌లలో రచిత అరోరా ఒకరు. 'ముక్కాబాజ్' 'న్యూటన్' 'జడ్జిమెంటల్ హై క్యా' సినిమాలకు స్వరాలు సమకూర్చింది. దిల్లీకి చెందిన రచితకు హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉంది. థియేటర్ ఫ్రెండ్స్ కోసం సరదాగా మ్యూజిక్ కంపోజ్ చేసేది.

అది తన ఫ్రెండ్స్‌కు బాగా నచ్చేది.

'నువ్వు ముంబై బాట పట్టాల్సిందే' అనేవారు.

అలా ముంబైకి వచ్చిన రచిత అనురాగ్ కశ్యప్ 'ముక్కాబాజ్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఫిల్మ్స్‌తో పాటు వెబ్‌సిరీస్‌లకు కూడా పనిచేస్తోంది రచిత. మరోవైపు పాటలకు సంబంధం లేకుండా ఎన్నో ప్రాజెక్ట్‌లకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేస్తుంది.

'బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అనేది సవాలుతో కూడిన పని. ఆసక్తికరమైనది. రకరకాల ఎమోషన్స్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ చేయాలి. ప్రతి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నాకు ప్రత్యేక ప్రయాణం' అంటుంది రచిత.



రచిత అరోరా

మ్యూజిక్ కంపోజ్‌కు ముందు రకరకాల జానర్స్‌కు సంబంధించి రిసెర్చ్ వర్క్ తప్పకుండా చేస్తుంది. రిసెర్చ్‌కు వారాలు, నెలలు గడిచిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ సినిమాకు, వెబ్‌సిరీస్‌కు సంబంధించిన కథాప్రపంచంలోకి వెళ్లడానికి ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతుంది. రచితకు హిందుస్థానీ సంగీతంతో పాటు జాజ్, బ్లూస్‌లో కూడా ప్రవేశం ఉంది.

'ఓటీటీ బూమ్ అనేది న్యూకమర్స్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. యువతకు రకరకాల ప్లాట్‌ఫామ్‌లలో రకరకాల అవకాశాలు ఉన్నాయి' అంటుంది రచిత అరోరా.

• సక్సెస్ స్టోరీ

క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీలకు సంబంధించిన విషయాలపై చదువుకునే రోజుల నుంచి అక్షయ్ మకర్‌కు ఆసక్తి, అనురక్తి.

ఆ ఆసక్తి, అనురక్తులు అక్షయ్‌ని సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రూపుదిద్దుకునేలా చేశాయి.

అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేశాయి.

క్లీన్ ఎనర్జీ స్టార్టప్ 'క్లైమటేన్‌జా'తో పరిశ్రమలకు తక్కువ ఖర్చుతో సోలార్ థర్మల్ ఎనర్జీని అందిస్తున్నాడు అక్షయ్ మకర్...



అక్షయ్ మకర్



శక్తిమంతుడు

దిల్లీకి చెందిన అక్షయ్ మకర్ అక్కడి ఐపీ యూనివర్శిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేశాడు. వాతావరణ మార్పులపై రెండు పరిశోధనాత్మక వ్యాసాలు రాశాడు.

ఒక సైన్స్ ఫిక్షన్ నవల రాయడానికి ప్లాన్ చేసుకున్నాడు.

తనకు ఇష్టమైన సబ్జెక్ట్ సోలార్ ఎనర్జీ. ఈ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతున్నప్పుడు,, డాక్యుమెంటరీలు చూస్తున్నప్పుడు 'సౌరశక్తితో ఎన్నో సాధించవచ్చు' అనిపించింది.

'అంకురం' ఆలోచనకు అప్పుడే బీజం పడింది.

మొరాకోకు వెళ్లి అక్కడి ఉత్తర ప్రాంతంలో ఉన్న సోలార్ థర్మల్ పవర్ టెక్నాలజీ ప్లాంట్‌లను సందర్శించి ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పర్చుకున్నాడు.

1985లోనే సోలార్ థర్మల్ పవర్ టెక్నాలజీ ఆ దేశానికి వచ్చింది. మన దేశంలో ఆలస్యంగా వచ్చింది.

కాలిఫోర్నియాలోని మొజావే ఎడారిలో ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉంది. ఆ తరువాత స్థానంలో స్పెయిన్‌లోని సోల్నోవా సోలార్ పవర్ ప్రాజెక్ట్, అండసోల్ సోలార్ పవర్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి.

పర్యావరణానికి సంబంధించిన ఆసక్తి, అనురక్తి, కృషికి అక్షయ్‌కు ఎన్నో అవార్డ్‌లు లభించాయి.

ఇంధనవనరులకు సంబంధించిన ఒక సదస్సుకు హాజరైన తరువాత అక్షయ్‌కు తన లక్ష్యం పట్ల స్పష్టత ఏర్పడింది. 'క్లైమటేన్‌జా' అంకురంతో తన కలలను సాకారం చేసుకున్నాడు అక్షయ్.

'క్లైమటేన్‌జా'కు సంబంధించి 80 శాతం ప్రాజెక్ట్‌లు మన దేశంలోనే ఉన్నాయి.

మన దేశం విషయానికి వస్తే టెక్స్‌టైల్, ఫుడ్‌ప్రాసెసింగ్, డైరీ, ఫార్మా...మొదలైన రంగాలకు చెందిన పరిశ్రమలతో కలిసిపనిచేస్తోంది కంపెనీ.

ఎస్‌యూ(స్పేస్ యుటిలైజేషన్), టీయి(టెక్నికల్ ఎఫిసియెన్సీ), ఎల్‌సీ(లోయర్ కాస్ట్)పై దృష్టి పెట్టిన 'క్లైమటేన్‌జా' పోటీ కంపెనీలతో పోల్చితే 35 నుంచి 40 శాతం తక్కువ ధరకు పరిశ్రమలకు ఇంధనాన్ని అందించాలనుకుంటుంది.

ర్యాలిస్ ఇండియా, టాటా కెమికల్స్, ఎన్‌సీఎల్... మొదలైన కంపెనీలతో కలిసి పనిచేస్తున్న 'క్లైమటేన్‌జా' తాజాగా కోకాకోలా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది.

వినూత్నమైన ఆవిష్కరణలు చేస్తున్న అంకురాల వెన్నుతడుతున్న చిలీ ప్రభుత్వం అక్షయ్‌ను తమ దేశానికి ఆహ్వానించింది. సోలార్ సీఎస్‌పీ సొల్యూషన్స్‌పై ప్రభుత్వ ప్రతినిధులు అక్షయ్‌తో చర్చించారు. ఈ సాంకేతికతకు ఉత్తర చిలీ సరియైనదని చెప్పాడు అక్షయ్.

'మన లక్ష్యానికి సంబంధించి భిన్నమైన అభిప్రాయాలు వినవచ్చు. అయితే అయోమయానికి మాత్రం గురికాకూడదు. లక్ష్యంపై స్పష్టత ఉంటే ఎలాంటి గందరగోళానికి అవకాశం ఉండదు. ప్రయాణం మొదలుపెట్టినప్పుడు పూలబాటల గురించి కాదు ముళ్ళ బాటల గురించి ఆలోచించాలి. ప్రతికూల పరిస్థితులలో మనకు ధైర్యం ఇచ్చే ఆత్మీయులు ఎవరో ఒకరు ఉండాలి. ఎవరూ లేనప్పుడు మనకు మనమే ధైర్యం చెప్పుకోగలగాలి' అంటున్న 29 సంవత్సరాల అక్షయ్ మకర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

• టెక్... టాక్

షావోమి 13 అల్ట్రా



బాడీ: 163.2×74.6×9.1 ఎంఎం;
వోఎస్: ఆండ్రాయిడ్ 13;
డిస్‌ప్లే: 6.73 అంగుళాలు
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్;
రిజల్యూషన్: 1440×3200 పిక్సెల్స్;
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్, 512జీబి 16జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ • డస్ట్, వాటర్ రెసిస్టెంట్ • ఫింగర్ ప్రింట్ రీడర్

హానర్ ప్యాడ్ వి8 త్వరలో...




రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్;
సైజ్: 11.0 అంగుళాలు;
బరువు: 485 గ్రా.
• మ్యాజిక్ పెన్సిల్
• మ్యాజిక్ కీబోర్డ్;
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
వోఎస్: ఆండ్రాయిడ్ 12;
కలర్స్: బ్లూ, గోల్డ్;
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్
256జీబి 8జీబి ర్యామ్

చలో గూగుల్ బుక్‌స్టోర్

ఖాళీ సమయం దొరకగానే ఫోన్, ప్యాడ్‌లలో ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోలు చూడడం మామూలే. దీనివల్ల తీరికదొరికినా పుస్తకాలు చదివే హాబీ దూరమైపోతుంది. అందుకే ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడాన్ని కూడా భాగం చేసుకోవాలి. ఇందుకు ఫోన్, ట్యాబ్... మొదలైన వాటి ద్వారా గూగుల్ బుక్‌స్టోర్‌లోకి వెళ్లడం ఒక మార్గం.

ప్రపంచ సాహిత్యాన్ని పాఠకులకు పరిచయం చేయడా



నికి 2004లో గూగుల్ లైబ్రరీ ప్రాజెక్ట్ లాంచ్ అయింది.

- గూగుల్ లైబ్రరీ అనేది పుస్తకాలు చదవడానికి, డౌన్‌లోడ్ చేసుకోవడానికి, ప్రివ్యూ బుక్స్ కోసం ఉపయోగపడుతుంది.
- పేజీ టాప్‌లో 'సిమిలర్ బుక్స్' ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా తాము చదువుతున్న పుస్తకానికి దగ్గరగా ఉండే ఇతర పుస్తకాలను సెలెక్ట్ చేసుకోవచ్చు.
- ఏ పుస్తకాన్ని ఎప్పుడు చదవాలో ప్లాన్ చేసుకోవడానికి గూగుల్ క్యాలెండర్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. పుస్తకం చదవాల్సిన టైమ్‌కు ఆటోమేటిక్‌గా గూగుల్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది.
- ఎలాంటి అంతరాయం లేకుండా పుస్తకాలు చదువుకోవడానికి 'డోన్ట్ డిస్టర్బ్' మోడ్ ఆప్షన్ ఉంది.
- సెలెక్ట్ చేసుకున్న పుస్తకాన్ని ఎంతసేపు చదవాలి అనేదాని విషయంలో కాలపరిమితి నిర్ణయించుకోడానికి 'క్లాక్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

• ఇంగ్లిష్ ఇడియమ్స్

బాబ్స్ యువర్ అంకుల్

BOB'S YOUR UNCLE

'ఏం ఫరవాలేదు ఆ పని చాలా ఈజీగా అయిపోతుంది'

'అలా కాదు. ఇలా చేసి చూడు. పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు'....ఇలాంటి సందర్భంలో ఉపయోగించే ఇడియమ్ బాబ్స్ యువర్ అంకుల్. దీని మూలాలు ఇంగ్లాండ్‌లో ఉన్నాయి. అలనాటి బ్రిటిష్ ప్రధాని రాబర్ట్ (బాబ్) తన బంధువు ఒకరిని ఐర్లాండ్ చీఫ్ సెక్రెటరీగా నియమించాడు. బాబ్ బంధుప్రీతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సమయంలో 'బాబ్స్ యువర్ అంకుల్' అనే మాట పుట్టిందని ఒక వెర్షన్ ఉంది. 1937లో వచ్చిన 'డిక్షనరీ ఆఫ్ స్లాంగ్'లో ఈ ఇడియమ్ కనిపించింది.

ఉదా: యూ యాడ్ 2 కప్స్ ఆఫ్ వాటర్ టు ది మిక్స్. హీట్ ఇట్ ఫర్ 5 మినిట్స్ అండ్ బాబ్స్ యువర్ అంకుల్. ది సూప్ ఈజ్ రెడీ.

• గేమింగ్ : నేడే విడుదల



ఒక అడుగు ముందుకు వేసావో... అంతే!

యాక్షన్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'హాగ్‌వార్ట్స్ లెగసీ' నేడు విడుదల అవుతుంది. విజార్డింగ్ వరల్డ్ ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న గేమ్ ఇది. 1800 నాటి కాల నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ స్టూడెంట్స్‌లా మారాల్సి ఉంటుంది. ప్లేయర్స్ జర్నీలో ప్రొఫెసర్ ఎలేజర్ ఫిగ్ ముఖ్య పాత్ర పోషిస్తాడు. ఈ ప్రొఫెసర్‌ను ప్లేయర్స్ ఎలా ఎదుర్కొంటారు అనేది కీలకం. ఈ గేమ్‌లోని ఎన్విరాన్‌మెంటల్ పజిల్స్‌ను ఛేదించడానికి తమ సామర్థ్యాలకు పదును పెట్టాల్సి ఉంటుంది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 4 జానర్స్: యాక్షన్–రోల్ ప్లేయింగ్
మోడ్స్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ నిన్‌టెండో స్విచ్

క్లుప్తంగా...

విశాఖలో రక్షణ సేవల ఆర్థిక సలహాదారు పర్యటన

సాక్షి, విశాఖపట్నం: రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత రక్షణ సేవల ఆర్థిక సలహాదారు ఆర్.చౌబే గురువారం విశాఖ చేరుకున్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరానికి వచ్చిన ఆమె..నేవీకి సంబంధించిన ఏరియా అకౌంట్స్ కార్యాలయాన్ని సందర్శించారు. తూర్పు నౌకాదళ పరిధిలో నిర్వహిస్తోన్న ఆర్థిక వ్యవహారాలపై సమీక్షించారు. కార్యాలయ పని తీరును సమీక్షించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. డీపీడీవో స్పర్శ్ సేవా కేంద్రాన్ని సందర్శించి డిఫెన్స్ పింఛనుదారుల ఇబ్బందులను తెలుసుకున్నారు. రక్షణ దళ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన వారి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన డిజిటలైజ్డ్ పెన్షన్ (స్పర్శ్) విధానాన్ని వివరించారు. ముంబై ఐడీఏఎస్ పీసీడీఏ సతీష్ పెంథార్కర్, విశాఖ డీసీడీఏ ఇన్చార్జ్ వత్సల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైనవారికి ప్రత్యేక తరగతులు

- బీసీ గురుకులాల్లో 14 కేంద్రాల్లో క్లాసులు ప్రారంభం
- ఎస్టీ గురుకులాల్లో 12 సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి

సాక్షి, అమరావతి: ఇంటర్ ఫెయిలైన గురుకుల విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ బీసీ గురుకులాలకు చెందిన 195 మంది ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిలయ్యారు. వారి కోసం 14 కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. వీటిలో ఎనిమిది కేంద్రాలు బాలికలకు, ఆరు బాలురకు ఏర్పాటు చేశారు. పది మందిలోపు విద్యార్థులు ఉన్న ఆరు కేంద్రాల్లో ఆన్లైన్ క్లాసులు, అంతకంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న ఎనిమిది కేంద్రాల్లో ఆఫ్లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. కాగా, ఎస్టీ గురుకుల సంస్థ పరిధిలో ఉన్న 40 జూనియర్ కాలేజీలకు చెందిన 1,667 మంది ఇంటర్ మొదటి సంవత్సరంలో, 1,865 మంది రెండో సంవత్సరం పరీక్షల్లో ఫెయిలయ్యారు. వీరికోసం ఎస్టీ గురుకులాల పరిధిలో కూడా 12 కేంద్రాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక్కో సెంటర్కు 12 మంది లెక్చరర్లను నియమించారు. నెల రోజులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కృష్ణమోహన్, ఎస్టీ గురుకుల సంస్థ జాయింట్ సెక్రటరీ విజయకుమార్ తెలిపారు.

ఇప్పటివరకు ఆఫ్రికన్ బుష్ ఏనుగులు మాత్రమే అతి తక్కువ సమయం నిద్రించే జంతువులుగా గుర్తించబడ్డాయి. తాజాగా.. ఆ జాబితాలో సముద్ర జీవి 'ఎలిఫెంట్ సీల్' కూడా చేరిపోయింది. ఆఫ్రికన్ ఏనుగుల మాదిరిగానే ఎలిఫెంట్ సీల్స్ కూడా రోజుకు కేవలం 2 గంటలు మాత్రమే నిద్రిస్తాయని శాస్త్రవేత్తలు తేల్చారు.



నిదుర ఉండదు.. కుదురుగుండదు

సృష్టిలో అతి తక్కువగా నిద్రించే జీవి 'ఎలిఫెంట్ సీల్'

- విడతల వారీగా రోజుకు రెండు గంటలే నిద్రిస్తాయని గుర్తించిన శాస్త్రవేత్తలు
- 1,237 అడుగుల లోతుకు వెళ్లి మరీ పడుకుంటాయట
- రాత్రి, పగలు వేటాడుతూనే తిరుగుతాయి
- శత్రు జీవుల నుంచి రక్షించుకునేందుకే ఇలా చేస్తాయట

- సాక్షి, అమరావతి

ఏడాదిలో కనీసం ఏడు నెలల పాటు పసిఫిక్ సముద్ర జలాల్లో ప్రయాణించే భారీ క్షీరదాలైన ఎలిఫెంట్ సీల్స్ రోజంతా వేటలోనే నిమగ్నమై ఉంటాయట. గొరిల్లాలు రోజుకు 12 గంటలు, కుక్కలు 10 గంటలు, సింహాలు 20 గంటల వరకు నిద్రిస్తుంటే.. సీల్స్ నిద్ర సమయంలో చాలా వ్యత్యాసం ఉండటం గమనార్హం.

ఆడ సీల్స్ తలపై సెన్సార్లు అమర్చి..

ఎలిఫెంట్ సీల్స్ మెదడు, హృదయ స్పందన, కదలికలు, ప్రయాణించే లోతు, నిద్రించే సంకేతాలను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా సెన్సార్లతో కూడిన వాటర్ప్రూఫ్ సింథటిక్ రబ్బరు టోపీలను ఉత్తర ప్రాంతంలోని ఆడ సీల్స్ తలలపై అమర్చి.. వాటి జీవన స్థితిని శాస్త్రవేత్తలు క్రోడీకరించారు. ఎందుకంటే ఆడ సీల్స్ మాత్రమే ఎక్కువ కాలం సముద్రంలో ప్రయాణిస్తాయి. మగ సీల్స్ ఒడ్డునే ఉంటూ ఆహారాన్ని తింటాయి. ఇవి 4,500 పౌండ్ల వరకు పెద్ద శరీర బరువును కలిగి ఉండటం.. సముద్రంలో ఎక్కువ కాలం మేత వెతకాల్సిన కారణంగా ఈ నిద్ర ప్రవర్తన అభివృద్ధి చేసుకున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మగ ఎలిఫెంట్ సీల్స్కు ఏనుగు మాదిరిగా చిన్న తొండం ఉంటుంది. అందుకే.. వీటిని ఎలిఫెంట్ సీల్స్గా పిలుస్తారు.

వివిధ జంతువులు నిద్ర సమయం ఇలా.. (రోజుకు గంటల్లో)

గుర్రం	2.9
గాడిద	3.1
ఏనుగు	3.9
జిరాఫీ	4.5
మేక	5.3
కుందేలు	11.4
చింపాంజీ	9.7
కుక్క	10.0
పులి	15.8
ఎలుక, పిల్లి	12.5
ఉడుత	14.9
చిరుత	18.0
సింహం	20

(సుమారు)

అది కూడా విడతల వారీగానే..

ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీ జర్నల్ సైన్స్లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం .. ఎలిఫెంట్ సీల్స్ సముద్ర ఉపరితలం నుంచి సుమారు 377 మీటర్ల లోతు (1,237 అడుగులు)కు వెళ్లి నిద్రిస్తున్నట్టు కనుగొన్నారు. ఇవి ఏకబిగిన కాకుండా 20 నిమిషాల కంటే తక్కువ సేపు 'క్యాట్నాప్' (స్వల్పకాలిక) శ్రేణిలో మొత్తంగా 2 గంటలపాటు నిద్రిస్తున్నట్టు అంచనా వేశారు. ఎలిఫెంట్ సీల్స్ పెద్ద మొత్తంలో చేపల్ని వేటాడి తింటాయి. అయితే, ఇవి శత్రు జీవులైన సొర చేపలు, కిల్లర్ వేల్స్ దాడిలో మరణిస్తుంటాయి. ఇవి ఇతర మాంసాహార జీవుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు లోతైన జలాల్లోకి వెళ్లి కొద్ది నిమిషాలపాటు (ర్యాపిడ్ ఐ మూవ్మెంట్) నిద్ర అనుభవిస్తున్నట్టు నిర్ధారించారు.

ఎక్కువసేపు నీటిలోనే..

వాస్తవానికి 10 నుంచి 30 నిమిషాల డైవ్లో కొద్దిసేపు మాత్రమే సముద్ర ఉపరితలంలో ఏనుగు సీల్స్ కనిపిస్తాయి. మిగిలిన సమయమంతా జలాల్లోనే ఈదుతూ ఆహార వేటను కొనసాగిస్తాయి. విచిత్రంగా ఈ క్షీరదాలు సంతానోత్పత్తి సమయంలో తీరంలో రోజుకు 10 గంటల సమయం నిద్రపోతాయి. ప్రతి 30 నిమిషాల పాటు సాగే డైవ్లో సీల్స్ తలకిందులుగా స్లో-వేవ్ స్లీప్ అని పిలిచే లోతైన నిద్ర దశలోకి వెళ్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్కు 12.09, తెలంగాణకు 7.64 ఎకరాలు

ఏపీ భవన్ విభజనపై కేంద్రం ప్రతిపాదన

- స్వాగతించిన ఏపీ..
- ఇంకా స్పందించని తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఏపీ భవన్ విభజనపై కేంద్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 26న కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం వివరాలను గురువారం విడుదల చేసింది. ఏపీ భవన్కు సంబంధించి మొత్తం 19.73 ఎకరాల్లో 12.09 ఎకరాలు ఆంధ్రప్రదేశ్కు, 7.64 ఎకరాలు తెలంగాణకు ఇవ్వాలని కేంద్రం ప్రతిపాదించింది. ఏపీ భవన్ విభజనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు, తెలంగాణ ప్రభుత్వం రెండు ఆప్షన్లు ఉన్నాయని తెలిపాయి. అయితే కేంద్రం ఆప్షన్-ఈతో ముందుకొచ్చింది. కేంద్రం ప్రతిపాదన ఆచరణ యోగ్యంగా ఉందని ఏపీ స్వాగతించిందని కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా స్పందిస్తే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలు వీలైనంత త్వరగా తెలపాలని కేంద్రం కోరింది. తద్వారా సమస్య పరిష్కారానికి సహకరించాలని సూచించింది. ఆప్షన్-డీలో భాగంగా పటౌడీ హౌస్ భూమి 7.64 ఎకరాలు మినహా ఇప్పటికే ఉన్న భవనాలు 12.09 ఎకరాలతోపాటు గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్తో కూడిన మొత్తం భూమిని తెలంగాణ కోరుకుంటోందని కేంద్రం తెలిపింది. జనాభా నిష్పత్తి ప్రకారం తమకు రావాల్సిన దానికంటే ఎక్కువ కోరుకుంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్కు ఆర్థిక సర్దుబాటు తెలంగాణ చేస్తామని చెప్పిందని పేర్కొంది. అయితే కేంద్రం ఆప్షన్-ఈ కింద పటౌడీ హౌస్ మొత్తం 7.64 ఎకరాలు తెలంగాణకు, గోదావరి, శబరి బ్లాకులున్న భూమి సహా నర్సింగ్ హాస్టల్ కలిపి 12.09 ఎకరాలు ఆంధ్రప్రదేశ్కు అని ప్రతిపాదించింది. కేంద్ర హోం శాఖ సమావేశంలో కేంద్ర సంయుక్త కార్యదర్శులు సంజీవ్కుమార్ జిందాల్, జి.పార్థసారథి, ఏపీ ప్రభుత్వం తరఫున కార్యదర్శి ఎల్.ప్రేమచంద్రారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్, అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, తెలంగాణ తరఫున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ఆప్షన్లు ఇవే..

ఏపీ ఆప్షన్-ఏ: తెలంగాణకు శబరి బ్లాక్, పటౌడీ హౌస్లో సగభాగం.. ఏపీకి గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్ బ్లాకు, పటౌడీ హౌస్లో సగభాగం

ఏపీ ఆప్షన్-బీ: ఏపీకి పటౌడీ హౌస్ మొత్తం, శబరి బ్లాకు, తెలంగాణకు గోదావరి బ్లాకు, నర్సింగ్ హాస్టల్

తెలంగాణ ఆప్షన్-సీ: తెలంగాణకు శబరి, గోదావరి బ్లాకులు, ఆంధ్రప్రదేశ్కు నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్

తెలంగాణ ఆప్షన్-డీ: తెలంగాణకు శబరి, గోదావరి బ్లాకులు, నర్సింగ్ హాస్టల్ 12.09 ఎకరాలు, ఏపీకి పటౌడీ హౌస్

కేంద్రం ఆప్షన్-ఈ: ఏపీకి శబరి, గోదావరి బ్లాకులు, నర్సింగ్ హాస్టల్ సహా 12.09 ఎకరాలు.. తెలంగాణకు పటౌడీ హౌస్ 7.64 ఎకరాలు

మార్గదర్శి పిటిషన్ కొట్టేయండి

- దీన్ని విచారించే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదు
- ఏపీ ప్రభుత్వం వాదనలు
- తదుపరి విచారణ 11కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తమ సంస్థ కార్యకలాపాలను ఏపీ ప్రభుత్వం అడ్డుకుంటోందంటూ మార్గదర్శి చిట్ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్ను కొట్టేయాలని ఏపీ ప్రభుత్వ స్పెషల్ ఏజీపీ లలితా గాయత్రి గురువారం తెలంగాణ హైకోర్టును కోరారు. మార్గదర్శి చిట్ఫండ్స్ అక్రమాలపై మంగళగిరి పీఎస్లో కేసులు నమోదయ్యాయని, తనిఖీలూ అక్కడే జరిగాయన్నారు. అలాంటప్పుడు ఇక్కడ పిటిషన్ ఎలా వేస్తారని ఆమె ప్రశ్నించారు. మార్గదర్శి రిట్ పిటిషన్పై విచారణ జరిపే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదన్నారు. తనిఖీలు, జప్తు ప్రక్రియ ఇప్పటికే ముగిసిందని.. పంచనామా కూడా పూర్తయిందని వెల్లడించారు. కాబట్టి మార్గదర్శి పిటిషన్ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ముమ్మనేని సుధీర్ మార్గదర్శి పిటిషన్కు సంబంధించి వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేశారు. తనిఖీల పేరిట మార్గదర్శి రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని.. ఇది చట్ట విరుద్ధం, హక్కుల ఉల్లంఘన అని మార్గదర్శి చిట్ఫండ్స్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అమరావతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన కేసులను విచారించేలా ఆదేశాలివ్వాలని కోరింది. అలాగే సీఐడీ తనిఖీల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వస్తున్నారని.. వారిని అనుమతించడం కుదరదని పిటిషన్లో పేర్కొంది. విచారణ సమయంలో ఉద్యోగులను వేధించకుండా ఆదేశాలివ్వాలని మార్గదర్శి విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్లో హోం శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ, సీఐడీ ఏఎస్పీ తదితరులను ప్రతివాదులుగా పేర్కొంది.

అమరావతిపై రాష్ట్ర ప్రభుత్వం ఐఏ దాఖలు

- 9న సుప్రీం కోర్టులో విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : అమరావతిపై ఏపీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్లొకేటరీ అప్లికేషన్ (ఐఏ)ను సుప్రీం కోర్టు ఈ నెల 9న విచారించనుంది. ఈ మేరకు ఆరోజు విచారణ జరిగే కేసుల జాబితాలో ఈ పిటిషన్ను రిజిస్ట్రీ పొందుపరిచింది. గత విచారణ సమయంలో హామీ ఇచ్చిన మేరకు ఈ కేసులో చట్టబద్ధ వారసుల్ని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇంటర్లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసింది.

మచిలీపట్నం వైద్య కళాశాలకు గ్రీన్సిగ్నల్

- ఇప్పటికే విజయనగరం, నంద్యాల, ఏలూరుకు అనుమతులు
- దీంతో నాలుగు వైద్య కళాశాలలకు 2023-24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు
- రాజమండ్రి వైద్య కళాశాలకు రావల్సి ఉన్న అనుమతులు
- 22న బందరు పోర్టుకు సీఎం జగన్ శంకుస్థాపన : పేర్ని

సాక్షి, అమరావతి/మచిలీపట్నం టౌన్: కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో 150 ఎంబీబీఎస్ సీట్లకు 2023-24 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు చేపట్టడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ), మెడికల్ అసెస్మెంట్ మరియు రేటింగ్ బోర్డు అనుమతులిచ్చింది. ఈ మేరకు గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారికి ఎన్ఎంసీ నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటికే ఏలూరు, నంద్యాల, విజయనగరం వైద్య కళాశాలల్లో రానున్న విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు మొదలు పెట్టడానికి లైన్క్లియర్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మచిలీపట్నం కళాశాలకు కూడా గ్రీన్సిగ్నల్ రావడంతో నాలుగు వైద్య కళాశాలల్లో ఒక్కోచోట 150 చొప్పున మొత్తం 600 ఎంబీబీఎస్ సీట్లు కొత్తగా వచ్చినట్టైంది. మరోవైపు.. రాజమండ్రి వైద్య కళాశాలకు అనుమతులు రావాల్సి ఉంది. ఈ కళాశాలలో కూడా మరో 150 సీట్లు అందుబాటులోకి వస్తాయి. దీంతో ఈ ఏడాది ఏకంగా 750 ఎంబీబీఎస్ సీట్లు పెరగనున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఒకే ఏడాది ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభమవుతుండటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయకుమారి 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈ ఏడాది తరగతుల నిర్వహణకు అన్నీ సిద్ధంచేశామని చెప్పారు. నూతన భవనాల్లో తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యిందని.. ఫర్నిచర్, హాస్టల్కు అవసరమైన సామాగ్రి నెలాఖరుకుకల్లా వస్తుందన్నారు.

రూ.8,480 కోట్లతో 17 వైద్య కళాశాలలు..

రాష్ట్రంలో వైద్య విద్యలో నూతన అధ్యాయానికి తెరతీస్తూ సీఎం జగన్ ప్రభుత్వం రూ.8,480 కోట్లతో 17 వైద్య కళాశాలలు ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రానున్న విద్యాసంవత్సరంలో ఐదుచోట్ల అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారు. మరోవైపు.. 2024-25లో పులివెందుల, ఆదోని, పాడేరు కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించాలని కార్యాచరణ రూపొందించారు. ఇందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,185 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటవుతున్న 17 వైద్య కళాశాలల్లో మరో 2,100 ఎంబీబీఎస్ సీట్లు సమకూరనున్నాయి.

ముఖ్యమంత్రికి 'పేర్ని' కృతజ్ఞతలు



ఇక మచిలీపట్నంలో శరవేగంగా వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్న సీఎం జగన్కి మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని కృతజ్ఞతలు తెలిపారు. 67 ఎకరాల విస్తీర్ణంలో రూ.550 కోట్లతో వైద్య కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని.. నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఇదే క్రమంలో రానున్న విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు చేపట్టడానికి అనుమతులు రావడం సంతోషకరమన్నారు. అలాగే, బందరు ప్రజల చిరకాల స్వప్నమైన పోర్టు నిర్మాణానికి ఈనెల 22న సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అయేషా హత్యకేసులో సీబీఐ దర్యాప్తు

- హైదరాబాద్ సీఏఆర్ జాయింట్ సీపీ శ్రీనివాసులును ప్రశ్నించిన అధికారులు
- హత్య సమయంలో నందిగామ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసులు

సాక్షి, హైదరాబాద్/వన్టౌన్ (విజయవాడపశ్చిమ): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని అయేషామీరా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం హైదరాబాద్ జాయింట్ సీపీ శ్రీనివాసులును సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) జాయింట్ సీపీగా పనిచేస్తున్న శ్రీనివాసులు అయేషామీరా హత్య జరిగిన సమయంలో కృష్ణాజిల్లా నందిగామ డీఎస్పీగా ఉన్నారు. అయేషా హత్య జరిగిన తర్వాత పోలీసుల దర్యాప్తు, అనుమానితుల అరెస్టు తదితర అంశాలపై శ్రీనివాసులును గురువారం దాదాపు 8 గంటలపాటు సీబీఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. తెనాలికి చెందిన అయేషామీరా కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలో బీఫార్మసీ చదువుతుండగా హాస్టల్లో 2007 డిసెంబర్ 27న హత్యకు గురవడం తెలిసిందే. దీనిపై సిట్ను వేసి దర్యాప్తును ప్రారంభించిన అప్పటి ప్రభుత్వం తరువాత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న సత్యంబాబు సుదీర్ఘకాలం శిక్ష అనుభవించిన తరువాత నిర్దోషిగా విడుదలైన విషయం తెలిసిందే. హంతకులెవరో స్పష్టత రాకపోవడంతో అయేషా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు సీబీఐ అధికారులు మరోమారు ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. హత్య సమయంలో ఉన్న హాస్టల్ వార్డెన్ పద్మను బుధవారం ప్రశ్నించారు. ఈ కేసు సమయంలో రాధ అనే మహిళ తన పట్ల సత్యంబాబు అసభ్యంగా ప్రవర్తించినట్లు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మహిళను సైతం విచారించినట్లు తెలిసింది. మొత్తం మీద ఈ కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు విచారణను సీబీఐ తిరిగి ప్రారంభించటంతో దీనిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏసీబీ కేసులో ఐదుగురికి రిమాండ్

నిందితుల్లో విజయవాడ సబ్ రిజిస్ట్రార్, దుర్గగుడి సూపరింటెండెంట్

సాక్షి, అమరావతి/ద్వారకాతిరుమల: ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఇద్దరు అధికారులు, ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులపై కేసులు నమోదు చేసి నిందితులను గురువారం కోర్టుల్లో హాజరుపర్చింది. వారందరికీ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో మూడు రోజులపాటు ఏసీబీ రాష్ట్ర వ్యాప్తంగా పలువురి ఇళ్లలో తనిఖీలు నిర్వహించింది. ఇందులో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ వాసా నగేశ్, అతని భార్య, కుమారుడు, మధ్యవర్తుల సమక్షంలో యూనియన్ బ్యాంక్ లాకర్ తెరిచిన ఏసీబీ అధికారులు 177.9 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,585 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నగేశ్ను అరెస్ట్ చేసి రాజమండ్రి ఏసీబీ స్పెషల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించింది. కాగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖకు చెందిన విజయవాడలోని పటమట సబ్ రిజిస్ట్రార్ అజ్జా రాఘవరావు, ప్రైవేట్ వ్యక్తులైన మట్లి సుబ్బారెడ్డి, వెంపటాపు దుర్గాప్రసాద్, తమ్మిరెడ్డి శివకిరణ్లను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది.

తెలంగాణ

శరత్బాబుపై పుకార్లు సృష్టిస్తే కేసు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్య సమస్యలతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ నటుడు శరత్బాబు ఆరోగ్యంపై ఇష్టారాజ్యంగా వార్తలు రాస్తున్న వారిపై ఆయన సోదరుడి కుమారుడు ఆయుష్ తేజస్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలిసీతెలియకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయడంపై కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆ వార్తల్ని వెంటనే సదరు యూ ట్యూబ్ చానళ్లు, సోషల్ మీడియాలో తొలగించని పక్షంలో సైబర్ క్రైమ్కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం శరత్బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన త్వరలోనే కోలుకుంటారని వైద్యులు చెబుతున్నారని వివరించారు. శరత్బాబు కోలుకోవాలని ప్రార్థిస్తున్న అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కోలుకుని వచ్చిన వెంటనే శరత్బాబు మీడియాతో మాట్లాడతారని వెల్లడించారు.

దిగ్గజ నేతల ఢీ

- సమీపిస్తున్న కర్ణాటక ఎన్నికల తేదీ
- బీదర్ జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల ముమ్మర ప్రచారం
- మెజారిటీ స్థానాల్లో బీజేపీ కాంగ్రెస్ నడుమ ముఖాముఖి
- 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలన

బీదర్ నుంచి కల్వల మల్లికార్జున్ రెడ్డి, సాక్షి ప్రతినిధి

బీదర్ జిల్లా స్వరూపం

జనాభా	: 23,67,587
విస్తీర్ణం	: 5,448 చ.కి.మీ
పట్టణాలు	: 07
గ్రామాలు	: 620
తాలూకాలు	: 08



నియోజకవర్గాల వారీగా ఓటర్లు, అభ్యర్థులు

నియోజకవర్గం	ఓటర్లు	బరిలో ఉన్న అభ్యర్థులు
బసవకళ్యాణ్	2,46,379	10
హుమ్నాబాద్	2,45,846	07
బీదర్ దక్షిణ	2,05,093	10
బీదర్	2,27,920	11
భాల్కి	2,30,721	13
ఔరాద్ (ఎస్సీ)	2,19,210	12

ఉత్తర కర్ణాటకలో అంతర్భాగమైన 'హైదరాబాద్ కర్ణాటక'లోని బీదర్ జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్) నుంచి దిగ్గజ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వరుస విజయాలు సాధిస్తూ వస్తున్న జేడీ (ఎస్) అభ్యర్థి బందెప్ప కాశెంపూర్ (బీదర్ దక్షిణ), కాంగ్రెస్ అభ్యర్థులు రహీమ్ ఖాన్ (బీదర్ ఉత్తర), ఈశ్వర్ ఖండ్రే (భాల్కి), రాజశేఖర పాటిల్ (హుమ్నాబాద్), బీజేపీ అభ్యర్థి ప్రభు చౌహాన్ (ఔరాద్- ఎస్సీ) నుంచి తమ రాజకీయ అనుభవానికి పదును పెడుతున్నారు. మరోవైపు సూర్యకాంత నాగమరపల్లి (జేడీఎస్-బీదర్ ఉత్తర), విజయ్ సింగ్ (కాంగ్రెస్ -బసవకళ్యాణ్), సిద్ధు పాటిల్ (బీజేపీ- హుమ్నాబాద్), సీఎం ఫైజ్ (జేడీ ఎస్- హుమ్నాబాద్), భీంసేన్రావు సింధే (కాంగ్రెస్- ఔరాద్) వంటి కొత్తతరం నేతలు కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ధీటైన సవాలు విసురుతున్నారు. బీఎస్పీ, ఆమ్ ఆద్మీ, కళ్యాణరాజ్య ప్రగతిపక్ష, కర్ణాటక రాష్ట్ర సమితి వంటి పార్టీలు అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నా ఓటర్లపై పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చని 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

భాల్కి

కాంగ్రెస్ కంచుకోటగా పేరొందిన భాల్కిలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ నడుమ సాగుతోంది. భాల్కి నుంచి వరుసగా నాలుగోసారి విజయం కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈశ్వర్ ఖండ్రే పోటీ చేస్తున్నారు. ఈశ్వర్ ఖండ్రే తండ్రి భీమన్న ఖండ్రే 1962, 1967, 1978, 1983లో, సోదరుడు విజయ్ ఖండ్రే 1989, 1994లో గెలుపొందారు. ఇక ఈశ్వర్ ఖండ్రే 2008, 2013, 2018లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. గతంలో ఐదుసార్లు ఓటమి పాలైన ప్రకాశ్ ఖండ్రే బీజేపీ నుంచి, రవూఫ్ పటేల్ జేడీ(ఎస్) నుంచి పోటీ చేస్తున్నారు.

బసవకల్యాణ్

బీజేపీ సిట్టింగ్ స్థానమైన బసవకళ్యాణ్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా మాజీ సీఎం ధరమ్సింగ్ కుమారుడు, స్థానికేతరుడైన విజయ్ సింగ్ను బరిలోకి దించింది. 2018లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన బి.నారాయణరావు కరోనాతో మరణించడంతో 2021లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసిన శరణు సలగర గెలుపొందారు. ప్రస్తుతం శరణు సలగర మరోమారు బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. రిటైర్డ్ ఆర్టీవో సంజయ్ వడేకర్ జేడీ (ఎస్) నుంచి పోటీ చేస్తున్నారు.

ఔరాద్ (ఎస్సీ రిజర్వుడు)

బీజేపీ కంచుకోట ఔరాద్లో వరుసగా నాలుగో విజయం కోసం పశు సంవర్థక శాఖ మంత్రి ప్రభు చౌహాన్ శ్రమిస్తున్నారు. కాంగ్రెస్, జేడీ (ఎస్) పార్టీలు కొత్త ముఖాలను బరిలోకి దింపాయి. విద్యావంతుడైన డాక్టర్ భీంసేన్రావ్ సింధే కాంగ్రెస్ నుంచి, జే సింగ్ రాథోడ్ జేడీ (ఎస్) నుంచి బరిలో ఉన్నారు.

హుమ్నాబాద్

హుమ్నాబాద్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీ(ఎస్) నడుమ త్రిముఖ పోటీ నెలకొంది. 2013 ఉప ఎన్నికతో పాటు 2008, 2013, 2018లో వరుస విజయాలు సాధించిన మాజీ మంత్రి రాజశేఖర పాటిల్ మరోమారు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి వరుస ఓటములు పొందుతూ వచ్చిన సుభాష్ కల్లూర్ స్థానంలో తొలిసారిగా సిద్ధుపాటిల్ పోటీ చేస్తున్నారు. జేడీ (ఎస్) కర్ణాటక శాఖ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి సీఎం ఇబ్రహీం కుమారుడు సీఎం ఫైజ్ జేడీ (ఎస్) అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

బీదర్ (ఉత్తర)

కాంగ్రెస్కు పట్టు ఉన్న బీదర్ ఉత్తర నియోజకవర్గంలో ప్రస్తుతం కాంగ్రెస్, జేడీ (ఎస్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. 2009, 2016 ఉప ఎన్నికలతో పాటు 2018 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన రహీమ్ఖాన్ ప్రస్తుత ఎన్నికలోనూ బీదర్ (ఉత్తర) నియోజకవర్గం నుంచి వరుసగా ఐదోసారి బరిలో నిలిచారు. అయితే రెండు పర్యాయాలు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సూర్యకాంత నాగమరపల్లికి ఈసారి టికెట్ నిరాకరించడంతో చివరి నిమిషంలో జేడీ(ఎస్) నుంచి బరిలోకి దిగారు. ఆర్ఎస్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఈశ్వర్ సింగ్ ఠాకూర్కు బీజేపీ అభ్యర్థిగా టికెట్ దక్కింది. కాంగ్రెస్కు చెందిన శేషీ పాటిల్ చాల్వీ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

బీదర్ దక్షిణ

2008, 2018 ఎన్నికల్లో జేడీ (ఎస్) నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ మంత్రి బందెప్ప కాశెంపూర్ మరోమారు అదే పార్టీ నుంచి బరిలోకి దిగారు. బీజేపీ అభ్యర్థిగా వరుసగా రెండుసార్లు పోటీ చేసి ఓడిన డాక్టర్ శైలేంద్ర బెల్దాలే, కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే అశోక్ ఖేనీ పోటీలో ఉన్నారు.

ఎన్నికల ఫలితాలను శాసించేది డబ్బే

"పార్టీల కంటే వ్యక్తుల మీద ఆధారపడే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ధన ప్రభావం బాగా పెరిగినట్లు కనిపిస్తోంది. రైతులు, పేదలకు మేలు చేసే ఉచిత పథకాలు పెద్దగా లేవు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో రైతులు అసంతృప్తితో ఉన్నారు.

- శ్రీనివాస్ భరే, ఆనంద్వాడీ, భాల్కి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943